
ఆంధ్రమహిళ




NOVEMBER 1949 ANDHRA MAHILA ANNAS 6



ఆంధ్రమహిళా సభ వాన్—విద్యార్థినులు
(శ్రీ శ్రీ పర్లాకిమిడి జమీందారుగారి బహుమానము)



శ్రీమతి రామకృష్ణమ్మగారు
దసరా తెలుగు వక్తృత్వపు పోటీలలో
ప్రథమ బహుమానమును పొందిరి.



కుమారి ఇ. లక్ష్మి
వీణ పోటీలలో ప్రథమ బహుమానమును
పొందినది.

పత్రి22


త్వరలో వస్తున్నది!
వాహినీ వారి
గుణసుందరి
కథ...
డైరెక్టర్... కె.వి.రెడ్డి, B.Sc (HONS)
నిర్మాణము... వాహినీ స్టూడియోస్

విజయవంతమైన 6వ వారం!

ఆంధ్ర దేశములో ప్రజలు తండోపతండాలుగా వచ్చి చూస్తున్నారు

భరణీవారి లైలా-మజ్ను



దర్శకత్వం రామకృష్ణ

తారాగణం

భానుమతి, నాగేశ్వరరావు, సి ఎస్ ఆర్, శివరావు, ఆరణి కృష్ణమూర్తి,

హేమలత, శ్రీరంజని, లలిత—పద్మిని

రచన	ఛాయ	సంగీతం	నృత్యం
సముద్రాల	B S రంగా	సుబ్బరామన్	రాఘవయ్య

ఆంధ్రమహిళ

సంపుటి 6 | నవంబరు '49 | సంచిక 7

సంపాదకురాలు శ్రీమతి దుర్గాబాయి యం యే, బి యల్

సహసంపాదకురాలు శ్రీమతి చన్నఘంటమ్మ, యం యే, యల్ టి

ఆంధ్ర మహిళా సభ, మైలాపూర్

సంవత్సర చందా — అయిదు రూపాయలు

ఆంధ్రమహిళ

సంపుటి 6 | నవంబరు 1949 | సంచిక 7

ప్రధమ ప్రపంచ పౌరుడు

భారత ప్రధాని పండిట్ నెహ్రూ అమెరికా యాత్ర, అపూర్వమైన ప్రాక్పశ్చిమ సంధాన సంఘటనగా, ప్రపంచ శాంత్యవతరణనాందీ ప్రస్తావనగా, శాంతియుత విప్లవ మహానాయకుండైన మహాత్ముని దివ్య సందేశమును విశ్వవ్యాప్తముచేసి, నైతిక బలప్రాశస్త్యాన్ని, పాశవబల అబలత్వాన్ని, నిరూపించునదిగా, ఒక దిగ్విజయ యాత్రయై, భారత చరిత్రలోనేగాక, ప్రపంచ చరిత్రలోనే ఒక ప్రధానాధ్యాయముగా పరిణమించగలదు

అద్భుతమైన రాజనీతి పాశ్చాత్యులది సకలవిధములైన భౌతిక విజ్ఞానమూ, పారిశ్రామిక అభివృద్ధి కలిగి, అఖండ సిరిసంపదలలో, స్వయం సమృద్ధిలో తుల తూగుతున్నారువారు త్రుటి కాలంలో ప్రపంచాన్నంతా భస్మీభూతము చేయగల మారణాస్త్రాలన్నీ వారి సొమ్ము అయితే, ప్రజా విప్లవాన్ని అణచగలిగారా! సాంమ్రాజ్య బలమువే, కుటిల రాజనీతిచే, ప్రపంచములో సగభాగము నాక్రమించుకో గలిగారు గాని, ప్రజా హృదయాల నాక్రమించుకోలేక పోయినారు సహకార సుహృద్భావ రహితమైన అంతర్జాతీయ రాజనీతిగాని, పరదేశ పీడనాశక్తిగల సాంమ్రాజ్య పశుబలముగాని, ప్రజా విప్లవము నణచలేవనుటకు, ప్రస్తుతపు చైనా, ఇండో చైనా, ఇండోనీషియా, ఆఫ్రికాలే ప్రబల సాక్షి నీతి నియమబద్ధమైన అహింసాతత్వ బలము అస్త్రబలమునకన్న మిన్నయనుటకు భారత దేశము సాగించిన శాంతియుత విప్లవము, సాధించిన స్వాతంత్ర్యం, స్థాపించిన సర్వాధికార ప్రజాస్వామ్య ప్రజారాజ్యములే ప్రత్యక్ష ప్రమాణములు

అగ్రరాజ్యాలవారు అణుశక్తి భీతితో అల్లాడిపోవుచున్నారు అమెరికా రష్యన్ వర్గముల మధ్య దినదిన ప్రవర్ధమానములగుచున్న వైషమ్యములచే లోకమంతా క్షుభిత మగుచున్నది ప్రాగ్దేశాలలో చెలరేగుచున్న ప్రజా విప్లవము, ప్రపంచాన్నంతా మ్రింగివేయునేమో యను భయము పాశ్చాత్య సామ్రాజ్యబలములను కలవరపెట్టుచున్నది మూడవ ప్రపంచ సంగ్రామ ప్రళయరుద్ర తాండవమునకు వేదికా నిర్మాణము సంపూర్ణ మగుచున్నది.

ఈ వాతావరణలో, యుద్ధ విరమణకు, ప్రపంచ శాంతి స్థాపనకు వారనుసరించుచున్న విధానములన్నియు విఫలములగుచున్నవను జ్ఞానోదయము కలిగినది పాశ్చాత్యులకు ప్రాగ్దేశములతో సన్నిహిత బాంధవ్య మేర్పరచుకొనిన గాని గత్యంతరము లేదని వారు గ్రహించిరి

ప్రథమ ప్రపంచ పౌరుడు

ప్రాగ్దేశములతో మైత్రికై తమ తహతహను వెలిబుచ్చారు అమెరికా ప్రభుత్వం. యుద్ధ విరమణ, ప్రపంచశాంతి స్థాపన తమ లక్ష్యములని నొక్కిచెప్పారు రాజనీతి కోవిదుఁడైన నెహ్రూ, యీ ఆదర్శ లబ్ధికి మార్గములను సూచించాడు నీతి రహితమైన భౌతిక సంపద స్థిరముకాదన్నాడు శాంతి స్థాపనకు ముఖ్యంగా, యుద్ధ విరమణకన్న యుద్ధ కారణములను కూకటివ్రేళ్లతో పెల్లగించుట అత్యావశ్యకమని నొక్కి చెప్పాడు భవిష్యత్తును గురించిన భయముగాని, గతాన్ని పురస్కరించుకొని మనోవైకల్యముగాని, యుద్ధము నాపుచేయవు ఒక దేశము మరొక దేశముపైన, ఒకజాతి మరొకజాతిపైన అధికారము చలాయింప జూచుట యుద్ధమునకు ప్రథమ కారణము కోటానుకోట్ల ప్రజ అనుభవించుచున్న దారిద్ర్యము రెండవ కారణము ముఖ్యంగా, ఆసియా ఖండంలో ప్రారంభమైన ప్రజా విప్లవములకు యీ పరదాస్యము దారిద్ర్యము కారణములు శతాబ్దాల శాసనత్వముంలో, విద్యా, విజ్ఞాన, పారిశ్రామిక అభివృద్ధులు లేక, దుర్భర దారిద్ర్యము ననుభవించుచున్న పీడితప్రజ జాతీయ చైతన్యంతో, విప్లవ ప్రవాహములో కొట్టుకొని పోవుచున్నది ఈ ప్రవాహాన్ని అరికట్టే బాధ్యత, సమృద్ధ పాశ్చాత్య దేశాలపైనున్నది ఈ బాధ్యతను విస్మరించినచో, ఆ విప్లవ ప్రవాహమువలన వారికే ముప్పుకలుగనున్నది నైతిక పథావలంబనతో యీ పరపీడనను విడచి, పరస్పర సుహృద్భావ మలవరచుకొనిననాడే, యుద్ధమువలన భయము తగ్గునుగాని మారణాస్త్ర సంగ్రహణవలన యుద్ధభయ నిర్మూల మెప్పటికీనీ కాబోదని నెహ్రూజీ, నిర్మొగమాటంగా, నిర్భయంగా, శాంతిస్థాపనకు వలసిన రాజనీతిని విపులీకరించాడు ఈ పథము తక్క, ఏకప్రపంచ వ్యవస్థ స్థాపనకు వేరొండు మార్గము లేదనియు, ఏకప్రపంచ స్థాపన తక్క ప్రపంచశాంతి లబ్ధికి గత్యంతరము లేదనియు, పండిట్‌జీ వాస్తవాన్ని తేల్చి చెప్పారు

ఏక ప్రపంచ వ్యవస్థలో, శాంతి ధ్వజాన్ని ప్రతిష్టింపగల మహావ్యక్తి ఇతఁడేనని పరులు నుతింప, తన సామర్థ్యాన్ని చాటిచెప్పుకొన్న ప్రథమ ప్రపంచ పౌరుఁడు, భారత ప్రధాని

విజయం

ఆంధ్ర మహిళా హిందీ విద్యాలయమునుండి మధ్యమ పరీక్ష వ్రాసిన ఐదుగురు విద్యార్థినులలో నలుగురు ద్వితీయ శ్రేణిలో కృతార్థులైరి ఎనమండ్రు ప్రాథమిక విద్యార్థినులలో, నలుగురు ప్రథమ శ్రేణియందు, ఇరువురు ద్వితీయ శ్రేణియందును కృతార్థులైరి.

మధ్యమ	జ సత్యనారాయణమ్మ.	జి గంగాబాయి.
	టి బంగారమ్మ	పి వరలక్ష్మి
ప్రాథమిక ప్ర శ్రే	టి కమలకుమారి	బి సత్యనారాయణమ్మ.
	ఆర్ హైమవతీదేవి	పి భానుమతి
ద్వి శ్రే.	డి జనకలక్ష్మి.	వి ఎస్ సరళ

వీర్లకు మా అభినందనములు

కరెస్పాండెంటు

అమెరికాలో భారతప్రధాని నెహ్రూ

శ్రీమతి రామకృష్ణమ్మ బి ఎ బి ఇడి

నెహ్రూ తన జీవితమునంతను మాతృదేశము కొరకై వినియోగించుచున్నాడు అనడంలో యేమాత్రం అతిశయోక్తి లేదు మొట్టమొదట నుండియు ఆయన చాల గొప్ప దేశభక్తుడనియు, అన్ని విధముల త్యాగము చేసిన జీవి అని యీ రోజులలో ప్రతివారికి తెలియును వజ్రమునకు మెరుగు పెట్టినట్లు నెహ్రూ భారత ప్రధాన మంత్రి అయినప్పటినుండి ఆయన ప్రతిభ దేదీప్యముగా వెలుగుచున్నది అన్నిటికన్న ముఖ్యముగా యిటీవల ఇండియా, అమెరికాలకు నెహ్రూ చేకూర్చిన స్నేహభావము వర్ణనాతీతము। పూర్వమునుండియు భారతదేశమునకు అమెరికాకు సంబంధము గలదు. నాలుగు శతాబ్దులనాడు కొలంబస్ అనే నావికుడు భరత ఖండానికి నూతన మార్గమును కనిపెట్టవలెనన్న కుతూహలముతో ప్రయత్నించుచుండగా ఆయన పశ్చిమ దిక్కుగా ప్రయాణము సాగించుట వలన అమెరికాను కనిపెట్టినాడు ఆ తరువాత బ్రిటన్ మొదలగు దేశాలనుండి లక్షలాది ప్రజలు పోయి అచ్చట వలస రాజ్యములు ఏర్పరచుకొని 18వ శతాబ్దము చివరకు అమెరికా, యింగ్లండులో పోరాడి స్వతంత్ర రిపబ్లిక్కును



న్యూయార్కు లాగార్డియా విమాన కేంద్రములో ప్రధాని నెహ్రూకు ఆహ్వానమిస్తున్న భారతీయులు

అమెరికాలో భారత ప్రధాని-నెహ్రూ



న్యూయార్కు ఆధికారాహ్వాన సందర్భములో సైనిక వందనాలను స్వీకరించుచున్న ప్రధాని నెహ్రూ

స్థాపించెను. అమెరికా అట్లు చేసిన తరువాత ప్రపంచంలోని తదితర స్వాతంత్ర్య ప్రియదేశము లన్నియుకూడ స్వాతంత్ర్యమును సంపాదించుట కొరకై ప్రయత్నములు చేసెను.

భారత నాయకుడైన శ్రీ లజపతిరాయి అనేక సంవత్సరాలు అమెరికాలో గడిపి అక్కడి రాజకీయ, సాంఘిక విషయములను వర్ణిస్తూ ఒక గొప్ప గ్రంథమును వ్రాసిరి. అనేకులైన అమెరికా రచయితలు సండర్‌లాండు మొదలగు వారు కూడ భారత స్వాతంత్ర్యాన్ని గురించి అనేక గ్రంథములు రచించినారు. రాజకీయాల లోనే గాదు, సాంస్కృతిక విషయములలో కూడ శ్రీ వివేకానంద, శ్రీ రాధాకృష్ణన్ మొదలైన తత్వవేత్తుల మూలంగా ఇండియా—అమెరికాలకు సన్నిహిత సంబంధం ఏర్పడినది.

ఈ విధముగా చేకూరిన స్నేహమును గట్టిపరుచుచు ట్రూమన్ - నెహ్రూ సమావేశం అమెరికా భారతదేశ చరిత్రలలో నూతన అధ్యాయాన్ని కల్పించ వచ్చునేమో! రష్యా, అమెరికాలకు ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం మునుపున్న మన స్పర్ధలకన్న పదిరెట్లు పెరిగినది. అమెరికా, ఇంగ్లండులు, ఇండియా తమ తరుపు చేరి రష్యాతో యుద్ధము చేయుటకు సిద్ధపడునేమో అని భ్రమపెట్టుకొని యున్నారు. కాని నెహ్రూయొక్క ప్రకటనలవలన అమెరికనులకు ఒక విషయము బాగుగా తెలియవచ్చినది.

అమెరికాలో భారత ప్రధాని నెహ్రూ

అదేమిటంటే, భారతదేశం ఎల్లప్పుడూ ప్రపంచమందు శాంతిని వృద్ధిపరచుటకే ప్రయత్నించుననియు, ప్రత్యేకంగా ఒక పక్షంలో చేరి, రెండవదానిపై పగ సాధించడానికి అంగీకరించదనియు బ్రిటిష్ కామన్వెల్తులో నిలిచిపోయినంత మాత్రాన తప్పనిసరిగా ప్రతి సందర్భంలోనూ, ఇంగ్లండు అమెరికాలనే అనుసరిస్తుందనే పొట్టి అపోహలను జనులయొక్క మనస్సులనుండి తొలగింపచేసాడు నెహ్రూ చిట్టచివరకు యుద్ధమేగాని సంభవించిన ధర్మ్మకును కాపాడుటకై భారతవర్షం కూడ యుద్ధంలో పాల్గొనవలసి వచ్చునేమో అనికూడా నెహ్రూ స్పష్టపరిచాడు నెహ్రూ ఒక్క భారతే ప్రధానియే గాదు—ఆశియా ఖండానికంతకూ ప్రతినిధి తూర్పు దేశాలలో పాశ్చాత్యులు వలస రాజ్యములను స్థాపించి యింతవరకు యిష్టము వచ్చినఆట ఆడినారు కాని యికముందు అటువంటి సంగతి జరగబోదని నెహ్రూ అంటున్నాడు

భారతదేశం పారిశ్రామికంగా చాల వెనకబడియున్నది ఇక్కడ పరిశ్రమలను అభివృద్ధిలోనికి తీసుకు రావలెనంటే ధనాన్ని, యంత్రసామగ్రినీ, నిపుణుల సహాయాన్నీ మనం అమెరికానుండి తీసుకొనవలెను ఇంతమాత్రంచే రాజకీయాలలోకూడ మనము అమెరికాకు లోబడివుంటాము అన్నమాటకాదు స్వేచ్ఛగా, బుద్ధిపూర్వకంగా మనము మన అభివృద్ధికొరకై కొంతకాలముపాటు అమెరికా సహాయాన్ని పొందుట ఉభయ



లాగార్డియా విమాన కేంద్రంనుంచి మోటారులో వచ్చి న్యూయార్కు నగరంలో దిగుతూఉన్న ప్రధాని నెహ్రూ

అమెరికాలో భారత ప్రధాని నెహ్రూ



అమెరికా శాసన సభల సమావేశములో నెహ్రూ ఉపన్యాసానంతరము జరిగిన విందులో నెహ్రూ డీన్ అచిసన్ కొనల్లీ గార్లతో సంప్రతింపు

దేశాలకూ శ్రేయస్కరం నెహ్రూ యింకొక ముఖ్యమైన విషయము స్పష్టపరచెను అదేమంటే భారతదేశం ఎప్పుడుకూడ, ఎటువంటి విషయములలోనైనా సరే, వాస్తవిక స్థితిగతులను గుర్తింపకుండ పనులను చేయదు ఈ విధముగా పండిట్ నెహ్రూ మన దేశము తరపున మహోన్నతమైన సందేశమును అమెరికాకు అందజేసెను అమెరికాలో నెహ్రూకు జరిగిన గొప్ప సన్మానానికి భారతదేశం నిజంగా చాల గర్వించవచ్చును అమెరికా యాత్రలో నెహ్రూ స్పష్టపరచిన సౌమనస్యమూ, రాజనీతి, ప్రశంశార్హములు ప్రపంచంలోనికెల్ల ప్రథమ పౌరుడని చాల మేధావులైన అమెరికనులతనిని అభినందించారు మొన్న మొన్నటివరకు ఇంగ్లండుతో స్వాతంత్ర్యము కొరకు పోరాడి, ఈనాడు ఇంగ్లండు పట్ల మిక్కిలి స్నేహ భావంతో నెహ్రూ మెలగుట అమెరికనులకు చాల ఆశ్చర్యమును గల్గించినది

నెహ్రూ ముఖ్యముగా శాంతి దూతయని చెప్పవచ్చును నవంబరు 14కు వారికి షష్టిపూర్తి 4 దశాబ్దాలు, మాతృదేశపు సేవజేసి, స్వాతంత్రమును సంపాదించాడు పశ్చిమ ఖండాలవారు ఈతనిని ప్రపంచనాయకుడుగా పరిగణించునట్టి బుద్ధి శక్తిని ప్రస్తుతపు అమెరికా పర్యటనములో విదితముజేశాడు గాంధీజీ వారసుడుగా, శాంతిదూతగా, ప్రపంచశాంతిని నెలకొల్పుటకు దైవ మీతనికి పరిపూర్ణ ఆయురారోగ్యములను ప్రసాదించుగాక

పిల్లల శిక్షణ-శాస్త్రీయ దృక్పథం

శ్రీమతి దరిశి సుభద్రమ్మ

భయం కోపం మొదలైన మనః ప్రవృత్తులు

తల్లి స్తన్యపానమువల్ల, అందిన పదార్థాల్ని నోటిలో పెట్టుకొని కొరకాలన్న వాంఛవల్ల, బిడ్డకు కొన్ని అనుభవాలు కలిగినవి. అదే విధంగా భయం, కోపం మొదలైన మనో ప్రవృత్తులవల్ల (Emotions) మరి కొన్ని అనుభవాలు కలుగుతాయి.

భయం :—

ప్రారంభదశలో, మనచేతుల్లోనున్న శిశువును తటాలున క్రిందపడుకో బెట్టినగాని, బిడ్డ క్రిందనున్న పక్క బట్టల్ని చటుక్కున లాగినగాని, భయంతో బిడ్డ ఉలిక్కిపడుతుంది. తలుపులు తెరచేటప్పుడు మూసేటప్పుడు అయ్యే చప్పుడుకు, చేతిలోని పాత్ర మొదలైన వస్తువులు క్రిందబడి టంగుమని శబ్దమయినపుడు, బిడ్డ ఉలిక్కి పడుతుంది. ముఖ్యంగా బిడ్డ నిద్రలోనున్నప్పుడు ఈలాంటి కఠోర శబ్దములయితే, బిడ్డ అత్యధిక భయాన్ని వెలిబుచ్చుతుంది.

కోపం :—

బిడ్డ తలను అటునిటు త్రిప్పకుండ అట్టే పట్టుకొన్నా, కాళ్లు చేతులను ఆడించకుండేటట్టు పట్టుకొన్నా, అది అసహాయతవల్ల ఆగ్రహాన్ని చూబెట్టుతుంది. కొంత పెరిగి గ్రహించే శక్తి అభివృద్ధియైనపుడు బిడ్డ వాంఛలు కోరికలు (Desires) నెరవేరని సమయాల్లోమాత్రమే కోపోద్రేకాన్ని వెలిబుచ్చుతుంది. ఈలాంటి విషయాల్లోనే గాక తన కపరిచితమైన, అయిష్టమైన సందర్భాలన్నిటిలో గూడ బిడ్డ భయం కోపం మున్నగు ఉద్రేకాల్ని వ్యక్త పరుస్తుంది.

ఆతురత :—

బిడ్డ ఆకలికీ, నిద్రకూ, మరేదైన అవసర మయినపుడూ, హఠాత్తుగా ఏడ్వటం మొదలెట్టుతుంది. ఒకే పోరు పెట్టుతుంది. తనకు కావలసినది తక్షణమే లభించాలి. అలా లభించకపోతే కోపం, లభించితేసంతోషం చూబెట్టుతుంది. అనగా బిడ్డ వాంఛలు కోర్కెలు (Impulses, desires) ఒక త్రుటి కాలంలో తృప్తి చెందాలి. ఎంత మాత్రం ఆలస్యమయినా సరే, అది ఓర్చుకోజాలదు. పైగా ఎంతో బాధ పడి పోతుంది. ఇంతేగాదు, తను కోరిన పదార్థమంతా కావాలని కూడ పోరు పెట్టుతుంది. బిడ్డయొక్క ఇట్టి ప్రవర్తనల్ని తల్లి పరిశీలించుట అవసరం. బిడ్డకు కాల దేశ పరిమాణం ఎంత మాత్రం తెలియదు :—ఆకలి అవుతుండగా ఆహారం కడుపులో పడాలి. నిద్రవస్తుండగా నిరాటంకంగా నిద్ర పోవాలి. ఏ పదార్థమైనా సరే, అది ఎంతదూరంలో నున్నా సరే, కోరినక్షణమే తనచేతుల్లో పడాలి. వేయేందుకు ! బిడ్డలో వాంఛలు కోరికలు (Impulses, desires) ఉద్భవమందిన తక్షణం నెరవేరాలి, కాని వేచివుండటం అనే విషయం బిడ్డలకు తెలియదు. అనగా, కోర్కెలు పుట్టటం నెరవేరటం అనే వాటి మధ్య కాలాన్ని బిడ్డ ఎరుగదన్న మాట. (నిత్య వర్తమన్న మాట.) తనకు అవసరమైన పదార్థము లభించుతుంది కాని వేచివుండాలన్న జ్ఞానంగాని, తనకది ఎంత అవసరం అన్న విచక్షణగాని బిడ్డకుండవు. కాబట్టే, వెంటనే తనకోర్కెలు తృప్తిచెందకపోతే ఆ బాధ దానికి అపరిమితంగా గోచరిస్తుంది. సంతృప్తి చెందితే సంతోషం కూడ అపరిమితంగానే వుంటుంది. కనుక తల్లి బిడ్డవాంఛల్ని, కోరికల్ని వెంటనే తీర్చినయెడల బిడ్డయొక్క సంతృప్తికీ సంతోషానికీ కారణ భూతురాలవుతుంది. అలక్ష్యంచేస్తేగాని ఆలస్యంచేస్తేగాని, బిడ్డ అసంతృప్తికి, ఆశాభంగం, ఆగ్రహం, నిర్నిమిత్తమైన భీతి మొదలైన బాధకరమైన ఉద్రేకాలకు కారణభూతురాలవుతుంది. అంచేతనే తల్లి శిశు మనస్తత్వాన్ని చక్కగా నెఱిగి మెలకువతో మెలగాలి.

ఒక ఉదాహరణం తీసికొందాం :—ఒక యువతి తన సుమారు ఆరు నెలల బిడ్డను తోపుడుబండిచుట్టు దిండ్లు వేసి (అనగా వెనక ఒత్తుకుదిండు, ఇరు ప్రక్కల రెండు దిండ్లు) కూర్చుండ బెట్టి, తన భర్తతో మాట్లాడుతూ నిలుచుంది, ఆడుకోటానికి బిడ్డచేతిలో ఒక ఆటవస్తువునుకూడ పెట్టింది. కాని, బిడ్డ ఆట వస్తువును పారవేసి, తన తల్లినీ, తండ్రిని అట్టే చూడసాగింది. వారుదాన్ని గమనించ లేదు. వింత వింత శబ్దాలుచేయసాగింది కాని లాభం లేక పోయింది. మెల్ల మెల్లన ఏడ్వ నారంభించింది. అప్పటికీ తల్లి గమనించ లేదు. ముందుకూ, వెనుకకూ పడుతూ పోరు పెట్టసాగింది. మాటలలో మునిగిపోయిన తల్లి వినిపించుకో లేదు. ఎవరో కొట్టినట్టు తటాలున కెవ్వుమని కేక పెట్టింది. తల్లి తిరిగి చూచింది ఓరిగిల పడుకోబెట్టిన బిడ్డపిడికిలి బిగించి కోపంతో తల్లిని చురచుర చూస్తూ కూర్చుని ఉంది. ముఖం యెఱ్ఱగా కంది పోయింది. దాని కోపం, తక్షణమే చల్లారి దాని ముఖంలో సంతృప్తి సంతోషాలు వ్యక్తమయినాయి.

బిడ్డ పెరుగుతూ, గ్రహణశక్తి వృద్ధి అయిన కొలదీ, అనుభవముల ఫలితంగా బిడ్డయొక్క వాంఛలు కోరికలలో, కోపతాపములలో తీవ్రత తగ్గుతూవస్తుంది. క్రమేణ ఆతురత తగ్గి, కాలదేశ పరిజ్ఞానము, తన కోర్కెలు ఈరేడుతవి అనే నిరీక్షణ, నమ్మకం కలుగుతూ వస్తాయి. కోపం కలిగి నప్పటికీ, కొద్దికాలం క్రితమే తనకు లభ్యమయిన తల్లి వాత్సల్యం గురుతుకు రావటం ప్రారంభమవుతుంది. తనకు త్వరలో తృప్తి కలుగుతుందని నిరీక్షణ ఏర్పడుతుంది. మరింత విపులంగా చెప్పాలంటే, తల్లి కాళ్ల చప్పుడువలన, కంఠధ్వని వలన, స్పర్శమున, తనకు పాలివ్వటానికి ముందు స్నానం చేయించే సన్నాహము శబ్దంవలన (నీళ్లుతోడునపుడు అయ్యే చప్పుళ్లు వగైరా) తన కోర్కె నెరవేరుతుందనే నిరీక్షణ ఏర్పడుతుంది. కనుక, బిడ్డ కిదివరకున్న కోపం, ఆతురత తగ్గుతూ, ఓర్పు నిరీక్షణ, నమ్మకం మొదలైన గుణాలు పట్టుబడుతాయి.

తల్లికి ఓర్పు అత్యవసరము :—

బిడ్డ శారీరకంగా, మానసికంగా అనుక్షణం పెరుగుతూ వుంటుంది. ఆలా పెరగటంలో అది అనేక దశలను గడపవలసి వున్నది. అందువల్ల తల్లి బిడ్డయొక్క అభివృద్ధి క్రమంలోని ప్రతిదశను పరికించుతూ, పరిశీలించుతూ విజ్ఞాన విచక్షణలతో తోడ్పడాలి. ఎంతో ఓర్పు ఉండాలి. అయితే ఆ ఓర్పు విజ్ఞాన యుక్తమయినదిగా వుండాలి అనే విషయాన్ని జ్ఞాపకముంచుకోవాలి.

శైశవదశలో, బాల్యదశలో, బిడ్డయందు ప్రదర్శితమయ్యే కొన్ని ప్రవర్తనలు, పెద్దవాళ్లకు చాల వింతగానూ, విచారకరంగాను గోచరించవచ్చును. కాని అవి బిడ్డయొక్క అభివృద్ధి క్రమంలో సహజమైన ప్రవర్తనలు. ఉదాహరణకు బిడ్డ కొరికే ప్రవర్తనను తీసికొందాము. ఇదివరకే తెలుసు కొన్నట్లుగా, అది బిడ్డయొక్క అభివృద్ధి క్రమంలో అవసరమైన ఒకనొక కదా! అంటే, పళ్లురావటానికీ, పదార్థ పరిజ్ఞానానికీ ఆలా కొరుకుతుందన్న మాట, (శారీరక మానసిక అభివృద్ధికి. ఆ విధంగానే, బిడ్డ, ఒకానొక దశలో తన మల మూత్రాలతో అసహ్యతన్న మాట లేక ఆడుకొంటుంది. దేహాన్నీ, దుస్తులనూ మురికి చేసుకొంటుంది. బిడ్డకు అసహ్యత, అశుభ్రత అనేవి తెలియవు. ఆ రీతిగానే కోపం పెంకితనం వెలిబుచ్చుతుంది. తల్లి ప్రశాంతంగా వుండి, బిడ్డకు మెళకువతో తోడ్పడితే, ఈ దశలు క్రమ క్రమంగా గడచిపోతవి. ఆలా చేయకుండా, తల్లి బిడ్డను మందలించితే మరింత పెంకెతనం చూబెట్టుతుంది. అతి బాల్యంలోనే బిడ్డలు సహజంగా సూక్ష్మగ్రాహులు. విసుకునూ, ఆగ్రహాన్నీ, ఆతురతనూ తల్లి ముఖంలో, కంఠధ్వనిలో, స్పర్శలో చక్కగ గ్రహించి మరింత ఎక్కువగా పెంకె తనాన్ని చూబెట్టుతారు. చీటికీ మాటికీ చీదరపడు తల్లిని మరింత ఎక్కువగా చీకాకు బెట్టుతారు. ప్రశాంతంగా ప్రేమతో తోడ్పడే తల్లిని చీకాకు పెట్టరు. పిల్లలు పెద్దలవలే ప్రవర్తించాలనుకోటం కేవలం అజ్ఞానాన్ని సూచించుతుంది. అట్లనుకొను వారియందు శాస్త్రీయ దృక్పథం ఎంత మాత్రం లేదనుట తేట తెల్లం! కాబట్టితల్లి, తన మాటలలోగాని, చేతలలోగాని, ఆగ్రహం, అసంతృప్తి ఎంత మాత్రం చూబెట్టకుండా మంచి తెలివి తేటలతో, సహనంతో బిడ్డయొక్క అభివృద్ధికి తోడ్పడాలి.

(సశేషము).

మృత్యువు - మానవుడు

రచన : రామరత్న బడోలా   అనువాదం : ఆర్. సోమసుందరరావు.

అతడు దీర్ఘకాయుడు, భసితాంగుడు, పల్లవారుణ జటాభరుడు, శంకధరుడు, కమండలహస్తుడు, అశాంతి మయ రేఖాంకితఫాలుడు.

మానవుడు భయంకర కందరంనుండి వెలువడి సమీప మందలి సెలయేటి నీరుతో కమండలమును నింపినాడు.

కందరమందలి ప్రతివస్తువూ నిబిడ తిమిరాచ్ఛాదితమై యుంది. అనేక విష ప్రాణికోటులు అందు విచ్చల విడిగా విహరిస్తున్నాయి. మానవునికి వీని చింతేలేదు. వీని భయం లేదు. ఒక ఉన్నతశిలపై అతడు కఠోరదీక్షాపరతంత్రుడై నిర్వికల్పధ్యానసమాధియందు లీనమైనాడు.

శతాబ్దాలు గడచాయి. యుగాలు మారేయి. మానవుని నిశ్చలధ్యాన సమాధి నిరాటంకముగా సాగింది. అతనిపై వల్మీకం పుట్టుకొచ్చింది. ఆ వల్మీకంలో అతడు మునిగినాడు.

చిరునవ్వు చిందులు త్రొక్కు బాలభాస్కరుని ప్రసన్నతారోచిస్సులను మానవుడు పరికించాడు. అతని హృదయము ఆనందంతో నర్తించింది. అర్కుని అతడొక మహాశక్తిగా పరిగణించి అతనిని ఆరాధించాడు. ఉరుములు మెరుములతో వర్షమిచ్చు వరుణదేవుని ప్రశంశించాడు. పృథ్వియొక్క ఆకుపచ్చని ప్రదేశాలను అవలోకించాడు. రంగురంగుల పువ్వుల ఘూసురటి అతని నాసికారంధ్రాలలోనికెగసింది. ఇవన్నీ విశ్వ నిర్మాతయగు నీశ్వరుని జ్ఞప్తికి దెచ్చింది.

ముగ్ధ మానవుడు వీనినన్నిటినీ ఆరాధించాడు. ఈశ్వర మహిమను భక్తిభావ రసాదులతో గీర్తించాడు. కాని అతనిలో మరేవిధమైన పరిణామమూ కలుగలేదు.

శతాబ్దాలు గడిచినాయి. యుగాలుమారినాయి. అతడు కోరిన పరిపూర్ణ హృదయ సంతోషం, అమూల్యమనశ్శాంతి అతనికి లభింపలేదు. మృత్యు నిర్భయుడైన, చిరంజీవియైన ఆ మానవునిపై సదా చింతావర్షం కురిసింది.

“నేను అమరుడను; మృత్యువు నన్ను సమీపింప శక్తి లేదు. అంతా సరియే. అన్నీ నాకనుకూలమే. కాని నాకు శాంతి యెక్కడా లభించదే?” మానవుడు విలపించాడు.

తుపాను చెలరేగింది...పిడుగులు పడినాయి...హోరున వర్షం కురిసింది...భోరున గాలివాన పర్వతాలను, వృక్షాలను కూకటివ్రేళ్లతో పెల్లగించింది....భూకంపం అగణిత పరివర్తనాలను వసుధపై ప్రసాదించింది. కాని మానవుని తపస్సునకెట్టి భంగమూ కలుగలేదు.

ఒకరోజు...

ఒక హీనస్వరం, క్షీణించు విషాద నిశ్వాసం అతని చెవులు సోకింది. తన తపస్సునకు భంగం కలుగకూడదని మానవుడెంతో యత్నించాడు. అతని ప్రయత్నం భగ్నమయింది. యంత్రంవలె అతడు లేచి మైదానాలను, నదీగిరులను దాటి వెడలినాడు. ఎక్కడికో?...

కారణం అతనికీ తెలీదు...బహుశా ఓసారి క్రిందపడినాడేమో. అతని పాదాలవద్దనుండి ఒక దీనస్వరం వెలువడింది.

మానవుడు కలయజూచినాడు. రక్తమాంసాలు గోల్పోయి అస్థిపంజరంతోవున్న ఒక స్త్రీమూర్తి దీర్ఘ ఉచ్ఛ్వాసం తీసుకొంటూవుంది.

“ఎవరు నువ్వు?”—అని మానవుడు ప్రశ్నించాడు.

“నేను...మృత్యువును”

మానవుడు జలదరించాడు.

“పాపీ! అమరమానవుని తాకుతావూ నీవు? వెళ్లు దూరం...”—మానవుడు కళ్లెర్రజేసినాడు.

నిస్సహాయ మృత్యువు అతన్ని చూసింది ..అతని మాటల్ని విన్నది. మరి గ్రహించింది.

“ఇదుగో, నావద్ద శాంతియున్నది.. ఈ అమూల్యనిధిని నా ఉపాసకులకూ, సేవకులకూ మాత్రమే యిస్తాను. నన్నారాధిస్తావూ? నన్ను ప్రేమించవూ?...హా...

నన్నెవ్వరూ దరిచేరరే?"—మృత్యువు గద్గదికతో వాపోయింది.

అమరమానవుడు పటపట పండ్లుగీకినాడు. పిడికిలిని బంధించినాడు. "పిశాచీ! వెళ్లు... వెళ్లు. నన్ను మోసగించుటకు వచ్చావ్రా?" అంటూ ముందుకు సాగినాడు.

మృత్యువు తన క్రోధానలాన్ని మ్రింగింది..."వికారంలో సౌందర్యం వుందనీ, తిరస్కృతంలో శాంతియున్నదనీ బుద్ధిహీన మానవునికేం తెలుసు?" అని అనుకొన్నది.

ఆది మానవునికి యెక్కడా శాంతి లభించలేదు. అతడు తన తపోజీవనంనుండి వెలిపడ్డాడు.

శాంతికోసమై మానవుడు తన జీవితగతిని \మరోవైపుకు త్రిప్పినాడు. శరీరపుష్టికై పొలాలను పండించినాడు. అడవుల్లో మృగాలను వేటాడినాడు. వేటాడుటకు తగిన పరికరాలను సేకరించినాడు. విల్లమ్ములను వినియోగించినాడు... వియోగ నారీమణిని కరుణాకంపముతో దరిజేర్చుకున్నాడు.

ఇరువురినుండి ముగ్గురైరి. ముగ్గురునుండి నలుగురైరి. ఇలాగే పరివారం పెరిగింది. వారి రక్షణకై, పోషణకై మానవుడు తన దేహబలాన్నీ, బుద్ధిబలాన్నీ అభివృద్ధి నొనరించాడు. తన పూర్వ చింతనలన్నీ విడిచి 'కర్మ'లో విలీనుడైనాడు. ఇప్పుడతడు శాంతికోసమై యెక్కువగా అలమటపడుటలేదు. తన స్త్రీ వ్యామోహంలోనూ, పసిబిడ్డల ముద్దుమాటల్లోనూ పూర్ణ సంతోషాన్ని పడయగల్గినాడు. పూర్వముకన్న సుఖమయ జీవుడైనాడు...

మానవుడు వృద్ధుడైనాడు. మృత్యువుయొక్క ఆవశ్యకతను గుర్తించినాడు, చిరంజీవిగానుండుటకు నిరసించినాడు. మృత్యువును యేవగించుకొనుటకు బదులు ప్రేమింప నారంభించినాడు. మృత్యువు ఒడిలో శాశ్వత శాంతినీ, నిజమైన ఆనందాన్నీ అనుభవించుటకు ఉత్సుకుడైనాడు...

మృత్యువు మానవునిపై విజయమందింది. మానవుడు పరాజయంలోకూడ విజయాన్ని చేపట్టినాడు.

ఒకరోజు రాత్రి నిద్రించు మానవుని మృత్యువు సమీపించింది...ఇప్పుడామె సర్వసుందరాంగియై, ప్రసన్నతా వదనయై వెలుగుతూవుంది.

మానవుడామెను సమీపించి యిలా అన్నాడు—"నా మునుపటి మూర్ఖతను మన్నించు తల్లీ!"

మృత్యువు చిరునవ్వు నవ్వుతూ అతని కపోలాన్ని చుంబించింది. మానవుడు చిరశాంతిని పొందినాడు.

[హిందీ మాసపత్రిక 'ఆంధీ'నుండి.]

★

తెలుగు పడుచు

తెలుగువారి పిల్లవటే!
తీరెరిగిన కన్యవటే!
గోదావరి తల్లిపాట
గొంతునిండ పాడుకొనే ॥ తెలుగు ॥

పసుపుంబారాణి వెలుంగు
నొసటునగరు చుక్కవెలుగు
మిసిమి—సెమ్మోని వెలుగు
దుసికింతల నగవు వెలుగు ॥ తెలుగు ॥

ముచ్చటైన వాల్జడలో
మొగ్గమల్లె పులకరించి
మొయిలువన్నె కురులనడుమ
మొగలిరేకులందగించి ॥ తెలుగు ॥

జిలుగుపైట తెరచాటున
తెలుగు పాలకడవలూరసి
కలంగిజారు బరువుకనుల
తెలుగునీలి చూపుమెరసి ॥ తెలుగు ॥

శ్రీ సూరంపూడి భాస్కరరావు



భ్రాంతి

* * *

స్వీయ సంస్కృత రచనానువాదమైన ఏకాంకిక

* * *

జ్యోశ్యుల సూర్యనారాయణమూర్తి

శంకర శాస్త్రి	—	ఒక పండితుడు
సుభద్ర	—	పండితుని భార్య
ఇందిర	—	శంకరశాస్త్రి కూతురు
రమేశుడు	—	ఇందిర భర్త
ఉమేశుడు	}	రమేశుని మిత్రులు
గోపాలుడు	}	రమేశుని మిత్రులు
కేశవుడు	}	రమేశుని మిత్రులు
ఒక బాలుడు	—	పరిచారకుడు

విద్యార్థులు.

౧ వ రంగము

(శంకరశాస్త్రి అనుష్ఠానమును పూర్తిచేసుకొని కూర్చుంటాడు. —భార్య వస్తుంది)

శం : ఇదిగో ! నా జపమైపోయింది. విద్యార్థులు వస్తారు, వాళ్ళకి పాఠాలు చెప్పటం అయ్యేసరికి నువ్వు వంట కానివ్వాలి.

సుభద్ర : సరేగాని, ఇంకా విద్యార్థులు రాలేదుగదా ! ఈ లోపుగా నేనో విన్నపము చెయ్యొచ్చా ?

శం : ఆహా ! ఏం ? వంట ఏమన్నా చెయ్యాలా ?

సు : అబ్బే ! అల్లాటిపని చెపుతానా ? అది నే చెయ్యలేనా ? మీ కెందుకు ? పిల్లకి పదేళ్లు వచ్చాయి. దానికి తగిన వరుణ్ణి చూచి వివాహం చెయ్యాలికదూ ! ఆ విషయం ఏమన్నా ఆలోచిస్తున్నారా ? అని,

శం : ఇందిర పెళ్లిమాటా ? బాగా చెప్పావు. ప్రయత్నిస్తా. రాజమండ్రిలో ఒక పిల్లవాడున్నాట్ట. బి. ఏ. చదువుతున్నాడు. తల్లిదండ్రులు మంచివాళ్లు సదాచార సంపత్తి గలవాళ్లు అని వినికిడి.

సు : అల్లాగా ! అయితే ప్రయత్నిస్తానంటారేం ? జరుగుతోందన్నమాటే ప్రయత్నం ? మరోలా అనుకోవద్దు. ఆడదాన్ని కనక నాకే తొందరున్నట్లు మాట్లాడాను.

శం : అబ్బెబ్బే ! ! అదేమిటి ? ఈ విషయంలో నాకేమీ స్వాతంత్ర్యం లేదు. కాళిదాసు "ప్రాయేణ గృహిణీ నేత్రాః కన్యార్థేషు కుటుంబినః" అన్నాడు కదూ !

సు : నాలాంటి ఆడవాళ్లు పతికి విరుద్ధమైన పద్ధతి ఆలోచించరు. ఆ మహాకవే అన్నాడుకదూ ! "భవంత్యవ్యభిచారిణ్యో భర్తురిష్టే పతివ్రతాః" అని

శం : బాగుంది. ఇంకేం ? అయితే మన మిద్దఱం కలిసేలే - పిల్లని తగిన అల్లుణ్ణి వెదికి వప్పజెప్పేద్దాం. సరేనా ? ఇదిగో చూడూ ! ఇప్పుడు ఎక్కడచూచినా ఇంగ్లీషు చదివినవాడే పండితుడు. సదాచారాలు అక్కర్లేదు. అంచేత నే చెప్పిన పిల్లవాడి సంగతి వివరాలు తెలిసికొని వీలయితే ఆ సంబంధమే నిశ్చయిద్దామను కొంటున్నాను. బి. ఏ. చదువుతున్నాడుగదా, తల్లిదండ్రులు మంచివారు సంప్రదాయంగల కుటుంబం—తరువాత వాళ్ల అదృష్టం.

సు : మీ యిష్టం. మీకు తెలియదా ఏమిటి ?

(సుభద్ర లోపలికి వెళ్లిపోతుంది. ముగ్గురు విద్యార్థులు వచ్చి గురువందనంచేసి కూర్చుంటారు.)

1వ వాడు : గురువుగారూ! మమ్మల్నంతా హేళన చేస్తున్నారు. తిడుతున్నారు. మాతో ఎవరూ స్నేహం చెయ్యటంలేదు.

శం : అరే ఎంచేతరా?

2వ వాడు : మేము సంస్కృతం చదువుతున్నామని.

3వ వాడు : వాళ్లంతా సంస్కృత ద్వేషులండీ. సంస్కృతానికి చెందిన సంస్కారం వాళ్లకేం తెలుసు? మా వేష భాషలు చూచి మాలో ఆధునిక నాగరికత కనపడక పోవటం వల్ల వెక్కిరిస్తున్నారు. దానితో వీళ్లు ఉడుక్కుంటున్నారు. నామమాత్రం వాళ్లతో స్నేహం లేకపోవటమే మంచిది అనిపిస్తుంది.

శం : నీ ఉద్దేశం బాగుంది. వాళ్లంతా వేషాభిలాషులేగాని భాషాభిలాషులు కారు. అల్లాంటివాళ్ల స్నేహం ఎందుకు? వాళ్ల నడత కేవలం చెడ్డదిగా మారుతుంది. వాళ్లతో స్నేహంచేస్తే మీరు పాడవుతారు. పైగా విద్యార్థులకు స్నేహాలతో ఏంపని! ప్రవర్తన మంచి దుండాలి. అదే భూషణం. తరవాతే చదువుకూడా. "సంసర్గజాదోష గుణాభవంతి" అన్నారు పెద్దలు. దుస్సాంగత్యాలు పనికిరావు.

1వ వాడు : ఏం! ఆంగ్లభాష భాష కాదాండి! అది చదివేవాళ్లకి జ్ఞానం ఎందుకుండదు? కేవలం అది చదివిన మాత్రాన నడత ఎందుకు చెడుతుంది.

శం : అదీ భాషే. అది చదివేవాళ్లలోనూ మంచివాళ్లున్నారు. వాళ్లని మనం ద్వేషించకూడదు. కాని— తెన్ని భాషలకీ మాతృస్థానం సంస్కృతానికి లభించింది. అందుచేత సంస్కృతం తెలిస్తే అన్ని భాషలు తెలుసుకోవటం తేలిక.

2వ వాడు : గురువుగారూ! సంస్కృతంలోంచే భాషలన్నీ పుట్టాయంటారే! అదెల్లాగ? ఆంధ్రంలోంచో ఆంగ్లంలోంచో పుట్టాయనిగాని స్వయంగా పుట్టాయనిగాని ఎందు కనకూడదు? కాస్త వివరించండి.

శం : సంస్కృతము చరిత్ర దృష్ట్యా అన్నిటికంటె ప్రాచీనమైనదిగదా! పైగా—శ్రద్ధగా విను, సంస్కృతంలో మాతృశబ్దం ఉందా! అదే ఆంగ్లంలో "మదర్" అయింది, ఇల్లాగే "పితృ"లోంచి "ఫాదర్" భ్రాతృలోంచి "బ్రదర్" "స్వసృ"లోంచి "సిస్టర్" మొదలయిన మాట లాంగ్లంలో తయారయ్యాయి అని ఊహించవచ్చు. ఆంధ్రంలో చాలామాటలు బెట్టదము, బీరము మొదలైనవి భీతిద,వీరాది శబ్దాలవికృతులుగదా! అల్లాగే సంస్కృతంలోని పానీయం అనేదానిలో చివర "య" తీసేస్తే హిందీలో "పానీ" అయి ఊరుకుంది. పరశ్వః మొదలైనవి పరసో మొదలైన యితర హిందీ పదాలుగా మారాయి వాడుకలో అనుకోటం తేలికగా హేతు యుక్తంగా ఉందిగదా! ఇంక సంస్కృత సమాసే చాల భాషలలో వ్యవహరింపబడుతున్నాయి. కనుక సంస్కృత విజ్ఞానం కలిగితే మిగిలినవి చాల తేలిక.

3వ వాడు : అంచేత తప్పక సంస్కృతం పూర్తిగ చదవటానికి యత్నిస్తాను. కృపగలిగి బోధించండి గురువుగారూ!

1, 2వ వాళ్లు : గురువుగారూ! మేముకూడ సంస్కృత పాఠం మానము. ఆంగ్ల విద్యార్థులు మాతో స్నేహం చెయ్యకపోయినా సరే. వాళ్లతో మాట్లాడటంకూడా మాకు కిట్టదు.

శం : బాగుంది. బాగుంది. వాళ్లతో మాట్లాడినంతమాత్రాన తప్పేముంది? సంభాషణ, మర్యాద, వగైరాలు చేస్తూనే వుండాలి. యింకా వాళ్లలో గుణవంతులు దగ్గరకుజేరి ఆ భాషా రహస్యాలు తెలిసికోవాలి. దుష్టులు ఎవరైనా వారితో స్నేహం మాత్రం పనికిరాదని నా తాత్పర్యం.

3వ వాడు : మేము మా పాఠాలు బాగా చదివి మధ్యాహ్నం పాఠానికి వస్తామండి.

శం : అలాగే—బాగా చదవండి.

(అంతా వెళ్లిపోతారు)

౨ వ రంగము

(అద్దంలో చూచుకొంటూ ఇందిర ముస్తాబు చేసికొంటూండగా)

సు : (ప్రవేశించి) అమ్మాయీ! అదేమిటే? అస్తమానం అద్దం దగ్గిరేనా? ఏదైనా చదువుకోరాదూ, రామాయణమో భారతమో?

ఇందిర : (తల్లినిచూచి బెదురుతూ) ఇప్పుడే వచ్చానే. చదువుతున్నాను. (పుస్తకం తీసుకొని) అమ్మా! సీత సౌశీల్యం ఎంత గొప్పగాఉందే! రాజభవనాలు విడచి భర్తతో అడవికి బయలుదేరింది.

సు : అదే భారత నారీలోకంలో ప్రశంసనీయమైన చరిత్ర. అమ్మాయీ ఒక్క సీతేనా? ఇట్లాంటివాళ్లు దమయంతి, అరుంధతి మొదలైనవాళ్లు ఎంతోమంది సాధ్వీమణులున్నారమ్మా! చూడు వారి శీలాన్నే మనం అలవాటు చేసుకోవాలి.

(తొందరగా ప్రవేశిస్తారు శాస్త్రిగారు)

శం : ఇంకా, ఇల్లాగే ఉన్నావూ, తొందరలేదేం? కార్యభారం పెద్దది. మూడురోజులు దాటితే పెళ్లి. నువ్వు అమ్మాయితో ఆడుకొంటున్నావు. ఇంక అమ్మాయి వధువు అయినట్టే!

సు : మీకోసం వస్తున్నాను. ఇంతలో అమ్మాయి రామాయణ గాథ చెపుతూ ఆపింది. పిల్లకి సాధ్వీ చరిత్రతో పరిచయం చేస్తున్నాను ఆమాటమీద. సరే, ఏమయింది? నిశ్చయించినట్టేనా?

శం : ఇంకా సందేహమా! ముహూర్తంకూడా నిశ్చయించాం. ఎల్లుండే ఇంక మనం త్వరపడాలి. నడు, నడు, లోపలికి నడు, అంతా సిద్ధంచేయాలి.

(అని కూర్చుంటాడు. సుభద్ర లోపలికి పోతుంది)

ఇం : (సమీపించి) నాన్నా! అమ్మ అంటోంది సీత, అనసూయ అల్లాంటివాళ్ల మల్లే ఉండాలిట. అంటే ఎల్లాగ?

శం : అమ్మా! బాగా అడిగావు తల్లీ. విను, నువ్వు రామాయణం చదువుతున్నావా? అందులో సీత మంచి గుణాలు నడవడి తెలుస్తోందికదూ! పూర్వం సీత పతిభక్తితో తన సుఖాలు వదలి మగనితోపాటు కష్టమైనా అడవులకు వెళ్లింది. ఇల్లాంటి విషయం ఎక్కడెక్కడ కనిపిస్తే అక్కడల్లా శ్రద్ధగా అర్థంచేసుకోవాలి. అల్లాగే రేపు నువ్వుకూడా కష్టసుఖాలను భర్తతోపాటు పంచుకోవాలి. దాంతో బంగారుతల్లివలె అందరిచేత కొనియాడ బడతావు.

(ఇందిర సిగ్గుపడి నవ్వుతుంది)

తెరలో—అమ్మాయీ! ఇల్లారా!

ఇం : వచ్చే. (లోపలికి వెడుతుంది)

౩ వ రంగము

(అత్తవారియింట ఇందిర రామాయణం చదువుతూ ఉంటుంది)

రమేశుడు : (వచ్చి) ఆ పుస్తకం ఏమిటి!

ఇం : (విధేయతతో లేచి నీళ్లు అందిస్తూ) ఇది సీతా చరితం. ఇది చూడగా పతివ్రతల మహిమాతిశయం ఎంత గొప్పదా అనిపిస్తుంది—వాల్మీకి వాగ్ధార అమృతప్రాయం.

రమే : (కాళ్లుకడిగి కూర్చుంటాడు) మంచిది. మన ప్రాచీన కవులు వంద్యులు అయినా, షేక్స్పియర్, టెనిసన్, లాంటి ఇంగ్లీషు కవులు స్వాభావిక చిత్రం చేసినట్టు మనవాళ్లు చేయలేదనుకుంటా.

ఇం : నేను అల్పజ్ఞను. పైగా ఆంగ్లానభిజ్ఞను. నాకిదే ఆశ్చర్యంగా ఉంటుంది. నాఉద్దేశం—ఆంగ్ల సంప్రదాయంకంటె భారతీయ సంప్రదాయంలో అన్నివిధాలా పవిత్రత, గొప్పదనం ఉందని.

రమే : నీ కింతమాత్రమే తెలుసు. మన పెద్దలుకూడ, పిల్లలకు ఇంతే చెప్పుతారు. ఇంతకంటె ఎక్కువ వాళ్లకే తెలియదు. నువ్వు నేర్చుకోవాలి విశేషాలు.

ఇం : నేనా? విశేషాలా!

రమే : ఇంక ఇది నీకు పుట్టినిల్లుకాదు మెట్టినిల్లు. అంచేత నా అలవాటులు పద్ధతులు తెలిసికొని నాలాగే తయారవ్వాలి. నీలో కేవలం ఈ ప్రాచీనత నాకు కనబడకూడదు. పురాతనమైన లజ్జ, ఉపయోగంలేని వినయం, ముఖం చూచేసరికి స్వాతంత్ర్యం లేనట్టు కనిపించటం, ఇవి ఈ రోజులలో మనలాంటివాళ్లకి బాగుండవు.

ఇం : పురుషులకైతే మీరన్నది నిజమే. కాని, ఆడవాళ్లు ఈలాటి స్వాతంత్ర్యంపొంది ఏం చేస్తారు ? స్త్రీ పురుషునిలాగ సంచరిస్తే ఇంక దాని సౌశీల్య మేమిటి ?

రమే : ఏం ? స్త్రీ స్వాతంత్ర్యానికి తగదా ? ఇదే మీ తెలివితక్కువ. ఆడుది మగవాడితో సమానమైన అధికారం కలిగి ఉండాలి. నువ్వు యింక నా యిష్టం వచ్చినట్టు నే చెప్పినట్టు నడుచుకో. అందులో ఉండే అందం నీకు తెలిసిపోతుంది. నే చూపిస్తానుగా.

ఇం : ఎట్లాగ ?

రమే : క్లబ్‌కి నాతో రావాలి. అక్కడ సాయంత్రం మేమంతా "బాట్ మింటన్" ఆట ఆడతాం. అక్కడికి నువ్వు వచ్చి చూస్తే తెలుస్తుంది. అందులో ఎంత మజా ఉందో, ఇంకోటి—నీ వేషం ఇల్లా ఉండకూడదు. ముసలివాళ్లున్నట్టుండకూడదు. నిన్నీ వేషంలో చూచారంటే నా "ఫ్రండ్సం"తా నన్ను హాస్యం చేస్తారుకూడా. అంచేత తప్పకండా నే చెప్పినట్టు వినాలి.

ఇం : మీరన్నట్టు తప్పకండా చేయాలి. కాని, ఇల్లు వదలి అక్కడ కెందుకా అని ఆలోచిస్తున్నా—

రమే : ఇందిరా ! నామాట వినవూ ! నన్నర్థం చేసుకోటం లేదూ ! ఇదుగో ! తప్పకండా అల్లా చేయ్యవలసిందే సుమా !

ఇం : (భయంతో) మీకు కష్టంగా ఉంటే ఇల్లా ఎందుకుంటాను ? మీయిష్టం ఎల్లాగైతే అల్లాగే.

రమే : చూడు. నీకే తెలుస్తుందిగా, "క్లబ్‌కి" వెడదాము పద !

(ముందు రమేశ్ వెనుక మెల్లి మెల్లిగా ఇందిర వెడతారు)

౪ వ రంగము

(రమేశ్ కుర్చీలో కూర్చుంటాడు నాలుగైదు కుర్చీలతో అలంకారాలతో గది)

ఉమేశ్ : (ప్రవేశించి) గుడ్ మార్నింగ్.

రమేశ్ : హాలో—గుడ్ మార్నింగ్.

ఇం : (లోపలనించి వస్తూ) నమస్తే.

ఉమే . ఇందిరాదేవీ ! నమస్తే.

రమే : కూర్చో రా ! (ఉమేశ్ కూర్చుంటాడు)

(తరువాత ఇద్దరు మిత్రులరాక)

(రమేశు, ఇందిర లేచి స్వాగతం ఇస్తారు)

రమే—ఇందిర : రండి కూర్చోండి.

గోపాల్ : ఏం ? మీరింకా గ్రౌండుకి రారా ! ఇంకా టిఫిన్సు, గిఫిన్సు ఉన్నాయా !

రమే : లేదు, లేదు, మేమూ వస్తున్నాం. అంతా అయిపోయింది. మీకోసమే ..

కేశవుడు : అయితే లేవండి.

రమే : మన మీవేళ క్లబ్‌నుంచి త్వరగా గ్రౌండుకి పోయి, తరవాత చప్పున వచ్చేసి సినిమాకీ వెళ్లాలండీ. అదీ కథ.

కేశ : తప్పకుండా చూడదగిన సినీమా.

రమే : ఏం ? ఇందిరా ? ఏమంటావు ?

ఇం . వెళ్లవలసిందే. నేను వంటువాడితో చెప్పే ఉంచానే త్వరగా తేల్చమని.

రమే : బాగుంది పోదామా ?

కేశ : రండి—

(అంతా పోతారు)

౫ వ రంగము

(అస్వస్థతగా రమేశుడు మంచంమీద)

రమే : అబ్బ, ఏం తలనొప్పి ? ఎక్కువవుతోందిగాని తగ్గదే ? ఒరే ! కుఱ్ఱాడా ! మంచినీళ్లు తెచ్చిపెట్టు.

కుఱ్ఱాడు (నీళ్లుతెచ్చి) ఇవిగో (ఇస్తాడు)

రమే ఏదీ! ఇందిర!

కు క్లబ్ కెళ్లారండి మఱేండి ఆరన్నారండి—ఈయాల ఆల్సింగా వత్తారంట, తొరగా వత్తారని కూకోక! నన్ను తిండి తినేమన్నారండి ఆరొచ్చి కేకేత్తే తలుపు తియ్యచ్చంట పడుకోమన్నారండి—

రమే ఆహా! నా బాధ నాదీ, దాని ఆట దానిదా? వెళ్లు, వెళ్లు, నువ్వుపోయి పడుకో (బాధపడతాడు) (కుఱ్ఱాడు లోపలికి పోయాడు)

(ఇందిర వయ్యారంగావస్తూ నిలువుటద్దం దగ్గఱ ఇటు అటు తిరిగి చూస్తుంది)

రమే ఎవరు? ఇందిరా? ఇంతసేపెక్కడున్నావు? పొద్దుగూకి ఎంతసేపయ్యింది?

ఇం ఆ, ఈవేళ వెన్నెలగా ఉందికదూ! అంచేత అక్కడే మఱి కాస్తసేపు బాట్మింటన్ ఆడి కూర్చున్నాం. ప్రోగ్రాం అయ్యేటప్పటి కీవేళయింది.

రమే నేనిల్లా ఉన్నానుగదా!

ఇం అవును టయమయింది నే లేకపోతే ఎల్లాగ అక్కడ సాగేది?

రమే ఇందిరా! (అనుమానిస్తాడు)

ఇం ఏం?

రమే నీ ప్రవర్తన నాకు బాధకలిగిస్తోంది నీవు తప్పకుండా వెళ్లాలే అనుకో-ఐనా నా సంగతి కాస్త ఆలోచించాలా? ఇంకేం చెప్పను? (కాస్త బాధతో నవ్వుతాడు) (ఆలోచించి) అసలు మొదట్లో నీకీ మాదిరిగా అలవాటుచేసిన ఉపాధ్యాయుణ్ణి నేనే కాని, కాని నా కిప్పుడు తెలుస్తోంది అనుపమ సుఖాన్ని వదలి నేను భ్రమ పడ్డాను తెలుసుకుంటున్నా నే నేది పరమ సుఖమని ఆనందమనీ అనుకున్నానో అదంతా అనుమాన భూయిష్టం స్వేచ్ఛారహితం. సుఖాభాస మాత్రమేగాని సుఖంకాదు ఇదంతా నా భ్రాంతే. భ్రమ (కాస్సేపు ఆలోచించి మళ్లీ) నా ఉద్దేశం చెపుతున్నాను మళ్లీ నీ భారతీయతను చూడాలని ఉంది మునుపటిలాగే నీవు నా ఆజ్ఞని కాదు కాదు విజ్ఞప్తిని పాలిస్తావని విశ్వాసం పొందచ్చా? ఏమంటావు? ఇదే బాధ అంతా వ్యాధికూడా ఇదేనని వెల్లడిస్తున్నాను

ఇం (విని ఆలోచనలో పడుతుంది)

రమే ఇందిరా! మాట్లాడవూ?

ఇం (సిగ్గు బెదురూ వ్యక్తం చేస్తూ) ఇదంతా మీకు నచ్చకపోతే నాకూ నచ్చదన్నమాటే కాని ఈ మాదిరిగా అలవాటుపడ్డాను కనుక విశ్రాంతికి అల్లా పోతున్నా ఇది తప్పని మీరనుకుంటే నే పోనక్కఱ లేదు, అక్కడికిగాని, ఇంకెక్కడికీగాని మీ మిత్రులులా ఉన్నవాళ్లుకూడా ఇక్కడికి రాకపోతే మంచిదేమో! మీరుగూడా కొన్ని నియమాలు పాటించాలి. ఆ సైపెప్పుడు వస్తుందాఅని, ఈ సంగతి బోధపడేటట్టు చేయటానికే యత్నించాను ఫలించిందనుకుంటూ ఇప్పటికి నా చిత్తానికీ శాంతి లభించినది సంతోషము. (దగ్గఱకుజేరి కూర్చుంటుంది)

రమే అమ్మయ్య! ఇదే నా పాశ్చాత్య వాసనావ్యాప్తికి హద్దు ఇంక భారతీయుడను కావాలి అవుతా. (పరస్పర విలోకనము)

౬ వ రంగము

(అనుష్టానము పూర్తిచేసివేస్తూ రమేశ్
(గంధం తెస్తూ ఇందిరా)

రమే (లేచి) ఆ పుస్తకం ఏమిటి?

ఇం ఇది శాకుంతలం నాటకం

రమే ఆ, షేక్స్పియర్లాంటి కవిటగదూ! కాళిదాసు అతని నాటకమేనా? ఏదీ చదువు విందాం

ఇం ఆహాఁ కాళిదాసులాంటివాడే ఆ షేక్స్పియరేమో? అయినా ఈయన ఉపమా సౌభాగ్యం వాడికెల్లా సాధ్యమవుతుంది?

రమే! ఆఁ ఎందుకు కాదు? ఆయన మహాకవే—

ఇం ' కావచ్చు

రమే సరేగాని, కొంచెం చదువు ఆయన సరసత నీ రసి
కతా చూద్దాం

ఇం (రోషము నటిసూ)
"క్వభవాన్ క్వపరోక్షమన్మథా
మృగశా బైస్సమమేధితాప్యహం ।

రమే "పరిహాస విజల్పితం సఖి
పరమార్థేన న గృహ్యతాంవచః"

(ఇలా సంస్కృతంలో ఆ కాళిదాసు మాటలే తమ
కన్వయించి మాట్లాడిన తరువాత పుస్తకం లాక్కుంటాడు)

ఇద్దరూ ప్రవర్తతాం ప్రకృతి హితాయపార్థివః
సరస్వతీ శ్రుతిమహాసాం మహీయసాం
మమాపిచక్రపయ మనీలలోహితః
పునర్భవం పరిగతశక్తి రాత్మభూః

ఇదే భరతవాక్యం
(తెర)

★

స్మరణాంజలి

* విద్వాన్ శ్రీ బులుసు సీతారామశాస్త్రిగారు *

పతినేత్రాలకు గోచరింపనిది యీపాపప్రపంచమ్ము సం
మతిఁ జూడందగ దింక నాకు ననుచున్ మాన్యంపు టాంధ్యమ్ముఁ గాం
చితి నీనాటి జగమ్మునందుకలదే స్త్రీలోకమందెన్నడై
న తలంపన్ స్మరణీయ శీలవతి గాంధారీ పురంధ్రీమణీ!

అతి ప్రేమంబున దిగ్జయంబు గను నా కాశీస్సు లిమ్మంచు నీ
సుతుఁ డేతేరఁగ భారతావని వఘూసుశ్లోక ధర్మ స్వభా
వత రూపించుచు మాతృ మోహమును సంభావింప కేమాత్ర మా
గతి ధర్మంబె జయించు నెన్న డనుచున్ గావింపవా దీవనల్

భారతగాథ ప్రపంచము
గౌరవమును గాంచు నంతకాలము వఱకున్
నీరమణీయ చరిత్ర మ
పార ముదావహము జనని భావింపంగన్.

★

ఆస్థానకవి చెళ్లపిళ్ల

వెలమకన్ని శ్రీరామమూర్తి గారు

శతావధాని శ్రీ చెళ్లపిళ్ల వెంకట శాస్త్రిగారికి నేటి మన ప్రజాప్రభుత్వము తెలుఁగు ఆస్థాన కవి పదవినిచ్చుట శ్లాఘ్యపాత్రము. 'అటు గద్వాలిటు చెన్నపట్టణము మధ్యన్ గలదేశం'లో వారి పాండితి విప్పారింది రాగూరు కాకినాడ వచ్చినప్పుడు వెంకట శాస్త్రిగారు ఆసుగా శ్లోకాలు చదివారు రవీంద్రుడు వారిని మెచ్చుకొన్నాఁడు ఈ సంఘటనే వారి అసమాన పాండితికి నిదర్శనము ఇటు యింగ్లీషు పురవడికీ అటు పండితాభిషక్కుల భాషా భేషజానికీ మధ్య పడి మన తెలుఁగు సాహిత్యమునలిగి—చినిగి పోతూ ఉన్న సందర్భములో తిరుపతి వెంకట కవులవతరించి ఉద్ధరించారు నేడు కవినిలబడ్డానికి ఆస్కారము కల్గించిన వారు వీరే! 'తిరుపతి అతండు, వెంకటేశ్వరుడనేను, వెరసి తిరుపతి వెంకటేశ్వరులమేము' అని చెప్పి అర్థశతాబ్దం నాడు పాండితికున్న గౌరవాన్ని మించినదాన్ని పంచి యిచ్చినవారు తిరుపతి కవులే!

అర్థ శతాబ్దము క్రింద కవిత రాజాస్థానముల నాశ్రయించెడిది కవిత ప్రజలజాతీయ జీవనానికి ప్రతిబింబమని గ్రహించి తత్ విధానమునందే కవిత్వము వ్రాసినవారు తిరుపతి వెంకటకవులే!

ప్రజా ఉపయోగార్థము ప్రజారంజకమైన భాషలో వ్రాసిందే ప్రజాసాహిత్యము—ప్రజా కవిత్వమూ అదే తిరుపతి కవులు ఆంధ్ర కవిత్వమునకిచ్చిన నూతన రూపేయిది అదే వారు కవిత్వములో తీసుకువచ్చిన మార్పు—దానినే అతినేర్పుతో చేసారు

'కవనార్థ ముదయించితిన్—సుకవితాకార్యంబె నావృత్తి' అనేగాఢ విశ్వాస పూరితమైన



శతావధాని శ్రీ చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారు

బాస తీసుకొని, కవితారంగమున నూతన పరిణామము సాధించుటకు పూనుకొని, ఢంకాలు వాయించి — శంఖాలు పూరించి మహోద్యమాన్ని సాగించి కృతకృత్యులైయ్యారు 'తనకు నాల్గు నిఘంటు పదములువచ్చు—ననుచు బదివుండికి దెలియంగ మారు-మూల పదములుగుప్పిన ముచ్చటగునె—ప్రతిపదమ్మున రసముట్టి పడినగాక' అని

వచించి, వారు రచించిన ప్రతికావ్యమూ రసమయము గావించారు. అప్పుడు వాడవాడల—ఎచ్చటచూచినా వీరికవిత్వపు ఏనాళ్లే—అవధానాలే. దీనిమూలముగా ఆంధ్ర కవిత్వముపై పండిత పామరులకు సమానమైన భక్తి శ్రద్ధలలము కొన్నాయి.

‘నీరుంగోరదు, గడ్డినడ్గదొక కొన్నేనుల్వలన్ వేడదు’ అంటూ సైకిలుమీద—‘కొండవడిన్ బరతెంచి, అంత ఉద్దండత దారికడ్డమయితాకి హాళోహాళిసేయు, కొండలన్ పిండిజేసి, రైలు కడువేగమునన్ చనుదెంచునట్లు, అంటూ ధూమ శకటముమీద—‘అన్నా వైనట, బ్రాందియంట, విసికీయంటకక్కటా’ అంటూ మద్యపానంమీద వారు పద్యాలు చెప్పారు. రామకృష్ణ పరమహంస, వివేకానంద, ఆలయ ప్రవేశము, హరిజనాభ్యుదయము మొదలగు విషయాలపైన అనేక పద్యాలు చెప్పారు. ఇలా చెప్పడములో శాస్త్రిగారి వుద్దేశము ప్రజా జీవితపు విషయాలు కవితావస్తువు కాదగిందని సోదోహరణంగా నిరూపించడమే!

శతావధానాలు చేయడమేకాకుండా ‘శ్రవణానందము’, ‘పాణిగృహీత’, ‘దేవీభాగవతం’, ‘గుంటూరుసీమ’, ‘బుద్ధచరిత్ర’, ‘గీరతము’, ‘పాండవోద్యోగ విజయములు’’ ‘పాండవ విజయము’ మొదలైన కావ్యాలు, నాటకాలు రచించారు. ‘విక్రమాంక దేవచరిత్ర’ వీరి వచనరచనకు మచ్చుతునక. వీరి వచనరచనలు శిష్టవ్యవహారానికి వరవడి తునకలుగా యుంటాయి. ‘వీరి కవిత్వము పాతపద్ధతికి భరతవాక్యమూ—నవ్య సాహిత్యానికి నాందీ పాఠమూ’.

శ్రీ శాస్త్రిగారి గ్రంథాలు పరికిస్తే వారిలో కవిత్రయమువారు—ప్రబంధకవులూ—మహాకవులూ—అందరూ ఏకమై ప్రవేశించి వ్రాయించారనిపించును పింగళి, కాటూరి, విశ్వానాథ, వేలూరి, వేటూరి ప్రభుతులు చెళ్లపిళ్లవారి శిష్య రత్నాలలో ముఖ్యులు.

శ్రీ శాస్త్రిగారు కవిత్వసంస్కర్తగా—ఉద్ధారకుడుగా—శతావధానిగా—మహా పండితుడుగా—సంఘసంస్కర్తగా సాధించిన మహత్తర విజయాలనన్య సామాన్యములు. అట్టి విజయసాధకుని ఆస్థానకవిగాజేసి గౌరవించడంవల్ల మన సారస్వతలలామను నూతనాభరణ భూషితురాలునిగా జేసితిమన్న మాట. ఇట్టి మహాపురుషుని గౌరవించిమన మద్రాసు ప్రభుత్వము తమ గౌరవము కాపాడుకున్నది.

★



చిలకడదుంప వంటకాలు

కూర

ఎఱ్ఱ చిలకడ దుంపలనుగాని, తెల్ల దుంపలనుగాని తీసుకొని నీళ్లలోవేసి బాగా కడిగి పలుచచి చక్రములవలె తరగవలెను. పై పొట్టు తీయనక్కరలేదు. ఆ ముక్కల్లో తగుమాత్రము ఉప్పు, పసుపు వేసి, ఎండుమిర్చి, మినపపప్పు, ఆవాలు, జీలకఱ్ఱ, కరివేపాకు వేసి వేపిన పోపులో వేసి మూతవేయవలెను. సన్న మంటమీద ముక్కలు బాగా మగ్గిన తర్వాత, కొద్దిగా అల్లం పచ్చిమిర్చి కొతిమెర, నలియగొట్టి ఆ కూరలో వేసి కలియబెట్టి కుదిలిస్తూ ముక్క బాగా ఉడక్కపోతే కొద్దిగా నీళ్లుచల్లి ఉడికిన తరువాత దింపుకోవలెను.

ఈ ముక్కలలో లేత వంకాయలనుకూడా తరిగిపోసి పై విధముగానే చేయవచ్చును.

పచ్చడి

5 పలముల దుంపలను తీసికొని పై పొట్టు దీసి చిన్న చిన్న ముక్కలుగా తరగవలెను. 8 ఎండు మిరపకాయలు ½ తులం మినపపప్పు కొద్దిగా ఆవాలు, మెంతులు, కరివేపాకు వేసి పోపు బాగా బంగారుచాయ వచ్చేవరకు వేయించి దించుకొని ½ తు॥ చింతపండు, తగు మాత్రము ఉప్పువేసి రుబ్బి, పై ముక్కలను కూడా యీ పోపుతో కలిపి బాగా రుబ్బవలెను. ఇది కేవలము కొబ్బరి పచ్చడివలె చాల రుచ్యముగా నుండును.

వేపుడు

దుంపలను బాగా కడిగి పైపొట్టు చాకుతో గీకివేసి చిన్న చిన్న ముక్కలు చేయవలెను. నూనెబాణలిలోవేసి బాగా కాగిన తరువాత పై ముక్కలనా నూనెలో వేసి ఉప్పువేసి కొంచెము సేపు మూతబెట్టవలెను ముక్క బాగా మగ్గిన తరువాత మూత తీసివేసి దోరగావేయించవలెను. తరువాత జీలకఱ్ఱవేసి కొట్టిన కారము పై ముక్కలమీద చల్లి దింపుకోవలెను.

దుంప మిఠాయి

పది పలాలు దుంపలను బాగా కడిగి గిన్నె పొయిమీదబెట్టి దానిలో రెండు చెంచాలు నెయ్యివేసి, అది కాగినతరువాత దుంపల నా గిన్నెలో వేయవలెను. పది పలముల చక్క-

రనుగాని, బెల్లమునుగాని వేసి కుదిలించి గిన్నె మీద కొంచెము లోతైన పళ్లెమును మూత బెట్టవలెను ఆ మూతవేసిన పళ్లెము నిండా నీళ్లు పోయవలెను. ఆ నీటివల్ల కలిగిన ఆవిరితో గిన్నెలోని దుంపలు బాగా ఉడికి చాలా రుచ్యముగా నుండును. (దుంపలు ముక్కలు చేయరాదు) ఇవి భోజనమునకు బదులుగాకూడా వాడవచ్చును.

దుంప పూరి

దుంపలపై పొట్టుదీసి శుభ్రపరచి పెద్ద పెద్ద ముక్కలుగా కోసి, ఒక గిన్నెలో కొద్దిగా నెయ్యివేసి పొయిమీదపెట్టి నెయ్యి కాగిన తరువాత పై ముక్కల నా గిన్నెలోవేసి, మూత బెట్టవలెను. కొద్దిగా నీళ్లుజల్లి సన్న మంటమీద పెడితే దుంప బాగా మెత్తనవుతుంది. ఆ ఉడికిన ముక్కలు రోటిలోవేసి రుబ్బి, ఆ ముద్ద నొకచోట నుంచవలెను.

కొంచెము గోధుమ పిండిగాని, మైదాపిండి గాని తీసుకొని కొద్దిగా ఉప్పు, నెయ్యి వేసి, కొద్దిగా నీళ్లు జల్లుతూ ముద్దచేసి చిన్న చిన్న ఉండలుచేసి పీటమీాట వేసి పిండి జల్లుతూ అప్పడము చేయవలెను ఆ యప్పడములో పైని తయారుచేసిన ముద్దనుండి చిన్న చిన్న యుండలు చేసి పూరీలో బెట్టి ఉండవలెచేసి, మరల సున్నితముగా పూరీవలె ఒత్తవలెను అట్లు వత్తిన పూరీలను నెయ్యి బాగా మరగనిచ్చి నేతిలోవేసి వేయించి తీయవలెను. . ఇష్టమున్న వారు ఆ వేడి పూరీలమీాద చక్కెరజల్లి భుజించిన చాలా రుచ్యముగా నుండును. వేడి వేడిగా భుజింపవలెను.

బజ్జీలు

దుంపలను బాగా కడిగి పల్చని చక్రముల వలె తరగవలెను. కొంచెము శనగపిండి తీసుకొని దానిలో తగుమాత్రము ఉప్పు కారము వేసి, కొంచెము అల్లము పచ్చిమిర్చి మెత్తగా నూరి కొద్దిగా నీళ్లుపోసి పెరుగువలె కలుపవలెను. నూనె బాగా కాగిన తరువాత పై చక్రములను కలిపిన శనగపిండిలోముంచి మరుగుచున్న నూనెలోవేసి బాగా వేగిన తరువాత తీసి వాడవలెను. ఇవి వేడిగా భుజించవలెను.

మఱియు సాంబారు, ధప్పళం, మొదలైన పులుసుల్లో యీా దుంప విశేషంగా వాడతారు. పిండి, బెల్లము పెట్టి కూర మాదిరిగా కూడా వండవచ్చును.

ఈ దుంపలను కుమ్ములోబెట్టి ఉడికించి తినడం అందరికీ చాలాయిష్టము. పిల్లలకు చెప్పనక్కరేలేదు పొలాల్లో పనులుచేసేవారు పైజెప్పిన సంస్కారాలేమీా చేయకుండానే భక్షిస్తారు గాన దీనిని మన ఆహార విధానములో బాగా యుపయోగించవచ్చును.

—వేదవల్లి తాయారమ్మ

[ఇలాగే సోదరీమణులు తమకు తెలిసిన వంటకములను గూర్చి పత్రికాముఖముగా చదువరుల కెరింగింపవలెదని మాకోర్కె].

—సం॥

★

తొలి బోణీ....

శ్రీ కె. సూర్యనారాయణ శాస్త్రిగారు

'ఇదిగో—మళ్లీ వచ్చిందినాన్నా! ఇంకో వుత్తరం.

'ఎక్కడనుంచే, లీలా?

'ఎక్కడనుంచేమిటి? మా బావవద్దనుంచే. కాళీ వుండాలిగాని—కార్డులు నింపటానికి ఆయన తరువాతే. అప్పుడే యిది 5వ వుత్తరం. అంత తీపి ఏమిటో అక్క మీద.

'ఏమని వ్రాశాడే?

'ఏముందా! మామగార్కి సహస్రవేల దండ ప్రణామాలుట. అందులో మామూలు రకంగాదు. మనఃపూర్వకంగా త్రికాలములూ ఆచరిస్తున్నాడుట. ఎక్కడ కంఠస్థం చేశాడో! యీ రెండు మాటలూ

'ఊఁ! ఇంకా ఏమన్నాడే లీలా!

'అబ్బా! ఇంకా ఏం చెప్పనూ పాతపాటే మళ్లీ పాడేడు. పుట్టింటికి పంపింది మొదలూ పురిటి సంగతేనా. పురుడు వచ్చిందో లేదో అని వ్యగ్రపడుతున్నాడు. ఉద్యోగానికి కృషి చేస్తున్నాడుటగూడా.

'ఏవూరు వెళ్లటానికి?—

'వూరూలేదు—పేరూలేదు. ఆ వుద్యోగంమాటా—ఆ పురిటి సంగతీ—మామగారి ఘనతా అవీ యివీ అయిదు మాటలు వ్రాసి అందులో పారైమన్నాడు బంట్రోతుని. అంతేనేగాని, ఆ వుద్యోగం వూరేమిటో కనిందా యీ లోపులో ఆ కార్డు. ఏదో వ్రాశాడు. అదే చదివేం. సంతోషించాం. అంతకూ తెలియని విషయాలని విమర్శించాం ఇంకా ఎక్కువగా యీ విషయాలే సాగదీస్తే కోరలువూడి పోయేటంత కోపంవస్తుంది అక్కకి. ఈ ఉత్తరం దానికియిచ్చి, పలకరించివస్తా' నంటూ చట్‌మని ఒక్క గంతులో వంటింట్లోకి వెళ్లింది లీల.

'అబ్బా ఎంతకోపమే లీలా! అంత చిరాకెందుకు? నువ్వే మొగాడవయితే ఎట్లావుండేవో నీ లీలలు. ఛండశాసనుడులా నిప్పులు చెదరకొడుదువు. ఏంచేస్తా! చెప్పు మీ యిద్దరు ఆడపిల్లల్నీ నా రెండు కండ్లలాగ చూచుకుంటున్నాను. దైవం మనయందుంటే నీకున్నూ డా వుద్యోగం రాకూడదూ. ఇల్లు అలకగానే పండుగా అన్నట్లు డిగ్రీ రాగానే అయిందా! దానికి తగిన వుద్యోగం రావద్దూ. తరువాత నీ యిష్టం పెళ్లి చేసుకుంటావో చేసుకోవో—ఆ కాస్తా నా చేతిమీద చేద్దామనుకున్నా. ఇంత వరకూ వద్దో వద్దో అంటూ గెంటుకొచ్చావ్. తరువాత నీ తలరాత ఎట్లావుందో ఎవరు చెప్పగలరూ?' అంటూ జపమాలను చేత్తో పుచ్చుతున్నాడు తండ్రి పరదేశి. పరదేశికి పురుష సంతానం ఒసగలేదు భగవంతుడు.

లీల గిరుక్కుమని వంటింట్లోకి మళ్లి వాళ్లక్క సుభద్రకు వుత్తరం చూపింది. ఏహ్యభావంలోవున్న లీలను చూచేసరికి సంతోషానందాలను హృదయంలో ఓమూల దాచుకుని పైకి 'ఎందుకూ యిన్ని వుత్తరాలు వ్రాయటం? కడుపుతో వున్నప్పుడు కనకుండా వుంటామా? అంత కంగారేం? ఇక్కడికి వచ్చి మంత్రసానితనం చేస్తారా?" అంటూ లేని క్రోధాన్ని వెలుపలికి విసురుతూ వెళ్లింది సుభద్ర.

ఆ మర్నాడే మరో సువార్త. కవరు చింపి చూచింది లీల. ఇంకా సంతోషానికి మేరలేదు. కళ్లల్లో ఆనందరేకలు మిసమిస లాడుతూ తొంగిచూస్తున్నాయ్. శరీరం అంతా సంతోసంతో స్థంభించి పోయింది. అట్టే అయిదు నిముషాలు అడ్డంగా చదివింది ఆర్డరు కాగితం. కరుడుగట్టిన ఆనందాన్ని కరిగిస్తూ, పకపక నవ్వుకుంటూ, బర్‌మని బయలుదేరి చకచకా వెళ్లింది వాళ్ల నాన్న దగ్గరికి. 'విన్నావా! నాన్నా! నన్ను బందరు హాస్పటల్లో అసిస్టెంటు డాక్టర్‌గా వేశారు. ఇదిగో శుభలేఖ. 5న, అక్కడ జాయను కావాలి. వుద్యోగమో, వుద్యోగమో అన్నంతసేపు పట్టలేదు. దేవుడనుగ్రహించాడు కాబట్టి చూసుకో. ఎంత త్వరగా వచ్చిందో కాగితం.

'అవునే అమ్మా! అదృష్టం అంటే నీదేనమ్మా. లేకపోతే యింత త్వరగా రావటం ఏమిటి? అనుకున్న ప్రకారం అంచెలమీద ప్రయాణం చేసినట్టుంది. కాని యిట్లాగే చూడనిద్దూ నీ పెళ్లికూడా

'అదిగో! మళ్లీ మొదలా. పెళ్లీవద్దూ, గిళ్లీవద్దూ. నన్నిల్లా సుఖంగా స్వతంత్రంగా బ్రతకనిద్దూ. అయిందని సంతోషపడునాన్నా. కాలేదని కష్టపెట్టుకోకు నీ మనస్సుని. ఔనుగాని 4న బందరు వెళ్లాలి తెల్సా?'

అంటూనే సుభద్రవద్దకు వెళ్లి 'అక్కా. ఇంచక్కటి మాట. ఇట్లారా. ఇదిగో ఆర్డర్. నన్ను బందరులో డాక్టర్ గా వేశారు. 4న వెళ్లి హాజరుకావాలి. ఈలోపులో నీకు అబ్బాయో, అమ్మాయో చూచి ముద్దుపెట్టుకుంటాలే. ఇంకా ఎంతో టైముకూడా లేదు. నాకా 'లక్' వుందో లేదో'. అంటూ టేబిలు దగ్గర కూర్చుంది కాగితాలేవో సర్దుతూ.

వెంకట్రావు వద్దనుంచి వచ్చినకార్డు ఆరోజుకు ఆరు రోజులైంది. సుభద్ర ఆరోజు బద్ధకంగావుంది. గంట గంటకే కడుపులో వాతపు నొప్పులు గట్టిగా పెట్టుకొస్తున్నాయ్. శరీరం అలసిపోయింది. మంత్రసాన్ని పిలవమన్నారు అక్కడ వున్నవాళ్లు. సుభద్ర గాభరా పడింది. కాని—సుఖ ప్రసవమే అయింది సుభద్ర. కెవ్వుమని ఏడ్పు వినిపించింది. హృదయం శాంతించింది పరదేశికి. 'అమ్మా! లీలా సులభంగా పురుడొచ్చిందా అక్కకి?' 'ఆ చూచి వస్తా' అంటూ వెళ్లింది గదిలోకి లీల. అందరూ విరగబడి నవ్వుతున్నారు. సుభద్రకు మొగపిల్లవాడన్నారు. ఆ వార్త వినగానే మురిసిపోయాడు ముసలి పరదేశి.

'హనుమాయమ్మగారూ! ఇల్లా రండి ఏమిటి యీకాలు యిల్లాగవుంది అబ్బాయికి?' అంది మంత్రసాని. 'ఏమోనే నాకు సరిగ్గా తెలియదు. ఆండ్రాళ్లమ్మగారూ మీరు చూడండి?' అంది ఆవిడ. 'ఏమోనమ్మ నాకు మాత్రం కనిపిస్తుందా! తెలుస్తుందా?' 'ఆ! అదేమిటి? మీకంటే మా కెక్కువ తెలుసా. మునిమనుమళ్లను కన్న ముత్తైదువు మీరు. పుట్టెడు పురుళ్లు పోశారు. పెంచారు. కాస్త యిట్లా వచ్చి చూద్దురూ' అని ఆదుర్దాతో తీసికెళ్లింది ఆండాళ్లమ్మని సుభద్ర తల్లి. 'కాలు వంకరతిరిగిందమ్మా! కంగారేం అక్కర్లేదు. ఇట్లాగవుంటే పిల్లాడు మంచి తెలివైనవాడవుతాడు అంటారు. ఇది పూర్వ జన్మదుష్కృతంలే. మనం అనుకుంటే ఏముంది. ఎంత తోమినా పోదు. దీన్నే 'తొండుకాలు' అంటారు. అమ్మాయీ ఏంపరవాలేదు.' అంటూ సుభద్ర తల్లికి ధైర్యం చెప్పింది ఆవిడ. కాస్సేపటికి అందరూ నిష్క్రమించారు అక్కడనుంచి పరదేశి పడిన సంతోషానికి పలాయనంచెప్పి, చివరికి విచారించి వూరుకుంటాడు. పుట్టిన బాలుడు అందచందాలు గలవాడే కాని ఆ కాలు ఒక్కటే అనాకారానికి కారణం.

కారణాలు ఎట్లున్నప్పటికీ కాలచక్రం తన పని మారుతుందా! పురిటికోసం ఎదురుచూసే వెంకట్రావుకు జీతం వచ్చినట్లు పరులవల్ల తెలిసింది. కాని జన్మించింది మొగ శిశువో, ఆడశిశువో విశదంకాలేదు. సంతానంకోసం ఒడిగట్టుకు కూర్చున్నందుకు యీ వార్త వినగానే హృదయం వుప్పొంగి ఒళ్ళంతా సంతోషం కమ్మింది. మరునాడే ఏదో పనున్నట్టు వచ్చాడు అత్తవారింటికి. అప్పుడే కస్తూరివేసి కూర్చోబెట్టుకున్నారు పిల్లాణ్ణి. పాద ప్రక్షాళణచేసి పరున్నాడు మంచంమీద అలసటకొద్దీ. కుశల ప్రశ్నలడుగుతోంది వాళ్ళ బావను లీల. కొంతసేపయే సరికి నిశ్శబ్దంగా కూర్చున్నారు అందరూను.

'ఏం లీలా వుద్యోగంమాట ఏమైంది?' అన్నాడు. వెంకట్రావు.

'ఆ! నాకు వుద్యోగం ఏమిటి? ఆడుదాన్ని, పిల్లల్ని కంటానికి వుంటుంది కాని మాకు శక్తి. వుద్యోగం చేయటానికి వుంటుందా మీలో యుక్తి.' అంది లీల.

'నీ సంగతి ఏమైంది?' అని అడిగింది వెంకట్రావుని.

'నా సంగతా. అన్నింటికీ అప్లై చేశాను. ఒక్కటీ శాంక్షను కాలేదు. చివరకు డాక్టరు ప్రాక్టీసు పెట్టమన్నారందరు. దాంట్లో ఎట్లా ప్రారంభించాలో తెలియలేదు. ఆ! అయినా యిన్నాళ్ళనుంచీ 'ట్రై' చేసే నాకేలేదు. నిన్నగాక మొన్న ప్యాసయావునీవు. ఆడదానవు నీకిస్తారా

ఉద్యోగం! స్త్రీలకి గృహకృత్యాల్లో గొప్పగానీ వుద్యోగంలో వస్తుందా చెప్పు! నాల్గు డబ్బులుండగానే నాస్తి అయేవరకు చదువు చెప్పిస్తారు స్త్రీలకు. ప్రయోజనం లేదు కదా—పర్యవసానం యిది. అయినా! ఆడవాళ్లకి చదువేమిటీ. అడుక్కుతింటానికి కాబోతే. ఏం! కోపం వచ్చిందా. మరదలు సరసంకోసం మాట్లాడుతున్నా. చెప్పు సమాధానం' అన్నాడు.

'అవును నీవన్నది నిజమే. కూటికి కరువైన వాళ్ళకి కుక్కమూతి పిందెలు పుడతారంటారు. అందులోనే జత. తైమూరు ప్రభుత్వం వచ్చిందీ—అంటే అందరికీ దొరుకుతాయి వుద్యోగాలు.' అని చెప్పింది లీల.

'ఏం అంత కోపమేం లీలా! పరిహాసానికంటే పట్టరాని కోపం ఎందుకు? ఎప్పుడో తైమూరు ప్రభుత్వాన్ని యిప్పుడు తలుస్తావేం?' అన్నాడు వెంకట్రావు.

'అబ్బే పరిహాసంకాదు. తప్పకుంటే నిజమే ప్రభుత్వం గురించికాదు. గృహకృత్యంలోనే నే చెప్పేది. ఎటొచ్చీ పోల్చి చెప్పానన్నమాట. ఇదుగో యీ కాగితం ఏమిటి చూడు? ఏం చదివావా?

'ఆ! నాకంటె లక్కీఫెలోవే. నీపనే బాగుంది లీలా.' అన్నాడు వెంకట్రావు.

'ఆ! యింకా విను. నీకొక వుపకారం బాకీ వున్నా'

'ఏమిటీ అది?'

'అబ్బే—పూర్తిగా విను. పురుడో పురుడో అంటూ వుఱ్ఱూటలూగేవు. పురుడొచ్చింది మొగపిల్లాడు. అంతా బాగానేవుంది.'

'ఇంకేమిటి?'

'వినవయ్యా సాంతంగా. నీ పూర్వపుణ్యంకొద్దీ పుట్టాడు తైమూరు. ఇదుగో చూడు.' అంటూ చూపింది పిల్లాణ్ణి.

'అరెరె? ఇదేమిటే. ఎంతో అందమైనవాడనుకున్నా. కాలు యిదేమిటి? ఇట్లా వుందేం? ఎంతనామర్దా లీలా నేను చూడలేను! నేను అసలు ఎత్తుకోలేను. తీసికెళ్లు నే వెడుతున్నా.' అన్నాడు కంగారుతో—

'బావా! నీ కిది భావ్యంకాదు. ఏమిటా పిచ్చివేషం? కర్మని మళ్లించే కర్త ఎవరు? ఎవళ్లు తవ్వుకున్న గోతులో వాళ్లే దిగాలి. ఎవరేం చేస్తారు? లే, ఎవ్వరైనా వింటే నవ్విపోతారు. భోంచేయి బయలుదేరదాం.

'ఎక్కడికి?'

'బందరు. రేపు అక్కడ హాజరు కావద్దూ. అక్కడికి తీసికెళ్లి అబ్బాయికి కాలు బాగుచేస్తాను' అన్నది లీల. 'పుట్టుకతోవున్న వంకర పూర్తిగా వుంటుందంటావుగా' లీలా!' అన్నాడు వెంకట్రావు

'ముసలివాళ్ళ పుక్కిటి పురాణాలు నాదగ్గర చదువకు. మళ్లీ మాట్లాడుతే నిన్ను మహిళా లోకంలోకి ఎక్కిస్తా. ఆ అనాకారం బాగుచేస్తేనే నాపేరు లీల. ఏం చేస్తాం. 'తొలిబోణీ—తొంటకాలు' అనుకుంటాం. లే!' అని గద్దించింది బావగార్ని. వెళ్లి భోంచేశాడు వెంకట్రావు.

'చూశావా ఆడువారి సాహసం. నడూ.' అని బయలుదేర తీసింది వాళ్ళ బావనీ, అక్కయ్యనూ—

అనుకున్నట్టు 5వ తారీఖున హాజరయింది హాస్పటల్లో లీల. వెళ్లినప్పటినుంచీ వెంకట్రావు కొడుకుకి వేయికళ్లతో వైద్యం చేస్తూంది. ఇటు అక్క—అటు బావా. తనకు కొడుకయ్యే. తీసికెళ్లిన నెల రోజుల్లో తన నేర్పుచూపి, సుగుణం చేకూర్చింది కుర్రాడికి. సాక్షీగా తయారైంది సుభద్ర కొడుక్కి కాలు.

'బావా నిన్ను నిజంగా 'ఆంధ్రమహిళ'లో ప్రచురిస్తున్నానోయ్.'

'ఆ! చూశావా వద్దులీలా. ఇకముందెప్పుడూ అట్లా మాట్లాడను. ఊరుకుందూ.'

కథానిక

సోదరి

అనువాదం అల్లూరి అన్నపూర్ణాదేవి   మూలం డాక్టర్ ధనీరామ్

రజని, సతీష్ కాలేజిలో చదువుచున్నారు. రజని జూనియర్, సతీష్ సీనియర్. అసలు రజనికి డాక్టరీ చదవాలనే కోరిక లేక పోయినా బంధువుల బలవంతంవలన చదువ వలసి వచ్చినది. ఒక రోజున రజని జంతువులను కోసెడి డిసెక్షన్ హాలులోనికి వెళ్ళినది. ఆ పనిలోనికి ప్రవేశించటానికి అదే ఆమెకు మొదటిసారి కావటం వలన ఆ పని సరిగ చేయలేక పోయినది. ఆ సమయమునకే సతీష్ అక్కడకువచ్చి ఆమె పని సరిగా చేయక పోవటం చూచి వేళాకోళం చేసాడు. రజనికి చాల కోపం వచ్చింది. నిజంగా రజని కంత కోపం వస్తుందని సతీష్ అనుకొనలేదు. కోపం వచ్చినదని తెలిసిన వెంటనే క్షమార్పణ అడిగినాడు.

ఈ సంఘటన జరిగిన తరువాత ఇరువురు ప్రాణస్నేహితులయ్యారు. రజని సతీషుయొక్క సహాయము వలన ఆ సంవత్సరం పరీక్షలో పాసుఅయినది స్నేహము ఆనాటికానాటి వృద్ధియయి వారిరువురి హృదయములలోను నాటుకొని పోయి చివరకు అది గాఢమయిన ప్రేమగా మారిపోయినది. డాక్టరీ పరీక్ష పాసు అయిన వెంటనే తనను పెండ్లి చేసుకొంటానని సతీష్, రజనితోచెప్పి తన కోరిక ప్రకటించాడు. సతీషుని ప్రేమ చాల స్వేచ్ఛయైనది. సతీషు ఒక్కొక్కప్పుడు ప్రేమలోపడి పిచ్చివాడవుతూ వుండే వాడు. మరొక్కప్పుడు ఉదాసీన భావంతోవుంటూ వుండేవాడు. కాని రజని ప్రేమ సతీషుని ప్రేమవంటిది కాదు. ఆమె ప్రేమలో యెప్పుడు శాంతము, సత్యము, ఇమిడి వున్నట్లుగా ఒకే మాదిరిగా వుండెడిది. ఆ ప్రేమలో ఎప్పుడుకూడ క్షీణదశ అనేది కనిపించేదికాదు. సతీషుని ప్రేమ గోడమీద పిల్లి వాటమని ఆమెకు తెలియును. అప్పుడప్పుడు సందేహముకూడ కలుగుచుండేది. కాని ఆ సందేహమునకు ఆమె హృదయములో ఎక్కువ కాలము స్థానం వుండేదికాదు. వెంటనే దానిని మరచి పోయేది.

రజనికి లత అనేటటువంటి పేరుగల ఒక చెల్లెలువున్నది లత కొద్దిరోజుల క్రితమే ఇంటరు పాసయినది. రజని తల్లి దండ్రులు ఆమె చిన్నతనములోనే మరణించిరి. అందువలన రజనియే లత గార్డియన్ అయినందున ఆమె భారము కూడ రజని మీద పడినది. ఆమెను కూడ రజనియే చదివించుచుండెను. లతకు డాక్టరీ చదవాలనే కోరిక ఎక్కువగ వుంది. కాని రజని లతతో బి. ఎస్. సి చదువ వలసినదని బలవంతము చేసినది. బి. ఏస్. సి. పాస అయిన తరువాత విదేశంకూడ చదువుకు పంపిస్తానని లతతో ఆమె చెప్పినది. అనేక పర్యాయములు లత బొంబాయి రావాలని ప్రయత్నముచేసినది. కాని లతయొక్క మనస్సు చాల చంచలమయినదని రజనికి తెలిసినందువలన ఆమెను బొంబాయికి రాకుండా చేసినది. అయినా లత తన అక్కగారి మాటయందు లక్ష్యముంచక బొంబాయి తనకుతానే వచ్చినది.

లత బొంబాయి వచ్చిన తరువాత అక్క స్నేహితుడైన సతీషునితో పరిచయమైనది. లతతో పరిచయమైనది మొదలు సతీషుని చంచల ప్రేమ రజనినుండి మరల లత వైపుకు తిరిగింది. రజనిలోనేకాక మరియేయితర స్త్రీలోను లేనటువంటి సౌందర్యము, ఆనందము సతీషునికి లతలో గోచరించాయి. ఆ ప్రేమలో ఎటువంటి ఆకర్షణ, మత్తు వున్నాయో మన కేమితెలియును ? సతీషు పూర్తిగా లత వైపు లాగబడినాడు. లతకూడ సతీషుని ప్రేమిస్తోంది. రజని కూడ తనప్రేమను సతీషునకు అప్పచెప్పినదన్న సంగతి ఏ మాత్రముకూడ లతకు తెలియదు. తన అక్కకూడ సతీషునే ప్రేమించినదన్న విషయము తెలిసి యుండినట్లయితే ఆమె సతీషుని ప్రేమను తిరస్కరించి యుండెడిది.

లత (తీగ) లతమాదిరిగానే ప్రేమించిన ప్రియుణ్ణి తన బాహువులలో బంధించి వేసుకున్నదని తెలిసిన వెంటనే రజని హృదయములో పగతీర్చుకోవాలనే కోరిక వుదయించింది.

సోదరి

ఒక రోజున రజని బయటికి ఎక్కడకో పనివుండి వెళ్ళినది. ఆమెవచ్చే సరికి సతీష్, లత, గదిలో కూర్చుని సంభాషించుకొనుచున్నారు. వారిరువురు ఏమి సంభాషించుకొనుచున్నారో వినవలయుననే కుతూహలము అప్పుడే తిరిగివచ్చిన రజని హృదయములో జనియించినందున గది ద్వారము దగ్గరకు వెళ్ళి వారిరువురి మాటలు వినుచున్నది. లత తన అక్క కూడ సతీషునే ప్రేమించుచున్నదని తెలిసికొనిన వెంటనే చాల పశ్చాత్తాపపడి, తన సోదరి సుఖముకొరకై తన సుఖమును త్యాగముచేయుటకు సిద్ధమయినదని వారి సంభాషణనుబట్టి రజని తెలిసికొనెను. ఇంతే కాకుండా ఇంతవరకు జరిగిన వారి స్నేహమును కూడ మరచి పోవలసినదని లత సతీషునితో గట్టిగా చెప్పుచున్నది. లతయొక్క మాటలు విని రజని కొయ్యబారి పోయినది. తన సోదరిలో ఇంత త్యాగం ఇమిడివున్నదని ఆమె కలనైన తలచియుండలేదు. లత తనకు ద్రోహము చేయుచున్నదని తలచి అనేకసార్లు ఆమెను తన హృదయములో నిందించినది నిజముగ లత నిర్దోషి. నిర్దోషి యని తలచిన సతీష్‌యే దోషి. లత ఎంత నచ్చ చెప్పినను సతీష్ రజనితో వివాహము చేసికొనుట కొప్పు కొనలేదు. తన ప్రాణముకంటె ఎక్కువగ ప్రేమించే సతీషు ఇలా అయిపోయాడేమిటా అని రజనికి ఆశ్చర్యం కలిగింది.


ఇక తను జీవించటం నిరర్థకం అనుకుంది. తను జీవించియున్నప్పటికి సతీష్ తనను ప్రేమించటం అసంభవం. హృదయపూర్వకముగ తనను ప్రేమించిన ప్రియుడు మరొకరిని ప్రేమించటంచూచి ఆమె ఎట్లా జీవించగలదు. తను జీవించియుండగా తన చెల్లెలు లత అతనిని ప్రేమించదు. ఆమె తనను ప్రేమించక పోవటంచేత సతీషు పిచ్చివాడయి పోతాడు. తనవలన నిష్కారణముగ మూడు జీవితాలు భగ్నమయి పోతాయి. కనుక తన జీవితాన్ని బలి చేసినట్లయితే వాళ్ళిద్దరు సుఖజీవనం చేస్తారు అని ఆలోచించి ఆఖరికి తన సోదరి లత తన ప్రియుడు సతీష్‌యొక్క సుఖమును కోరి ఆమె సముద్రములోపడి మరణించినది.

లతా సతీషులు ఆమె కొరకు అనేక చోట్ల వెదికారు. కాని ఆమెజాడ ఎక్కడ కనుపించలేదు. మరుచటి రోజున పేపరులో ఒక ప్రకటన చేయబడినది. "ఎవరో ఒక యువతి సముద్రములోపడి మరణించినది. సముద్రపు ఒడ్డున ఒక చేతి సంచివున్నది. దానిలో ఒక వుత్తరం ఈ విధముగా వున్నది—నేను ఎవరిని గురించి మరణించుటలేదు. నా మరణమునకు నేనే కారకురాలను. దీనిన గురించి ఎవరిని బాధించ వలసిన అవుసరం లేదు. నా హృదయములో తీరని బాధ ఏర్పడినది. దానిని బాపుకొనుటకై నేను స్వయముగ ఆత్మ హత్య ప్రయత్నమునకు గడంగు చున్నానని— దానిలో వున్నది. అది పోలీసు అధికార్లకు వ్రాయబడినది. దానిమీద రజని సంతకముకూడ వున్నది.

ఈ ప్రకటన చూచిన వెంటనే లతా సతీషు లిరువురు కారుపై స్టేషనుకు వెళ్ళి రజని తమ తాలూకని చెప్పి ఆ చేతి సంచి యుత్తరము తీసికొని చదివి ఆమె త్యాగమునకు అబ్బురపడిరి. చిన్న వయస్సులోనే ఆమె జీవితము ఆ విధముగ బలియయి పోయినందుకు వారిరువురు చాల విచారించిరి. అప్రయత్నముగ వారి నయనములనుండి అశ్రు కణములు జారిపడినవి. ఒక క్షణములో ఆ కణములు మటుమాయమైనవి. ఏమైననేమి వారిరువురు ఇప్పుడు నవ దంపతులు. వారి ఆనందమునకు హద్దులేదు ఎట్లైనను రజనియే అభాగ్య జీవిగదా? ఆమె విషయము స్ఫురించి నప్పుడు ఒక క్షణము విచారించేవారు. మరు క్షణము తమ ఆనందములో తాము మునిగిపోయేవారు. ఆహా! ప్రేమ ఎట్టి స్వార్థము గలది. ప్రేమ ఇంద్రజాలముకంటె ఎక్కువయినది. దీనికి మీరేమంటారు? చెప్పండి.



మీ ఆరోగ్యానికి
సేవించండి



ఆటగాళ్లకు, దుర్బలులకు కూడా, బోర్న్‌వీటా ఎక్కువ మంచితనాన్ని, ఎక్కువ పుష్టిని కలుగజేస్తుంది కాబట్టి, ఎక్కువ శక్తినికూడా కలుగజేస్తుంది. దీని చాకొలేట్ రుచిని పసిబిడ్డలు కోరుతారు. ఒక కప్పుడో, గ్లాసుడో వేడి లేక చల్లని పాలలో రెండు టీస్పూనులు పొద్దున్న సాయంకాలము తీసుకోండి

Cadbury
THE TREE OF HEALTH
- ఆరోగ్యవృక్షం -

CFY I TEL

వేడి
లేక
చల్లని

కాడ్బరీస్ బోర్న్-వీటా

క్యాల్షియం మరియు ఎ, డి విటమినులతో నిండి ఉన్నది

కాడ్బరీ - ఫ్రై (ఇండియా) లిమిటెడ్,
P. B. 1417, బొంబాయి - P. B. 251, కలకత్తా - P. B 1725, మదరాసు



పిల్లల కథ

శ్రీమతి ఆ. బాస్కరమ్మగారు

చిన్నలక్ష్మి కల

ఒకరోజున లక్ష్మి ప్రొద్దున్నే లేచి తనకు రాత్రివచ్చిన కలన్ను ఈ విధంగా చెప్ప మొదలు పెట్టింది.

నేనొక ఎయిరోప్లేను మీద యెక్కాను. ఆ విమానం ఆలా యెక్కడికో మేఘాల్లోంచి పోతోంది. ఎంతదూరం పోయిందో? పోయి పోయి ఒకచోట దిగింది అది దిగుతోఉంటే చలి విపరీతంగా వేస్తోంది. భరించలే నంతచలి. అబ్బా! అంతచలి యెప్పుడూ చూడలేదు విపరీతమైన గాలికూడాను. ఆ గాలికి మన తలుపులైతే విరిగి పోవలసిందే. అది రాత్రో పగలో తెలియదు. ఆకాశంలో సూర్యుడూ లేడు, చంద్రుడూ లేడ. ఏదో తమాషా అయిన వెలుగు. ఆ వెలుగు రంగు రంగులుగా ఉంది. పట్టణాలలోని ఎడ్వర్టైజు బల్లలలో వస్తూ పోతూ మెరిసే ఎలెక్ట్రిక్కు దీపాలలాగ ధగ ధగ మెరసి పోయింది ఆలాటి వెలుగును మన మెక్కడా చూడం.

క్రిందికి దిగేసరికి క్రిందంతా మంచుమయం గడ్డ కట్టి పోయియుంది. ఎక్కడా ఒక చెట్టుకాని, పుట్టకాని చివరికి ఒక పచ్చని గడ్డి పోచైనా కనపడలేదు. అక్కడ కొండలు, గుట్టలు, రాళ్లు అన్నీ మంచు మయమే ప్లేనులో నుండి భూమి మీద అడుగు పెట్టాను కదా ఇక ఆ చలికి తట్టుకో లేక పోయాను. నేను కూడా ఆ మంచులో గడ్డ కట్టుకొని పోయానో ఏమో ఇక నాకు తెలివిలేదు.

నాకు తెలివివచ్చి కండ్లువిప్పి చూసేసరికి ఒక గుహలో ఉన్నాను. ఆ గుహఅంతా చీకటి. పైకప్పుకు మద్యగా మినుకు మినుకుమంటూ ఒక చిన్నదీపం వెలుగుతోంది. ఆ గుహ కూడా మంచుమయమే. దానిలో నాలుగు ఎలుగు బంట్లున్నాయి. రెండు పెద్దవి, రెండు చిన్నవీను. వాటిని చూసేసరికి నాకు చాలా భయంవేసింది పారి పోదామంటే దారిలేదే! ఏలా? కాని పాపం అవి నన్నేమి చేయలేదు

అవన్నీ క్రింద తోళ్ళమీద పడుకొని యున్నాయి. నన్ను చూచుకొందును కదా నేనూ ఒక తోలు మీఁదనే పడుకోని యున్నాను. నా కెదురుగా నున్న గోడకొక అద్దంఉంది. అదీ మంచుఅద్దమే. దానిలో నేనుకూడా ఎలుగు బంటిలాగే ఉన్నాను. ఇదేమిటి నేనుకూడా ఎలుగు బంటి నయి పోయాను కాబోలు ఈ ఎలుగు బంట్ల మధ్య అనుకొన్నాను. అసలు ఇక్కడికేలా వచ్చానో తెలియదు. ఎలుగుబంట్లన్నీ నిద్రపోతోన్నాయి. అవిలేస్తే నన్ను పీక్కు తింటా యేమోనని భయం. పారిపోవడానికి దారిలేదు. ఇక చచ్చిపోతాను కాబోలు, ఈ ఎలుగు బంట్లకు ఆహారమవుతాను కాఁబోలు భగవంతుఁడా అని ఆ భగవంతుని ప్రార్థిస్తో ఆలా చూస్తో పడుకొన్నాను.

కొంతసేపయేసరికి ఆ ఎలుగు బంట్లన్నీ లేచి కిచ కిచ లాడుతో ఏవో ధ్వనులు చేస్తున్నాయి. ఇక నాపని అయిపోయింది, ఇవన్నీ నామీఁద పడి తినేస్తాయి అనుకొన్నాను. కాని పాపం అవి నన్నేమీ చేయలేదు. ఒకమూల దాచి యుంచిన మాంసం ఇంత తీసికొచ్చాయి. నాకు కొంచెం మాంసం ఇచ్చి తక్కిన దానిని అవి పీక్కు తింటోన్నాయి. ఆ మాంసం నేనేలా తింటాను? నాకెప్పుడూ మాంసం తినటం అలవాటులేదే. అందులోనూ పచ్చిమాంసం దానిలో ఉప్పా, కారమా, మసాలా, ఏమీలేదు ఎక్కడైనా పళ్లైనా, రొట్టెలైనా ఏమయినా ఉన్నాయేమో తిందా మనుకొన్నాను. ఆ మాంసం తప్పితే ఎక్కడా యేమీలేదు. ఆకలి కడుపులో మాడిపోతోంది. ఏంచేయను? ఎల్లాగో కళ్లు మూసుకొని ఆ మాంసం కొంచెం తిన్నాను వికారపెట్టింది. కడుపులో తిప్పింది. మళ్లీ కళ్లు మూసుకొని పడుకొన్నాను. కొంత సేపటికి సర్దుకొంది. కొంతకాలం గడచిపోయింది. ఆ ఎలుగు బంట్లు ఆలా ఆ గుహాలోనే ఉంటోన్నాయి కాని యెక్కడికీ వెళ్లడంలేదు. ఈలా ఉండగా ఒకరోజున ఏవో పొడుగాటి బల్లాలాంటివి తీసికొని రెండు ఎలుగు బంట్లు ఒక కన్నంలోంచి పైకి పోతోన్నాయి. వాటితోఁబాటు నేను కూడా ఆ కన్నంలోంచి దూరి పైకి వచ్చాను. బయట అంత చీకటిగా లేదు. నేను మొదట చెప్పానే ఆ వెలుగూ లేదు. ఆకాశంలో సూర్యుఁడు ఎఱ్ఱగా సగంమాత్రం కనబడుతోన్నాఁడు. ఎంతసేపయినా అంతే. ఇక పైకిరావడం లేదు. కొంచెం వెలుగుగా ఉంది. ఆ ఎలుగు బంట్లు నా విషయంలో చూపే దయచేత అవి నన్నేమీ చేయక పోవడంచేత నాకు కొంత భయంతీరింది. వాటి దగ్గరగా వెళ్లిచూస్తే ఎలుగు బంట్లు కావు. మనలాగే తల, ముక్కు, చెవులు, కళ్లు, నోరు, కాళ్లూ, చేతులూ అన్నీ ఉన్నాయి. కాని పొట్టిగా, తెల్లగా పాసిపోయిన వాళ్లలాగ ఉన్నారు. ముఖాలు తప్పితే శరీరమేమీ కనబడడం లేదు. శరీరమంతా బొచ్చుతో ఉన్నతోలు బట్టలు కాబోలు ఎలుగు బంట్లలాగే యున్నారు. నేను మొదట ఏరోప్లేను దిగినప్పుడు చలికి భరింపలేక పోయానా. ఇప్పుడు నామీద కూడా ఆలాటి దుస్తులే ఉండడంచేత కాబోలు చలిలేదు. వెచ్చగాఉంది. వాళ్ల ముఖాలు మన

ముఖాలలాగ సాఫుగా లేవు. ఏదో ముడతలు ముడతలుగా ఉన్నాయి. అక్కడి చలికి ఆలా ముడుచుకు పోతాయేమో. చేతుల్లో బల్లాలు పట్టుకొని రెండు కాళ్లతోటే నడుస్తున్నారు. తీరా చూస్తే వాళ్లూ మనుష్యులే. అయితే అదోజాతి మనుష్యులను కొంటాను.

మేము ముగ్గురమూ మంచుమీదే నడుస్తున్నాం అక్కడమంచు తప్ప మరేమయినా ఉంటేగా. మేమీలా వెడుతోఉంటే ఇంకా కొంతమంది వచ్చి మమ్మల్ని కలుసుకొన్నారు. వాళ్లూ ఈలాగే యున్నారు. ఆలా వెడుతో ఉంటే ఏం జరిగిందనుకున్నారు! ఒకచోట ఒక కన్నంలోంచి ఏదో జంతువు తల పైకి వచ్చింది. వెంటనే అందులో ఒకడు అతి చురుగ్గా బలంగా బల్లెంతోటి దాని తలమీద పొడిచాడు. తక్కిన వాళ్లు గబగబా ఆ కన్నంచుట్టూ ఉన్న మంచునంతనూ బల్లాలతోటీ, చేతులతోటీ త్రవ్వి పైకి లాగేస్తోన్నారు మనం సముద్రపు వొడ్డున ఇసుకను లాగినట్లు. వీళ్లీలా చేస్తుంటే ఒక కొండమీదనుండి నిజంగా ఎలుగుబంటే పెద్ద అరపులు అరుస్తూ మా మీదికి వచ్చింది. నేను హడలిపోయి పారిపోతోన్నాను. అక్కడున్న ఆ చిన్న కుఱ్ఱాడు భయంలేదు ఏమీలేదు అంటూ అమాంతంగా దాన్ని బల్లెంతో పొడిచి చంపేశాడు. ఆ ఎలుగుబంటి నల్లగాలేదు. తెల్లగాఉంది. ఇక్కడ వీళ్లు ఆ మంచులోంచి ఆ జంతువును పైకి లాగిపడేశారు. పేద్ద జంతువు. అది చేపాకాదు. జంతువకాదు. ఏదో తమాషాగా ఉంది. చిన్న తల, చిన్నకళ్లు పేద్ద శరీరం సముద్రంలో ఉండే జంతువే. తరువాత ఒక బండిని తీసికొచ్చారు. ఆ బండికి చక్రాలు లేవు. కుక్కలు లాగుతోన్నాయి. ఈ ఎలుగుబంటిని, ఆ జంతువును ఆ బండిమీద పడేసి నేను మొదట ఉన్నానే వాళ్లింటికి తీసుకొచ్చారు. ఆయింట్లో ఇంకో ఇద్దరున్నారు కాదూ, వాళ్లుకూడా యివతలకు వచ్చారు. వాళ్లూ వీళ్ళూ కలిసి కత్తులతోటి జాగ్రత్తగా ఆ జంతువుల మీద చర్మమును తీసివేశారు. వాటి మాంసంముక్కలు కోసి జాగ్రత్త పెట్టారు. ఈ యింట్లో ఉన్నవాళ్లిద్దరూ ఆ తోళ్లను పళ్లతో నమలుతోన్నారు. ఎందుకు చెపమా అని నేను ఆశ్చర్యంగా చూస్తూఉన్నాను. ఆలా నమిలితే అక్కడ అది కొంచెం మెత్తపడింది. అక్కడి నుండి సూదీదారం తీసికొని వాటెని దుస్తులక్రింద కుట్టున్నారు. వాళ్లకి సూదీదారం ఏలా వచ్చాయి అనుకొన్నాను. అవి మన సూదులు లాంటి సూదులు, దారంకావు. వాళ్ల కత్తులూ, బల్లాలు, సూదులూ, బళ్ళూ అన్నీ ఎముకలతో చేసినవే. వాళ్ల దారాలు అక్కడి జంతువుల నరాలు. వాళ్లందరి దుస్తులు ఒకలాగే ఉడండం చేత మగవాళ్లెవరో, ఆడవాళ్లెవరో తెలిసికోవడం కష్టం. కాని ఆహారంకోసం ఆ పైకి వెళ్లినవాళ్లు పురుషులని ఇంట్లో ఉండి ఈ దుస్తులూ అవి తయారుచేసే వాళ్లు స్త్రీలనీ తెలిసికొన్నాను.

మా చిన్న చెల్లాయివచ్చి అక్కా! అక్కా! అని వీపుమీద తట్టింది. కళ్లు విప్పిచూస్తిని కదా నేను నా మంచంమీదే ఉన్నాను. తెల్లవారింది. క్రితం రోజున చదివిన జాగ్రఫీ మహాత్యమనుకొని నవ్వుకున్నాను.

★

సౌఖ్యమెక్కడున్నది!

సౌఖ్యమెక్కడున్నది ?

సంతృప్తినిచ్చు విజ్ఞానములో సౌఖ్యమున్నది !

విజ్ఞానార్జనకు విద్య అవసరమేగాని, కేవలపుస్తకపఠన మాత్రమున విజ్ఞానమలవడదు. పగి పుస్తకములు చదివి, వానిలోని మాటలనే చిలుక పలుకులవలె వల్లించెడి వారు, పండితులుగా పరిగణింప బడవచ్చునుగాని, విజ్ఞానులనుటకు వీలులేదు. హృదయాంతరములో నైజముగా నంకురించిన, ఉత్తమసంస్కారాభి వృద్ధియే విజ్ఞాన మనదగును.

పదివేల పుస్తకములు జదివిన వారికన్నను, తమను తాము చదివినవారే విజ్ఞానులు, సౌఖ్యజీవులు! వారు ప్రపంచమును గుర్తించెదరేగాని, లెక్కచేయరు, ఆత్మగౌరవమునే గాని అహంకారమును జూపబోరు, పూరి పుడకనైనను నిరసనతో విసరి వేయక, సమయానుకూలముగ నుపయోగించుకొనుచు,తమస్వశక్తితో నిలుపవలెనను ఆశింతురేగాని, ఎంతటి బలీయునైనను చీడపురుగువలె నీచముగా ఆశ్రయించి, బ్రతుక నిచ్ఛగింపరు ; ఏదియైనను, ప్రతిఫలమిచ్చియేగాని పుచ్చుకొన లేరు. ప్రేమకేగాని, అధికారమునకు లొంగనొల్లరు.

తాము నమ్మిన ఆదర్శముల నాచరణకు తెగలిగిన ధీరత్వముగలిగి, పైవారి విమర్శనలకు చెదరని స్థిరచిత్తముగల మానిసియే విజ్ఞాని ; పరమసుఖి ! అట్టివారికి, ఆదర, అనాదరణలు దారిలో నెదురుపడు బాటసారులేగాని, తమ మానస మందిరమున నివసింప వచ్చు ఆత్మీయులుగారు. దూషణ భూషణములకు వారి వీనులు సామాన్య బాటలేగాని, తమ తమ సుందర హృదయాగార ప్రవేశమునకు సింహ ద్వారములుగావు. వారు తమ అంతరంగమునకు తామే అధికారులై, హృదయ వాదముల వినుటకును, ఉచితానుచితముల విమర్శించుటకును, అలవాటుపడిన అసామాన్య ధీమంతులు. మనోదౌర్బల్యమున క్రుంగినవారిని అలుసు జేయక, సానుభూతితో ఆదరించి లేవనెత్తగోరు దయాంతఃకరణులు.

విజ్ఞానులు, భూభారమంతయు తమ భుజాస్కందముల పైననే నిలిచియున్నదని తలంచు విపరీతాహంభావపూరితులుగారుగాని, ఓపినకొలది సేవజేయగల ఉత్తమ సైనికులుగా తమ్ము భావించుకొను వీరాగ్రగణ్యులు. వారి కెదురగు అడ్డంకులే, యెత్తునకెగబ్రాకజేయు అసామాన్యవకాశములు ; కిట్టనివారి కట్టుడిమాటలు, సునిర్మితమగు సౌధాగ్రముపై బడిన వడగండ్లవలె, చెదరికరగి పోవునేగాని, వారినినొప్పింప జాలవు. వారికికలుగు ఆపదలు, యోధాగ్రేసరుల శరీరముమీది గాయములవలె మరింత వన్నెను, వాసినిగలిగించు అమూల్యాలంకారములు

తమ ఉచ్ఛత్వముగాని, నీచత్వముగాని, పైవారి దృక్పథములోగాక, తమ నిజ జీవిత విధానములోనే గలదని గుర్తించి, మనసు ప్రబోధించునట్లు మసలువారే ఉన్నత విజ్ఞానులు, నిత్యానంద జీవులు ! కాలమును, నిన్నటి గురువుగను, నేటి పరిచారికగను, రేపటి ఆప్తమిత్రముగను వినియోగించుకొని మేలొందగల నేర్పరులు. విఘ్న పరంపరలకు వెసివి, మొదలిడినవి మధ్య విడచుట వారి యభిప్రాయములకు విరుద్ధము. ఆడినంతసేపు, జయకరమగునట్లుగా పట్టుదలతో ముద్దులొలుకుచూ ముచ్చటగా ఆడెడి విధానమే ప్రధానముగాని, చిగురిగెలు పోటములే ముఖ్యముగా పరిగణించు మొరటు మానసులుగారు. తమ ప్రయత్న లోపమును, " విధి కృతము "అని, నిస్సారపు మాటలతో దేవుని తలపైన బాధ్యతమోపుట వారికలవిగానంత వెగటు గలిగించును. ప్రభువుగా పరమేశ్వరుని భావించునుగాని, తన జీవిత నౌకను త్రిప్పు కర్ణధారినితానని అంగీకరించుట కెంతమాత్రము సంకోచింపడు. తన ప్రయత్నములు, విఫలములైనపుడు, " ఓహో ! ఈశ్వరాజ్ఞ యిట్లున్నదా ? నే నిప్పుడు తెలిసికొన లేకుండనున్నానేగాని, యిందేని గూఢార్థమిమిడియున్నదో ! ఇదే విశేష సాధనకని నిర్దేశింప బడినదో ! " అని, సమాధానబడి, క్రొత్త పరిస్థితుల కనువుగా, జీవయాత్ర సాగించ సమకట్టును.

ఆత్మ వంచనలేని వారగుటచే, వారికి పాపభీతియే లేదు. ఈ లోకమును వీడలేని మమకారములేదు ; మరొక లోకమునకు పోవలెనను కాంక్షలేదు. పరిపూర్ణజ్ఞానితనని, కష్ట పూరి

తము ప్రపంచమని, రోయడు, పరమ పామరుడనని పశు తుల్యుడుగానూ ప్రవర్తించడు. ఐహికముల విసర్జించిననేగాని ఆముష్మికానందము సాధించలేమను విపరీతాశయములు లేవు. తామెచట నిలిచిన నదియే స్వర్గ సీమయనునట్లు, సంతోష ముప్పతిల్లజేయగల కళాశీలులు.

ప్రకృతియే వారికారాధ్య దైవతము, ఆది శక్తియే యిల వేలుపు. "పరోపకారమే పుణ్యము, పరపీడనమే పాప" మన్నదే వారి మతము. లోకములోనున్న అన్నిటిలోని అందమునూ అర్థముజేసుకుని, అనుభవించుతూ పోవుటే వారి జీవిత లక్ష్యము. పగవానికి గూడ పంచదార పంచిబెట్టి, జీవితమాధుర్య మనుభవించగలుగుటే వారి ప్రత్యేక విశిష్టత.

పైవారి దూషణ భూషణముల లెక్క కొనక, యంతరంగము నిర్దేశించిన దారినిబోవుచు, బరులకు సుఖమిచ్చుటలోనే తమకు సౌఖ్యముగలదన్న ప్రకృతి రహస్య మెరుగుటే సిసలైన విజ్ఞానము. ఆ విమల విజ్ఞానమే సంతృప్తిసాధకము. అట్టి సంపూర్ణ సంతృప్తిలోనే సంతత సౌఖ్యమున్నది.

అదే బ్రహ్మానందము!

—శ్రీ వి కె మణి

★

దైవ, మానవ, దైత్య తత్వాలు

* దొప్పలపూడి అనసూయ *

అపకారికి ఉపకారము తలపెట్టునది, దైవ బుద్ధి; ఉపకారికి ఉపకారము తలపెట్టునది మానవబుద్ధి; ఉపకారికి అపకారము తలపెట్టునది, రాక్షసబుద్ధి.

* * *

తనసంపద పరోపకారమునకై వెచ్చించి తృప్తిపడునది దైవమానసము; తనసంపదతానే వినియోగించుకొని తృప్తిపడునది మానవమానసము; పరులసంపదను అపహరించి తృప్తిపడునది అసురమానసము.

* * *

అమృతరస పూరితములైన ఫలములబక్షింప గోరునది దైవజిహ్వ, ధాన్యములు, దుంపలు, శాకములు మొదలగువానితో చేయబడు పాకములను తినగోరునది మానవజిహ్వ, ఒకప్రాణి విలవిల తన్నుకొనుచుండ పట్టి కరకరకోసిన మాంస కండరములను ఆహారముగా మెసవ యువ్విళ్ళూరునది రాక్షసజింహ్వ.

* * *

ఋతుకాలమునందు సతీపతులు సంతానకాంక్షతో గూడునది దైవమిథునము; ఆయాకాలములందు సతీపతులు పరస్పరానురాగముతో సంతోషార్థము కూడునది మానవమిథునము, కామాతురతతో నీమములేక బలవంత పరచియైన కూడునది రాక్షసమిథునము.

* * *

సుగుణ భూషణములతో ప్రశాంతప్రదమై సమీపించినకొలది సౌందర్యము చిందుచుండు సౌకుమార్యమూర్తి దైవస్వరూపము; వన్నెవన్నెల దుస్తులతో సువర్ణాది భూషణములతో అందముగ కానుపించునది మానవస్వరూపము; వస్త్రాది అలంకరణములున్ననూ దవ్వున నుండియె వికృతముగ గోచరించునది, రాక్షసస్వరూపము.

★

ఐక్య హృదయములు

❋ చల్లా సత్యేంద్రశంకర్ ❋

గణ గణగణగణ .. "అబ్బ! అప్పుడే రెండో బెల్లు కూడా అయింది. ఇంకెంతో టైము లేదు. స్కూలు కూడ పది నిమిషాల ప్రయాణ దూరంలో వుంది. వేళకు వెళ్లక పోతే మాష్టరుకి కోపం వస్తుంది. అయిన ఆలస్యాన్ని ఏదో మాదిరిగా సర్ది చెప్పేస్తాను. ఇహ మాత్రం ఆలస్యం కూడదు.

అమ్మకేమిటో పిచ్చికంగారు. నాకు వయస్సు వచ్చేసిందంటుంది. ఎంతో ఆరాటం ఎంతో భయం. ఇంత భయమయితో ఏలాగోకాని బాబూ ..ఇల్లాటమ్మతో ఏలాగైనా చిక్కులున్నయి. నాన్న చూడు యిపుడేమంత కంగారు అంటాడు. ఎంత దయ, ఎంత విశాల దృష్టి నాన్నకి. అమ్మకే యీకంగారు నా వయస్సులోని వుద్వేగాలను తనే అనుభవిస్తున్నట్లు మహా!

ఈ అబ్బాయి అల్లా చూస్తాడేమిటి బాబు. ఆ కోర చూపులు, ఆ వంకరగా బిగపట్టిన మాతి-ద్రోహి సినిమాలో శివరావు పెదబాబులా వున్నాడు. ఏం చదువు కొన్నాడో గాని అసలా మొహంలో చదువుకొన్న కళే లేదు. ప్రేత కళకు మాత్రం అవతారమూర్తి. ఇతడేలావుంది పెళ్ళి కొమారుడు.

అమ్మకెంత వుత్సాహం! అందమనే దాన్ని అమ్మ బుద్ధి అందుకోలేదా? అమ్మ కసలీ ఆలోచనే వుండి వుండక పోవచ్చు" ఇలా ఆలోచిస్తూ గడియారం వంక చూసింది సరళ. ఇంక ఒక నిమిషం మాత్రమే మూడో బెల్లు నాపు చేసింది. ఇలా అనుకొని ఎవరో పిలుస్తున్నట్లు గబగబా వెళ్లి పోయింది. వీధిలో రిక్షా కేకేసుకొని అందులో బయలుదేరింది.

సరళకు పదహేనవయేడు. ఆమెను చూసిన మొదటి చూపులోనే ముగ్ధులవ్వాలి. ఐదో ఫారం చదువుతూవుంది. సరళ తల్లికి రెండేండ్లయి పుట్టింది సరళకు పెండ్లి చేయవలెననే వుద్దేశం. రెండుమూడు సంబంధము లిప్పటికే వచ్చాయి. వారికి వీరికి కట్న కానుకలలో తేడాలొచ్చి వుండుట జేసి సరళ వివాహ మప్పటికాపవలసొచ్చింది.

ఇది నాల్గవ సంబంధము. చాలా పెద్ద ఆస్తి పరులు. ఒక్కగా నొక్క కొడుకు. కట్నం అక్కర లేదట, గాని అందముంటే చాలుట. అసలిక్కడేవుంది పెండ్లికొమరునికి వుండవలసిన లోపాల కీలకం. కట్నాలంటే బెదిరే సర్వమంగళమ్మగారు సరళకి సంబంధంచేసిన సుఖపడుతుందని ఆశపడింది. అయినింటపుట్టింది, ఐశ్వర్యవంతుడింట పడుతుంది అని ఎంతో సంబరపడింది సర్వమంగళమ్మగారు. కూతురు వివాహ విషయంలో యీమెదే పెత్తనమంతా. అందముంటే డబ్బుండదు, డబ్బుంటే అందముండదు, అనే వుద్దేశాన్ని యీమె పూర్తిగా బలపరుస్తుంది. అయినా అందం కొరుక్కు తింటామా అని కూడ సమాధాన పర్చుకొంది. పక్కింటి సరమ్మగారి సరోజ అందమయిన వానిని చేసుకొని మహాసుఖ పడిందేమిటనే కొన్ని దృష్టాంతాలను కూడ ఆమె చూపగల్గింది.

పెళ్లివారికి మర్యాదలన్ని మర్యాదగా నడిపింది. ఇహ వారు వెళ్తామన్నారు. వెళ్లినవెంటనే తండ్రిగారి అనుమతిని కూడ పొంది వుత్తరంవ్రాయటం తప్ప యింక తనకే యభ్యంతరము లేదని పెండ్లికొడుకు శేషయ్యచెప్పి, తన కాబోయే అత్తగారికి మనసార నమస్కరించి సెలవు తీసుకొన్నాడు.

"త్వరగా తీసుకెళ్లు, ధర్డుబెల్లుకూడ అయింది" అని రిక్షావాణ్ణి సరళ త్వరపెట్టింది. రిక్షా పరుగెట్టుతూ వుంది
"అరె రిక్షా రాయి! రాయి!" అని అరుపు. ఈ అరుపు రిక్షావానిని చేరేసరికి రిక్షా తిరగపడింది. సరళ గాయపడకుండ తప్పించుకుంది. ఇంతలో పరుగెత్తుకుంటూ వచ్చాడు మోహన్. చెల్లా చెదరయిన పుస్తకాలను ప్రోగు చేసి సరళకిచ్చాడు. తనకీయాపత్తు జరుగకముందే తన రిక్షాకు కాషన్ నిచ్చిన మోహన్నుచూచి సరళ తన కృతజ్ఞత తెలియ పరచకుండ వుండలేక ఒకసారి అతనిలోకి బేలగా చూసింది. అదే

సమయానికి ఆమెలోకి చూస్తున్న మోహన్ కళ్లు ఆమె కనులతో కలిసాయి. "నన్ను గుర్తించుకో" అన్నట్లు మెరిశాయి. సరళ హృదయం ఎందుకో గబగబ కొట్టుకొంది. ఆమె తన మనస్సు మోహన్‌లో విడిచి స్కూల్లోకి వెళ్లింది.

పాఠాలు చెప్పుకుపోతున్నారు మాష్టర్లు. సరళ మనస్సు మాత్రం ఎందుకో దేనికొరకో పరుగెత్తుతూంది. ఏదో మధురతమ ప్రణయాలవలపు చినుకులు చిందులాడాయి ఆమె మనోఫలకంపై.

ఇంటికి తిరిగి వచ్చింది. సర్వమంగళమ్మగారు ఎంతో వుత్సాహంతో తనకూతురును ముద్దుపెట్టుకొంది. తనకూతురే కదా త్వరలో జమీందారిణి అవుతుందని కాబోలు! అవును ఏ తల్లికి మాత్రముండదు తనకూతురు జమీందారుల కోడలవుతుందంటే?

అంతా ప్రశాంతం. చీకటి తన తెరలను మరీ నలుపు చేస్తూంది. మాలతీ, రేరాణులు మధుర వాసనల గుబాళిస్తున్నాయి. పూదోటలు రాబోవు రోజుకై ముస్తాబవుతున్నాయి. ప్రకృతి ముగ్ధనారిలా మౌనంగా తనకార్యాన్ని నిర్వహిస్తూంది. అందం, ఐశ్వర్యాల మధ్య సరళ మనసు పెనుగులాడుతుంది. సరళకిదేయేమో రాబోవు జీవన్నాటకానికి నాంది ప్రస్తావన!

"మోహన్ ఎంత పరోపకారబుద్ధిగలవాడు! ఎంత అందం! అందానికి తగ్గ సౌష్టవం కూడ! ఏం చదువుతున్నాడో ఏమో! అవును మరచా. ఆ రోజున పెన్ను తీసుకొందామని అన్న దగ్గరకెళ్ళినప్పుడు బి.ఏ. క్లాసులో కూర్చున్నతడితడే! అన్ని నక్షత్రాలలోనూ చంద్రుడేగా మనకు కాంతి నిచ్చేది! అప్పుడు యథాలాపంగా చూచా. ఇప్పుడతడే పరిచయం చేసుకొన్నాడు. చంద్రుడేగా కుముదముల కొరకై వచ్చేది! ఈ పరిచయంయొక్క అంతిమ సందేశమేమో! ఏమయినా సరే యితడే నా యాశలకు రూపునొసగే నాణెకాడు. ఇతడు నేను జీవితంలో భాగస్తులమవుతే! ఛ! తప్పు, కాదు.

"మనసా! నీవెంత చిలిపిచేష్టకయిన వెఱవవు గదా! అతనెక్కడ నేనెక్కడ? ఈ సంగతి తల్లికి తెలుస్తే కోపయ్యేదూ! తల్లి ఏం చేసినా, ఏం చెప్పినా నేను మాత్రం ఆ శేషయ్యను పెళ్లి చేసుకోను. నేను భారత నారిని. నా ముందు సావిత్రి, దమయంతిలాంటి దివ్య ప్రేమికులున్నారు. నేను వారికి వెనుకబోను. ఆ జమీందారును చేసుకోను. అతడి కోటలో యెన్ని యినుపపెట్టెల ధనమున్ననూ సరే!" అని సరళ మనస్సు ఒక నిశ్చయాని కొస్తూండగానే ఆమె నిద్రాదేవి ఒడిలో తలదాచుకుంది.

శేషయ్యకు వ్యతిరేకంగాను, మోహన్‌కు అనుకూలంగాను సరళ నిశ్చయించుకున్నదంటే ఆశ్చర్యమేముంది? 'కన్యావరయతే రూపమ్' అంటారుగా మన పూర్వీకులు!

ఆ రోజు సరళ తనకున్న వాటిలో అందమైన దుస్తుల ధరించింది. ఇది ఆమె ఎరుకలో చేసినట్లు తోచదు. సరళ నిజంగా ఆ రోజు మూర్తీభవించిన స్త్రీరత్నం. స్కూలు వైపు నడుస్తూంది.

మోహన్‌కూడ అప్పుడే ఒంటరిగా కాలేజికి బయలువెడలుచున్నాడు. సరళ అతని కళ్ళ ఎదుట తొలకరి మెఱుపులా మెఱసింది. కాని యీ మెఱుపు కళ్ళల్లోంచి మనసులో నాటుకొంది. తను ఎరుగకుండానే ఆమెలోకి చూస్తూనే వుండిపోయాడు, ఇది పసుకామ ప్రేరేపణ మాత్రంగాదు. ఆమె నేత్రాల్లో భారత గృహిణుల పరమ పాతివ్రత్యపు అమర గాథల నతడు చదివాడు. మధురానుభూతినొందాడు.

సరళకూడ అతన్ని మనసార చూచింది. అతని మోములోని సత్యప్రకర్ష గంభీరత ఆమె నాకర్షించాయి. మంత్రించాయి ఆ విశాల నేత్రాలు. అతను తన్ని తిరిగి చూచుచుండెనని తెలియుట తోడనే ఆమె సిగ్గుపడింది.

ఆహా! ప్రణయ పురాణంలో నేత్రాల పాత్ర యెంత ఘనమైనది!

* * *

ఏమీ తోచక పోతే సరళ దగ్గరలోనే వుంది కదా అని పార్కుకి వెళ్ళింది. మోహన్‌కూడ అదే స్థితిలో నుండుట జేసి అతనుగూడ ఆ పార్కులో ఒంటరి ప్రదేశంలో కూర్చున్నాడు. సరళ కూడ ప్రశాంతంగా వుంటుంది గదా ఏకాం

తంలో తన ఆలోచనలతో ఒకరై వుండవచ్చునని అదే ప్రదేశాని కొచ్చింది. మోహన్ ప్రక్క దుబ్బు మాటు నుండుటచే ఎవరూ లేరని మూగగా కూర్చుంది. మోహన్‌కు ఎవరో వచ్చి కూర్చున్న వాసన తగులుటచే చకితుడై దుబ్బు సందుల్లోంచి సరళ వైపు పార జూచెను. ఆమె తన కొరకై వచ్చిందన్న వూహాలో ఆమె వద్దకొచ్చి చిరపరిచితునివలె ఆసీనుడయ్యెను. కూర్చుని 'నీ పేరేమిటి?' అని సరళ నడిగెను.

సరళ తెల్లబోయి సిగ్గు పడెను. తను తెలివి తక్కువగా చూసుకొనకుండా కూర్చొన్నందుకు తన్ను తానే మందలించుకొన్నది. చెదరిన యెదను చేపట్టుకొన లేక వెంటనే సమాధానమీయలేదు.

'నీ పేరేమిటి' అన్న ఆ ప్రశ్నలో ఎంత నిర్మలత, మార్దవంవునాయి! ఏదో మంత్రం వున్నట్లు అనిపించిందా పూబోణికి!

నిజం, మోహన్ ఆకృతిలోనున్న అందం గొంతులో కూడ వున్నది. ఆ గొంతు తనలోకి ఆకర్షిస్తున్నట్లుంటుంది.

కొంత తరికి తన 'చెదరిన యెద'ను కూడ బట్టుకొని, మృదువుగా స...ర.. ళ అని తన పేరు చెప్పింది.

మనసు కనులను హెచ్చరించింది. తిరిగి చూచుకొన్నాయి ఆ ప్రేమావృత నేత్రాలు. చిరునవ్వు నవ్వినయ్.

ప్రకృతి తన సంతోషాన్ని వెలిబుచ్చుటకేమో తన పిల్లతెమ్మెరల నా ప్రేమతో వేడెక్కిన హృదయములపై కలిపెను. అపుడే వికసితములయిన 'రే రాణి' పూగుత్తియలు, తామె యీ సందర్భంలో ముత్తయిదువులన్నట్లు కదిలాయి. తారకా, శశాంకులు తమ చల్లని కాంతితో సరళా, మోహన్‌ల నాశీర్వదించాయి. ప్రకృతే వీరి ఐక్య జీవితానికి సాక్షి.

★

సుప్రభాతం

భాషాప్రవీణ శ్రీమతి అ. రాఘవమ్మ

ప్రాగ్దిశాకాంత ఆకాశ మందిరమున
బాల సూర్యు డన్నిసుగును బడసిమిగుల
మురియు చుండెను బాలెంత ముసుగు వైచి
నీలి మేఘాల నడికట్టు నీడలోన.

నాథు జాడను గని బోలు నవ్వుచుండె
పద్మినీ కాంత పుప్పొడి పసుపు రాసి
తేటి కాటుక లెట్టుక తేనెకాను
కలుగ గొని వచ్చె స్వాగతములుగ నేమొ

రాలుచున్నవి యింకను పూల పొదల
మంచు తుంపురల్ మెల మెల్ల మధుర మగుచు
పద్మినీ కాంత పెండ్లికి పరమశోభ
సురలు గురియించు చుండెడు విరులంబోలె.

కుహుకుహూ యని కోయిలల్ కూయుచుండు
కూజితంతబుల బాజాలు కొమరు మిగిలె
ఏడు లోకాల నేలు నారేడు విశ్వ
సాక్షి మధుమూర్తి వారి పూజారి యయ్యె.

ఆప్రణవ మూర్తి దివ్య హృదంతరమున
జగతి దేదీప్యమానమై సొగసు గులికె
ఆదివ్యనాథు గాంచి ఆనంద తన్మ
యాత్ములై బయలు దేరిరి అఖిలజనులు.

★

చరిత్ర

నేటి మార్వారు

✻ మధ్వాచార్యుల శాంత ✻

మార్వార్ దేశం రాజపుత్ర స్థానంలోనిది. ఈ దేశం సుమారు 3,120, చదరపు మైళ్ల వైశాల్యంతో రాజపుటానాకు గుండెవలె ఒప్పుతోంది. ఇండియాలోని సంస్థానాలన్నిటిలోను మార్వార్ మిక్కిలి పెద్దదనవచ్చు. కాని, కాశ్మీర్, హైదరాబాద్ సంస్థానాలతో పోలిస్తే మార్వార్ కొంచెం చిన్నదే. దీని జన సంఖ్య 25,55,904. ఆదాయం సంవత్సరానికి 2 కోట్లు 50 లక్షలు ఈ దేశం యొక్క ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితులు విన ముచ్చటగా వుంటాయి.

అన్ని సంస్థానాలలో వలెనే, మార్వార్ రాజ్యాంగ విధానం కూడా ప్రధాని, ఉప ప్రధానుల మూలాన్నే జరుగుతూ వుంటుంది. జోధ్‌పూర్ మార్వార్‌కి రాజధాని. ఈ మంత్రులందరూ గొప్ప గొప్ప కాంగ్రెస్ నాయకులే. వీరందరూ ఒక్కొక్కరు, ఒక్కొక్క శాఖను తమ చేతికింద వుంచుకుని పాలించేవారు. మార్వార్ వ్యవసాయానికి పుట్టినిల్లు. వ్యవసాయ దారులందరూ పెద్ద, పెద్ద భూస్వాములు. వీరు తమ క్రింది రైతులను తేలికగా చూసి, భూములను భాగములుగా విభజించి సేద్యం చేయిస్తూవుండే వారు. రైతులనేకవిధములైన పన్నులు కట్టవలసి వచ్చేది. దీనినే ఆంగ్లమున "ఫ్యూడలిజమ్" (feudalism) అంటారు. ఈ పద్ధతి ప్రజలందరిలోను అసంతృప్తి రేకెత్తించింది. అందువలన ఈ మధ్య జయపూర్‌లో జరిగిన 55 వ కాంగ్రెస్ మహాసభ ఈ ఫ్యూడలిజమ్‌ను పూర్తిగా నిర్మూలించాలని శాసించింది ఈ శాసనమును అమలులో పెట్టడానికి ప్రస్తుత మంత్రివర్గం చాలా ప్రయత్నిస్తున్నారు

మార్వార్ దేశపు ప్రజాపరిపాలన చాలా కట్టు దిట్టంగా వుండేది. ప్రతిగ్రామ, పట్టణాలలోను పురపాలక సంఘాలు ఉండేవి. ఈ సంఘాలకి అధ్యక్షులను ఎన్నికల మూలంగా యేర్పచుకునే వారు. 1949 వ సం॥ నుంచి జిల్లా పరిపాలన కూడ ఆరంభించ బడెను. సంస్థానమంతా 6 జిల్లాలుగా విభాగింపబడింది. అందు ముఖ్యమైనవి, బార్‌మార్, జాలర్, జోధ్‌పూర్, పాలి, నాగూర్‌లు. మంత్రివర్గం ప్రజా సౌకర్యం హెచ్చించుటకు పలు పాట్లుపడేది. ఆదినుంచికూడా మార్వార్‌లో త్రాగుడు అధికంగా వుండేది. జనులు రకరకముల మత్తుకరమైన పానీయాలు, "అమల్ కాసుమ్భా" అను ఒక విధమైన మత్తు పదార్థము ఉపయోగిస్తూ వుండే వారు. ఈ త్రాగుడు అరికట్టటానికి ప్రభుత్వం అనేక నిబంధనలు అమలులో పెట్టింది.

1. దేశంలోవుండేకల్లు సారాయికొట్ల సంఖ్య తగ్గించి వేయ బడింది.

2. సారాయి అమ్మకము రోజుకి 7 గ॥ నుండి 5 గ॥లకు తగ్గించబడింది.

3. నల్లమందు యొక్క ఉపయోగము తగ్గుటకు ప్రభుత్వం దానిమీది పన్ను హెచ్చించింది.

జాతీయ పరిపాలనా విధానమెంత ధృఢముగా వున్నా, మార్వార్ తరుచుగా కరువు, కాటకాల వలన బాధపడుచుండేది. ఇందుకు కారణమేమంటే, మార్వార్ కేవలం వ్యవసాయంమీద ఆధారపడి వుండటమే. ఈ వ్యవసాయం సరిగా సాగాలంటే, వర్షాలు బాగావుండాలికదా! 1949 వ సంవత్సరంలో మార్వార్‌కు పెద్ద క్షామం వచ్చింది. మార్వార్‌లోని నాగూర్, దిడ్‌వాన్, ఫలోడి, షేర్‌గార్ మొదలగు జిల్లాలు బాగా నష్టపడ్డాయి. క్షామ నివారణ కోసం గవర్నమెంటు పలువిధములైన పాట్లుపడ్డ దనాలి మార్వార ప్రభుత్వం ఇండియా గవర్నమెంటు మూలంగా ఆహార పదార్థాలు పొందింది. కాని ఇంత కరువులో కూడా మార్వార్ గవర్నమెంటు 3 లక్షల రూ॥లు గాంధి మెమోరియల్ ఫండుకి, ఒక లక్ష రూ॥లు జయపూర్ కాంగ్రెస్‌కి ఇవ్వగలిగిందంటే, ఆ దేశపు సిరి, సంపదలెంత ఔన్నత్యంగా వున్నాయో తెలుస్తోంది. ఇంకా ప్రభుత్వం, పలు చని మిల్లువస్త్రాలమీదా, ఖాదీమీదకూడా కంట్రోలు విధి

చింది. ఈ విధంగా ప్రభుత్వం ప్రజావృద్ధికి పాటుపడుతూంటే, కొందరు దుర్మార్గులు ప్రజలలో లంచగొండితనం, బ్లాక్ మార్కెటింగ్ వ్యాపింపజేస్తూ వాళ్ళలో అసంతృప్తిని ప్రబలిస్తూవచ్చారు.

క్షామనివారణానంతరం ప్రభుత్వం వ్యవసాయాభివృద్ధికి ప్రయత్నించింది. ఆరావళి పర్వతాలకి దక్షిణాన వున్న "జావాయ్" నదిమీద ఆనకట్టు కట్టారు. దీనివలన కేవలం వర్షాలమీదే ఆధారపడకుండా ఇర్రిగేషన్ మూలంగా వ్యవసాయం సాగుతోంది. ఈ రకమైన ప్రాజక్టు రాజపుటానాలో ఇదియే మొట్ట మొదటిది. ఈ ప్రాజక్టు నిర్మించడానికి 2 కోట్ల రూ॥ ఖర్చయింది. ఈ ప్రాజక్టు సుమారు 80,000 ఎకరాల పొడినేలకు నీటివసతి కలిగించి, గోధుమ, పత్తి, పొగాకు, పంచదార, అపరదినుసులు, మొదలైనవి పండించడానికి వీలుకలుగజేసింది. కాని మార్వార్‌లోని భూస్వాములు (జాగీర్‌దార్) ఇర్రిగేషన్‌వల్ల భూసాగుబడికి యెంతమాత్రం ఒప్పుకో లేదు. భూమి చాలమటుకు వీరి చేతిలో వుండటంవలన, వీరి నరికట్టటానికి ప్రభుత్వం కొంచెం శ్రమ తీసుకోవలసి వచ్చింది. ఈ జాగీరుదారులకు నష్ట పరిహారం ఇవ్వటానికి గవర్నమెంటు "లాండ్ ఎక్విజిషన్ ఆఫీసర్‌ని" నియమించడానికి నిశ్చయించింది. కాని జాగీర్‌దారులు దానికిష్టపడక "కన్‌వార్" నాయకత్వం క్రింద గవర్నమెంటు కెదురు తిరిగి విమర్శించటం మొదలెట్టింది. ఇందుకు ప్రభుత్వం కన్‌వార్‌ని అరెస్టు చెయ్యవలసి వచ్చింది.

ప్రాచీనకాలంలో మార్వార్ దేశంలో విద్య క్షీణదశలో వుండేది. కాని రాను రాను ప్రభుత్వం పరిపాలనలో విద్యాభివృద్ధే ముఖ్యమని యెంచింది. దేశంలో 6 సం॥ మొదలు 11 సం॥ బిడ్డలకు విద్య బహు శ్రద్ధతో చెప్పించి వారికి పునాది దిట్టపడేలాగు చూడాలని శాసించింది. వయోజన విద్యకూడ వున్నతస్థితిలోకి వచ్చింది ప్రభుత్వం సం॥రానికి 12లక్షల రూ॥పైన విద్యాభివృద్ధికి హెచ్చించింది. ప్రయిమరీ, బేసిక్, మిడిల్, హైస్కూల్, కాలేజి విద్యలు బాగా వృద్ధయ్యాయి. బాలురకు సైనికశిక్షణ తప్పని సరిగా యేర్పరచింది. పూర్వపు విద్యా విధానంతో పోలిస్తే, ఈ నాటి విద్య యెన్నోరెట్లు అభివృద్ధి చెందింది.

మార్వార్‌లోని జోధ్‌పూర్‌లోను, ఇతర జిల్లాలలోను ఆరోగ్యాభివృద్ధికి ప్రభుత్వం ఆస్పత్రుల మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. మామూలు ఆంగ్ల వైద్యమే కాకుండా, ఆయుర్వేదంకూడా పెంపొందింది. ప్రజలందరూ బలమైన ఆహారం తీసుకుని, క్రమమైన ఆరోగ్య సూత్రా లవలంబించేలా ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంది. అన్ని వూళ్ళలోను శిశు సంరక్షణాలయాలు నెలకొల్పింది దేశంలో ఐస్ అమ్మకం కూడదని ఆజ్ఞాపించి, దాని మూలంగా బిడ్డలకుకలిగే టైఫాయిడ్, టాన్‌సిల్స్ మొదలగు జాడ్యాలనుంచి ప్రజల్ని రక్షించింది. 1949 సం॥ మేనెలలో సంస్థానంలో న్యూట్రిషన్ కమిటీ స్థాపించబడింది.

మార్వార్ అన్నివిధాలా వృద్ధిచెందడానికి దాని ప్రభుత్వమే కారణ మనవచ్చు. ప్రభుత్వం రోడ్డు రహదారిని పెంపొందించటానికి చాలా ప్రయత్నించింది. ప్రధానమంత్రి జయ్‌నారాయణ్‌వ్యాసే కమ్యూనికేషన్స్‌కి ప్రెసిడెంటుగా వుంటూ వచ్చారు. జోధ్ పూర్‌లో రేడియో బ్రాడ్ కాస్టింగ్ స్టేషన్ ఈ మధ్యనే కట్టారు. బొగ్గు గనులను కూడా కనిపెట్టడానికి యేర్పాటులు జరుగుతున్నాయి.

ఇండియా, పాకిస్థానుల విభాగానంతరం ఇండియాలో కాందిశీకుల సంఖ్య యెక్కువైంది గదా. మార్వార్ పాకిస్థానుకి సమీపంగా వుండటంవలన కాందిశీకుల ఒత్తిడి మరి యెక్కువైంది. ప్రస్తుతం మార్వార్‌లో 46,16,102 కాందిశీకులున్నారు. మంత్రివర్గం వీరికోసం 12 లక్షల రూ॥ ఖర్చుపెట్ట దలచింది ఈ కాందిశీకులకు ఇండ్లు, పాఠశాలలు, వ్యవసాయ, వాణిజ్యాభివృద్ధి మొదలగునవి ప్రభుత్వం, రెఫ్యూజీ ఎడ్‌వైజర్ కమిటీ సహాయంతో సాధించింది.

ఇండియా పాకిస్థానులు విభజింపబడిన తరువాత జోధ్‌పూర్‌లోని సింధు రైల్వేశాఖ పాకిస్థాను చేతిలో పడ్డది. కాని ప్రజా సౌకర్యం కోసం, రాజపుటానా, పాకిస్థాన్ ప్రభుత్వాలు రెండూ 1949 జూలై నెలలో ఒక ఒడంబడిక యేర్పరచుకున్నారు. దీని ప్రకారం జోధ్‌పూర్, సింధుల మధ్య ట్రెయిన్ సర్వీస్ సక్రమంగా జరుగుతూవున్నది

నేటి మార్వారు

పైన వివరించిన విషయాలన్నిటివలన మార్వార్ సాంఘికంగానూ, రాజకీయంగానూ మార్పుచెంది చాల వృద్ధిలో వున్నట్లు తెలుసుకోవచ్చును. దీనికి కారణం గవర్నమెంటు ప్రజల ఉన్నతికోసం పాటుపడటమే. పూర్వం మార్వార్ విద్యలోను, రాజ్యాంగంలోనుకూడ బాగా వెనుకబడివుండేది. కాని 1947, 48, 49 సం॥లలో కాంగ్రెస్ మంత్రివర్గం దేశాన్ని చాలా కూర్పుచేసింది. ప్రభుత్వం మొట్ట మొదట ఫ్యూడలిజమ్ అంతమొందించి రైతుల ఆర్థికస్థితి అభివృద్ధి చేసింది. వాణిజ్యందేశంలో అగ్రస్థానం వహించేలా చూసింది. ప్రజారోగ్యం, విద్యాకూడా వ్యాప్తిచెందాయి. ఈ విధంగా స్వతంత్ర మార్వార్ హిందూ దేశ చరిత్రలో ముఖ్యమైన పాత్ర తీసుకుని, ఇండియా భవిష్యత్ అభివృద్ధికి తప్పక పాటు పడుతుందని పండిట్ నెహ్రూ ప్రభృతు లాశిస్తున్నారు.

★

కర్ణాటకసంగీతము

సంగీత విద్వాన్, శ్రీ మంత్రాల గోపాలకృష్ణమూర్తిగారు.

[యీ వ్యాసమునకు కూడా, కర్ణాటక సంగీతమునకు సహాయపడిన రచనలు తెల్పుటయే ముఖ్యకారణం—]

కర్ణాటక సంగీతమునకు అభివృద్ధితేగల రచనలలో శ్రీ ముద్దుస్వామి దీక్షితులు వారివి, శ్యామశాస్త్రిలుగారివి. వీరు యిద్దరు అఖండ వుపాసనపరులు. ముద్దుస్వామి దీక్షితులు వారు వెంకటమఖి సాంప్రదాయము ననుసరించినవారు. శ్యామశాస్త్రిలుగారన్నో రామామాత్యుని సాంప్రదాయము ననుసరించిన వారై వున్నారు. ఎవరు ఏ విధమును అనుసరించిన వారైనను యింతవరకు గాయకులందరు వీరిద్దరి రచనలను గానము చేయుచున్నారు. ముద్దుస్వామి దీక్షితులవారు సుబ్రహ్మణ్య ఉపాసనగల వారగుటచే గురుగుహ ముద్రతో సంస్కృత భాషలో అనేక రాగములలో కందల కొలది కీర్తనలను చెప్పియున్నారు ఆ కీర్తనలను వ్రాయుటలో అనేక దేవతల మీద స్తుతిరూపముగా వ్రాసియున్నారు. వారి రచన కదళీపాకములో వ్రాసినట్లు కనపడుచున్నది. మరిన్నీ వారు పూర్ణదీక్షాపరులని కూడా తెలియుచున్నది. వారు, నవావరణ కీర్తనలు, నవగ్రహకీర్తనలు, పంచలింగముల కీర్తనలు, గణపతిస్వామి వారిమీద అనేక కీర్తనలు శ్రీ మేడా దక్షిణామూర్తి స్వామివారిమీద, బాలా త్రిపుర సుందరీ అమ్మవారిమీద అనేక కీర్తనలు చెప్పి యున్నారు. వీరు ఉత్తరదేశములో చాలాకాలము వుండుటవల్ల ఆ దేశ సాంప్రదాయము కొంతవున్నట్టు గోచరించుచున్నది. ఏది ఎట్లున్నను గాయకులైనవారు వీరి రచనలు పారముచేసియే తీరవలెను. వీరు విర్యాపుర సంస్థాన విద్వాంసులై యుంటూ భగవచ్చింతనతో కాలము గడిపి జీవన్ముక్తిని పొందిన మహనీయులు! తరువాత శ్యామశాస్త్రిలవారు రచనలనుగూర్చి విచారిద్దాము-కంచికామాక్షి అమ్మవారిమీద సుమారు రెండు, లేక మూడువందల కీర్తనలు మాత్రం తెలుగు భాషలో నారికేళపాకముగా వ్రాసియున్నారు.

శ్రీ సుబ్రమణ్యస్వామివారి అనుగ్రహము పొందిన వారు, శ్యామశాస్త్రిలవారి కీర్తనలలో, లయకు కొంత ఎక్కువ ప్రాధాన్యత యిచ్చినట్టు కనపడుచున్నది. వీరివి యిప్పటికి 30, లేక 40 కీర్తనలు మాత్రం అమలులో వున్నవి. వీరి కీర్తనలు ఎక్కువ మిశ్రచాపులో వ్రాసియున్నారు. కర్ణాటక సంగీత అభ్యాసం చేయువారందరు వీరి రచనలుగల కీర్తనలు పారంచేసి గానం చేసినట్లయితే లయలో మంచి బింకము, లయనిలకడ, కర్ణాటక సంగీతముయొక్క రాగభావము మొదలైనవి వచ్చును. శ్యామశాస్త్రిలవారు కామాక్షి అమ్మవారి అనుగ్రహం పొందిన మహనీయులు. కర్ణాటక సంగీతమునకు చేసినసేవ అపారము. యింతవరకు తేలిన విషయమేమిటి అంటే, కర్ణాటక సంగీతమునకు, 200 సంవత్సరములకు యిటీవల సేవచేసిన వారలలో త్యాగరాజు, క్షేత్రయ్య, దీక్షితులవారు, శ్యామశాస్త్రి వీరి రచనలు చాలా వుపకరించినవని తేలుచున్నది.

★

"అబద్ధాలాడితే ఆడపిల్లలు పుడతారనకపోతే"........?

* ఆడబాల వీరాస్వామిరాజా *

[సర్వ సాధారణంగా వాడుకలో వుండే లోకోక్తులు నోటి చివర నాలుకపై బొట్టు మోపులుగా వుంటాయి. సమయా సమయాలను చూచి ప్రయోగింప బడుటకు పొంచి చూస్తాయి. వీలున్నకొద్దీ ఆ లోకోక్తులు ఉపయోగించినా అంతగా అంతరార్థము తెలియకపోవచ్చు. అందులోను మిడి మిడి జ్ఞానముగల అల్పవయస్కులు వాటిని ప్రయోగించెనా వాటిలో అర్థమును విడమర్చి చెప్పడం దుర్లభం, దుస్సహము] —రచయిత.

అవి నా చిన్నతనపు రోజులు. నేనంటే మా అన్నకు మహాగారామే! అయినా నేను ఏడిస్తే చూచి నవ్వడానికి వెళాకోళము మాటలు తరచు విసరుతుండే వాడు. వాడనే మాటలకు నేను ఉడుక్కునే వాడినికాదు కాని అబద్ధాలాడకురా ఆడపిల్లలు పుడతారంటుండే వాడ్ని. వాడికి ముందు మొగపిల్లవాడే పుట్టేడనుకోండి! అబద్ధమనే తప్పుకి పర్యవసానం ఆడపిల్ల పుడుతుందనకపోతే మొగపిల్లవాడు పుడతాడనకూడదూ అనే వివక్షతా తర్కజ్ఞానము అప్పుడు కలగకుండా పోయేది.

రోజులు, నెలలు, సంవత్సరాలు శరవేగంగా నడిచి పోతున్నాయి విజ్ఞానబీజమునకు తర్కమనే నీటిని పోసే కొలది సమస్యల లోతుపాతు జూజాయిగా తెలుస్తూ వచ్చాయి. అనుభవజ్ఞులకు నావంటి వారికన్న అంతరార్థము మరింత తెలియక పోదు! అయినా సాహసించి వ్రాసిన వ్యాసమిది.

పవిత్ర హిందూ దేశములో రాను రాను దారిద్ర్యము, దుర్బలత్వం ప్రబలింది. దీనికి ముఖ్య కారణం ముమ్మాటికి మతమనే చెప్పాలి! మతమనే పేరు చెప్పితే స్వార్థం తనం తటతాను ఉప్పెనవలె పొంగుతూ వస్తుంది. ఆ కెరటాలలో మూఢ,నమ్మకాలనే గులకరాళ్ళు ఒడ్డుకు కొట్టుకు వస్తాయి. అవి ప్రజలనే యిసుక రేణువుల మధ్య నిలచి పోతాయి. సుస్థిరంగా వుండిపోవాలని కాంక్షిస్తాయి సల సల ఎండ వేడిమికి కాలే యిసుకపై అడుగు తీసుకొంటూ వేసుకొంటూ నడచి కాలుతున్న గులకరాళ్ళను ఏరడమంటే ఎంత దుర్భరమో మనలో పాతుకుపోయిన ఈ మూఢ నమ్మకాలను వ్రేళ్ళతో త్రెంపి పారవేయడం అంత కష్టతమము.

అటువంటి మూఢ నమ్మకాలతో నలిగి పోతూ అభివృద్ధి మార్గము అనుపాలు తెలియని మనదేశ సంఘంలో స్త్రీకి సర్వ విధాలా తావులేకుండా పోయింది. నేటి కలుషితసంఘంలో స్త్రీ ఒకవంటలక్క. కామయంత్రం పురుషుని అడుగులకు మడుగులెత్తుచు వెట్టి చాకిరికి నియమింపబడిన బానిస క్రింద బానిస. నాలుగు గోడలమధ్య సూర్యుడు చొరరాని చీకటి గదిలో ఒకఖైదీ ఆమెకు స్వాతంత్రియము సున్నా. యింతేకాదు పురుషుడు సంఘానికి పెద్దయై ఏకచక్రాధిపత్యము వహించుతూ ప్రకృతి సౌందర్యాన్నైనా ఆడది అనుభవింపకుండా త్రుంచి వేసేడు. ఈ మొగవాడు స్త్రీపై హృదయములేని నిరంకుశాధికారియై కూర్చున్నాడు. ఆమెకు బాల్య వివాహంచేసి సౌఖ్యము చేకూరకుండా చేస్తోంది పెత్తందారైన పురుషుడే. బాల వితంతువునైనా మరల వివాహము చేసుకోవీలులేదని, ఆమె జీవితాంతమువరకు ఎండిన కట్టెవలె నిర్జీవమై మ్రగ్గి పోవలసిందేనన్న శాసనముచేసినదీ పురుషుడే. ఆ అమాయిక నోరు నొక్కి మూడునాళ్ళ ముచ్చట కొరకు మురిచే ముదుసలికైనా మెడలువొంచి ముడి వేయించేది ఈతడే. ఈ ఘోర అన్యాయాలను అరికట్టగల దాతలు అవుపించకుండా వున్నారు!

ఒక కుటుంబములో దంపతు లిరువురు పుత్ర సంతానము కోరకే తాపత్రయ పడతారు ఒకవేళ పుత్రిక కలిగినట్టయితే పెద్దభారము నెత్తిపై పడిందని పరితపిస్తారు. దీనికి కారణం? మూఢనమ్మకాలతో మ్రగ్గి పోతున్న సంఘము!

పుత్రికకు ఈడొచ్చు వరకు తల్లి యింట్లో అడ్డమైన వెట్టి చాకిరి చేయించుకుంటూ పెంచుతుంది యింటి భారము హెచ్చైనా ఆడపిల్ల నోరు నొక్కుకుని, కిక్కు మనకుండా మోయవలసిందే? అదే పుత్రునికి సంభవిస్తే నా ఆస్తి నాకు పంచి యిచ్చివెయ్యండి, నేను వేరుపడి పోతానని యింట్లో

దళాయిస్తాడు. నోరుపెట్టి తన యిష్టమొచ్చినట్లు మాటలు చెలగాయిస్తాడు. అమ్మాయికి మట్టుకు ఆ హక్కులేదు.

వయస్సు వచ్చిన వనిత వీధి గుమ్మము త్రొక్కడానికి నోచుకోకుండా పోతుంది పరాయి పురుగు కంటపడకుండా వంటిట్లో పడివుండవలసి వస్తుంది. రవీంద్రుడన్నట్టు 13, 14, 15 సంవత్సరాల బాలునికి స్వగృహమే స్వర్గమైతే అపుడు బాలికకు స్వగృహము నరకమవుతుంది.

యీడువచ్చిన స్త్రీని యింట్లోవుంచి ఒక యింటి దానిని చేయడానికి కొద్ది నిర్లక్ష్య భావంతో ఆలస్యం చేస్తే ప్రజల నుంచి దెప్పిపొడుపులు, గగ్గోలు బయలుదేరుతుంది. అంచేత తండ్రి ఈ గుదిబండను దింపుకోడానికి విశ్వ ప్రయత్నాలు చేయడం ప్రారంభిస్తాడు. స్త్రీ వివాహ విషయము నేటి సంఘంలో మహాదుర్భరమైన సమస్యైవుంది? కనుక అతని పాట్లు కుక్కలుకూడా పడవనే నమ్మిక!

అమ్మాయి తెలివైనదే. కొద్దోగొప్పో అక్షరజ్ఞానం కూడా వుంది ఆమెకు. అయితేం? తండ్రికి హెచ్చు కట్నాలిచ్చే స్తోమతలేదు. అమ్మాయికి తగ్గవరుడు కావాలంటే 116 తో కూడి వేల సంఖ్యతో నిండిన కట్నాలిచ్చి కొనుక్కోవాలి. తక్కువ స్థితిలో పోవాలంటే అమ్మాయి సంసారాని కన్నీ అవకతవకలు వచ్చి ఆవరించు కొంటాయి. అయితే మట్టుకు ఏం చేస్తాడు? పెద్ద మనిషై పెళ్ళీడుకొచ్చిన పిల్లకు వివాహము చేయకుండా వుంటే ప్రజలు కాకుల్లా పొడుచుకు చంపుతారు. యిన్ని చిక్కు సమస్యలలో యిరుక్కున్న తండ్రికి ఏమీపాలు పోకుండా పోతుంది. ఆఖరకు ఏలాగో భారమువదలి గొట్టుకోవడమే కాదాయని మనస్సును కుదుట పర్చుకొని ఏ రెండవ పెళ్ళివాడికో వివాహము నిశ్చయిస్తాడు. లేకపోతే ఏ విద్యాశూన్యుడో చవకగా రావడంవల్ల పెళ్ళి ఏర్పాట్లు చేసుకొంటాడు. వాళ్ళు మాత్రం వొట్టినే పోతారా? ఆడబడుచు లాంఛనాలు, వెండిచెంబు, వెండి పళ్ళెం, 116లతో కూడ యివ్వగలరనే వాగ్దానమును పెళ్ళి కూతురు తండ్రి దగ్గర తీసుకొని పసుపు కుంకాలు పుచ్చు కొంటారు ఎరువు నగలుతెచ్చి అమ్మాయికి సొంతంగా యిచ్చేస్తున్నట్టు పళ్ళెంలో పెట్టి వరుని తరుపువారు. తిప్పలన్నీ ఆడపెళ్ళివారు పడవలసిందే! మొగపిల్లలుకల వాళ్ళు ఖరారుగా మొండిఘటాలై మా అబ్బాయి కావలసిన వాళ్ళే కాళ్ళదగ్గరకు వస్తారని బిర్రబిగిసి కూర్చుంటారు. వివాహము పైపెచ్చు పెళ్ళి కూతురింటివద్ద జరగాల్సిందనే మామూలొకటి ఉన్నదిగదా

పెళ్ళి రేపనగా బంధువుల్ని, స్నేహితుల్ని దారే పోయేవార్ని ప్రోగుచేసికొని పెండ్లికొడుకు వాళ్ళు గజనీమహమ్మదులా పెండ్లి కూతురింటిపై దండ యాత్రకు వస్తారు. పెళ్ళి రెండు రోజులు వీరందరికి మర్యాదలు జరుపు సరికి వధువు తండ్రికి తల ప్రాణం తోక్కి వస్తుంది. మర్యాదలలో ఏ మాత్రం లోటు పాటు వచ్చినా పెండ్లి కుమారుని తండ్రి పెళ్ళిజరగకుండా లేచిపోతామని బెదిరిస్తాడు. వియ్యంకుడు, పెళ్ళిపెద్దలు మూడవ నేత్రము విప్పివుంచిన ఆ శివుడ్ని బ్రతిమాలి, మూడవకన్ను మూయించే సరికి ప్రాణం సొలివస్తుంది బ్రతిమాలే కొలది బిగియడమువల్ల. కట్నం అంతా రొఖ్ఖంగా యివ్వక కొంత వెనక వేస్తున్నా యిహ పెళ్ళికూతురు అక్కరలేని వాడిలాగ పెళ్ళికొడుకు పెళ్ళి పీటలుమీంచి అమాంతంగా లేచి పోబోతాడు. సరే ఎలాగో ఆ విఘ్నేశ్వరుని బొజ్జనవరించి మంగళసూత్రధారణం చేయిస్తారు. పెళ్ళి పేరు చెప్పి పైవారు కాక పురోహితులు, బట్రాజులు, భాజాభజంత్రీలు, మేళతాళాలు వధువు తండ్రినుంచి నిలబెట్టి అప్పు తెచ్చిందంతా దుల్లగొట్టిస్తారు.

రసాభాసంతో వివాహమైపోతుంది. పెండ్లికొమారుడు అత్తవారింటికి ఒంటరిగా వెళ్ళి ఎవరో తంతారన్నట్టుగా ఒక తోడగుడ్డని వెనక వేసుకొని మనుగుడుపులు పెళ్ళి యిరువురు యిష్టమొచ్చినంతకాలం తిష్టవేసి మిగిలినదేమైనా వుంటే ఊడ్చేస్తారు.

పిల్ల కాపరానికి వెళ్ళిపోయిందని చేతులు దులుపుకోడానికి వీలులేదు. పండుగలు, పబ్బాలు వచ్చినప్పుడల్లా అల్లుని కూతురిని తీసుకువస్తూ వుండాలి. పైపెచ్చు పండుగకిరమ్మని అల్లుడికి కబురుపెడితే చాలదు. ఛార్జీలన్నీ భరిస్తూ స్వయంగా మామగారో, బావమరిదో లేక వారిదగ్గర బంధువో వెళ్ళి

అబద్ధాలాడితే ఆడపిల్లలు పుడతారనకపోతే

తీసుకు తెచ్చుకోవాలి అక్కడ పండగన్నాళ్ళు పరిశుభ్రముగా పంచభక్ష పరమాన్నాలతో, పిండి వంటలతో భోజనాలు చేస్తూ కాలం వెళ్ళబుచ్చుతారు, ఆ నూతన దంపతులు అంతటితో గణపతికిమటుకు సంతృప్తికాదు పండుగ కానుకగా ర్యాలిసైకిలో, వెస్టెండ్ వాచీయో అల్లుడిగారికి మామగారు సమర్పించుకోవాలి ఇహ ఋల్లకదులు తున్నారనే సరికి యిరువురికీ కూడా విలువైన బట్టలుపెట్టి సాగనంపాలి


అమ్మాయి గర్భిణిధ్యాలుస్తుంది పురుడుకని సంసారము ఎత్తుపెట్టుకొచ్చి అల్లుడు అత్తవారింటిపై పడతాడు అక్కడ ఆ నిండు చూలాలికి కావలసిన మందులకి, మాకులకి అమ్మాయి తండ్రే చెల్లిస్తూ వుంటాడు పురుడయ్యే లోపల పరామర్శకని వచ్చేపోయే బంధువులు యెప్పుడు చూసినా యింట్లో సిటీబస్సులోలా నిండివుంటారు

ఒకవేళ వెధవ ఆడబడుచు వుందంటే జీవితాంతము వరకు భారము నెత్తిని వుండి పోతుంది నిర్భాగ్యుడైన తండ్రికి

మన అర్థములేని సంఘ సంస్కరణలో ఆడ పిల్లలు కల తండ్రి వారి జీవితాంతము వరకు ఒకటే యాతన పడవలసి వుంటుంది కనుక 'అసత్యమాడితే ఆడ పిల్లలు పుడతారని' బెదిరింపుగా ఈ లోకోక్తి వాడుకలోనికి వచ్చి వుంటుంది యిది మనదేశ సరిహద్దులు దాటి పోయివుండదు ?

ఈ లోకోక్తిని, రూపుమాపాలంటే అసలు స్త్రీ సుఖించాలంటే, స్త్రీ ఏనాడైతే చిన్నతనమున తల్లిదండ్రులపై ఆర్థికముగా పూర్తిగా ఆధారపడే నవుసరములేదో, వివాహము జరిగిన తదనంతరము భర్తమీదే ఆశపెట్టుకుని వసించవలసిన నవుసరము వుండదో, వార్థక్యములో సంతానముపై భారముగా నుండదో, ఆ నాడే స్త్రీ సుఖించ గలుగుతుంది ఆ నాడే సంఘం, ఆఖరకు ఆనంద డోలికలలో ఊగిసలాడుతూ ఆ దర్శదేశంగా అలరారుతుంది

★



బ్లెయిర్ హౌస్ బాల్కనీనుండి పండిట్జీ అక్కడ చేరిన ప్రజా సమూహాన్ని తిలకిస్తున్నారు

వైతాళికులు

రచన "ఉషాదేవి"

ఆనాడు

ఆంధ్ర సాహితీవనము గారకంపలతోనూ ముండ్ల కంచెలతోడనూ నిండి నిబిడీకృతమై సంకట కంటక శిలా భూయిష్టమై దారి తెన్నులులేక ఉన్న దురవస్థలో, విషమ పరిస్థితులలో, సందిగ్ధ సమయములో, తప్పగోల గడ్డపారి ఋజానవిడుకొని నాగలిచేతబట్టి, తుక్కు దుమారములను తూర్పారబట్టి, చెత్తచెదారములను చేటలకెత్తివైచి, చక్కగా దున్ని సుక్షేత్రఖండముగా జేసి నూత్న రీతుల నవ్య విధానాల వినూత్నపథ నిర్మాణ మొనరించి, ఖులాస విలాస విహారోపవనంగా నిర్మించిన వనమాలి ఆదికవి శ్రీ నన్నయ భట్టారకునికి కైమోడ్పులు—

ఆనాడు

అంధకారబంధురమై కారుమబ్బులలము కొనియున్న ఆంధ్ర సారస్వత విహాయసాన రంగురంగుల రంగవల్లుల నలరించి ప్రాభాత సాంధ్యారుణ స్వర్ణిభ ప్రబలవెలయించి ఆశాస్యమ్ములుదీర్చి కైరిక వస్త్రధారియై 'ఉషశ్రీ'ల వెలువరించిన శ్రీ తిక్కన, ఎఱ్ఱన్నలకు నమస్సులు—

మహాభారతేతిహాసరచనా ప్రసిద్ధసాహితీ ఐతిహాసికులైన కవిత్రయ 'వనమాలు'లచే వినిర్మితమైన దివ్యనందన వనసీమలలో గుమాయింపుల సంపంగులు, గుబాళింపుల గులాబీలు అంటుద్రొక్కి, బోదిచేసిన ఆంధ్ర భాగవత మహా కవీంద్రుడు శ్రీ పోతనామాత్యునకు ప్రాంజలులు—

మందమందమరంద మధురమాధురీ సుగంధ సురభీ పవనాంకురాలను అనవరతము తెలుగు జనతపై విరజిమ్మే పురాణ ఇతిహాస మహాకావ్య వృక్ష శాఖోపశాఖలపై సుందర సౌరభ్య మకరంద సమ్మిళిత కిసలయ ప్రసూనములతో విరాజిల్లే ప్రబంధలతికలను ప్రాకించిన శ్రీ అల్లసానికి మనోల్లాస ప్రణతులు—

ఈనాడు—

నవనవ పరిమళాల్ ప్రవహించే కల్పకవృక్షలతా ప్రసూన విరాజిత పరివేష్టితమైన ఆంధ్ర సారస్వతోపవనాంతరాలలో శతావధాన నికుంజపుంజములు మంజుమంజులములుగా విడిది చేయించిన-స్వతంత్ర నవభారతావనీ ఆంధ్రాస్థాన కవీంద్రులు-కింకవీంద్ర ఘటా పంచానన బాలసరస్వతులు శ్రీ తిరుపతి వేంకటకవులకు కరాంజలులు—

పౌరాణిక ఐతిహాసిక కావ్యప్రబంధ సమ్యక్ సమ్మిళిత సాహితీ మహానందనవనంలోని మరంద నిష్యందమాధురీ ఝురులను సామాన్య జనతకు, శ్రామిక జగతికి ప్రసారం చేయటానికి దీక్షా కంకణబద్ధులై, అక్షీణ కృషిస్థలిపి సజీవ భాషావాహినిని, జనతా సాహితిని సక్రమపథాల నడిపించి కవిని-దుర్భర దుస్సహ దురంత పీడిత తాడితశ్రామిక జనతకు - సన్నిహితుణ్ణిచేసిన విప్లవకారులు శ్రీ గిడుగు "పిడుగు"కు గురజాడకు నమశ్శిర్షములు—

పరుగుపరుగున జోరుజోరుగా ప్రగతీపథాన పురోగమించే ప్రజాస్వామికయుగాన,—చక్రవర్తుల సాన్నిధ్యంలో అందలాలెక్కిన పద్య సాహిత్యానికి భరతవాక్యం పాడుతూ 'వచనరచన'కు నాందీ ప్రస్తావనలుచేసిన సంస్కారిక ధౌరేయులు శ్రీ కందుకూరి, శ్రీ చిలకమర్తి వారలకు సాష్టాంగములు—

క్రొత్తకి భయపడుతూ పాతలోని కీడును విదలలేక సత మతమయ్యే ఆంధ్ర జాతికి వినూత్న వంద్య రచనను అపూర్వ ప్రయత్నాలతో వినిర్మించిన మా ఆంధ్ర 'సాక్షి' 'శ్రీ పానుగంటి'కి జోహార్లు.

పురాతనాన్ని విస్మరించి అధునాతనాన్ని పరిగ్రహించ లేని స్థితిగతులలో "చావలేదు, ఆంధ్రుల మహోజ్జ్వల చరిత్ర" అని ఎలుగెత్తిచాటిన ఆ ఆచార్య రాయ ప్రోలుకు హస్తాంజలులు—

మానవ మనోవైజ్ఞానిక సమగ్ర పరిశోధనా పటిమతో నూతన విధానాలలో వినూత్న రీతులలో క్రొంగ్రొత్త దారులలో నవలా సారసత్వాని 'కదం' త్రొక్కించిన 'కవి సమ్రాట్'కు సమస్సులు—

వైతాళికులు

కవిత్వాన్ని కళామయం, కళను కవిత్వ మయం చేసి, రెంటికీ అవినాభావ సంబంధాన్ని ఆత్మీయ సంధానాన్నీ కూర్చి పేర్చిన కళాతపస్వి, కులపతి శ్రీ అడివికి నమో వాకములు—

సజీవభాషతో జనతా సాహిత్యంతో అపూర్వ భావాలతో తెలుగువాణికి పసిడి మెఱుగులు కరిగిపోసి, వాణి వాకిట రంగవల్లులు దిద్దితీర్చిన ఖండకావ్య కవితావిహారులు, రసోపాసకులు శ్రీ కరుణశ్రీ, జాషువా ప్రభృతులకు సౌహార్ధిక శుభాభివాదములు—

గేయ కవితా సోదర సోదరీతిలకములకు సౌహార్ధిక శుభాకాంక్షా సమ్మిళిత కరస్పర్శలు—

[సూచన —ఆశతో, అభిలాషతో, అభిమానంతో, ఆవేశంతో, ఆవేదన పడుతూన్న నాకు కన్నులు తెరచి మన్ను మిన్నుల తెన్నులు జూపిన గురుదేవులు పూజ్యశ్రీ వెంపరాల సూర్య నారాయణ శాస్త్రిగారిని, శ్రీ నందూరి రామకృష్ణమాచార్యుల వారి, ఆశీస్సుల నర్థిస్తూ మస్తకన్యస్త హస్తుడ—]

— నమస్తే —

★

నేటి భారతస్త్రీ కర్తవ్యము

సంఘంలో ఇప్పుడిప్పుడు స్త్రీకూడా ఒక వ్యక్తివలె పరిగణింప బడుచున్నది. పురాణ భారతస్త్రీ ఎంతవున్న తదశలో తన జీవిత కుసుమాన్ని వాడనీయకుండా, తన పరిమళంవల్ల కుటుంబాన్ని, లోకాన్ని ఆనందింపచేసి, అపూర్వానందభూతిని పొందిందో, యీనాడు సంఘంలో అంత దురపిల్లుచున్నది. ఆమెకూడా ఒక వ్యక్తిత్వం అంటూ వున్నదే! అజ్ఞానంవల్లను, పెద్దల స్వార్ధ పరత్వం వల్లనూ ఒక యంత్రంగా మారిపోయింది కాని ఒక్కసారిగా జపాను, జర్మనీ మొదలైన దేశాలవలె విజృంభించి, నీతిని కోల్పోయి కొంతవరకు పనికిరాని ఆవేశాన్ని స్త్రీ జాతి పొందిందనడంలో పొరపాటు లేదు ఈ అనర్థాలకు మూలకారణం చాలా వరకు పురుషుడు తన స్వార్థతకొరకు ముందులో ఏండ్ల తరబడి స్త్రీని అణచి వివేకశూన్యనుగా చేసీడు ఓర్పుగల భారతస్త్రీ భరించింది. చివరకు విసిగి ఒక్కసారిగా వుద్రిక్తురాలయింది. ఆ వుద్రేకంలో వివేక శూన్యయై కర్తవ్య శూన్యయై, ప్రవర్తించుటవల్ల, స్టేజిమీద అనవసరపు వుపన్యాసాలు, భర్తృ తిరస్కారాలు, విపరీత సమస్యలు పాశ్చాత్యదేశపు దురలవాట్లు, మొదలైన అనర్థకాలు సంభవించినై [సోదరీమణులు క్షమింతురుగాక]

కాని ఆమె ఆదర్శం న్యాయమయింది. న్యాయమైన హక్కుకొరకు చేయవల్సిన క్రియ సక్రమంగా నెరవేర్పలేక పోయింది దానికెంతో సూక్ష్మజ్ఞానం అవసరం ఆదర్శం ఎంత వున్నతమైన దయినా, దానిని సాధించేమార్గాలు తెలియకే అనేక సంస్థలు, అనేక వుత్కృష్ట సిద్ధాంతాలు నశించినవి. నేడు స్త్రీ తన న్యాయమైన హక్కుకొరకు స్వేచ్ఛా జీవితం కొరకు, ఏనాడో మూలనుండిపోయి జ్ఞానరశ్మితగలకుండా మురిగిపోయిన దానినుండి విముక్తికొరకు చేయవల్సిన సాధనానికి ఎంతో సూక్ష్మజ్ఞానం కావాలి అందువల్ల మహిళాలోకమంతా తగిన జ్ఞానం సంపాదించి, గృహ, సంఘజీవితాలలో, ఆనందమయంగా గడుపుటకు సరియైన మార్గం అనుసరించాలి. ఎంతసేపు హక్కులని, పురుషునితో సమాన పదవులని కోరుతూ, ఆవేశం చెంది నందువల్ల లాభంలేదు నా దేశం, నా విధి, నా సంఘం అని తలచి, వాటియొక్క భావి అభ్యుదయాన్ని ఆశించి, దానికి తగ్గ కృషిచేస్తేనే, తమతమ అధికార భాగ్యాల్నందుకొరకు వినియోగిస్తేనే దేశం బాగుపడుతుంది

—ఝాన్సీ లక్ష్మి

★

చిత్ర సమీక్ష

భరణీవారి "లైలామజ్ను"

※ జి ప్రభ ※

49, వ సంవత్సరములో ఇంతవరకు విడుదలైన చిత్రాలలో చెప్పుకోదగ్గ చిత్రము భరణీవారి "లైలా మజ్ను". "లైలా మజ్ను" అరబ్బీ దేశానికి సంబంధించిన ప్రేమ గాథ. నిజామి కవిచే రచించబడ్డ విషాదాంతకథ.

ఇరువురు ప్రేమికులు లైలా, ఖైస్ చిన్న నాటనుండి స్నేహంగా జీవిస్తూ, ఒక్క బడిలో చదువుకుంటూ తమ స్నేహాలతను పెంపొందించు కుంటారు. పిదప ఆ స్నేహం ప్రేమగామారుతుంది, ఆ ప్రేమను సార్థకం చేసుకోవడానికి ప్రయత్నించి, వారు విఫల మనోరథులై, చివరికి ఈ ప్రపంచంలో తమ ప్రేమకు స్థిరమైన స్థానము సంపాదించుకోలేక, స్వర్గ సీమకు ప్రయాణమైరి. ఆ ప్రేమికుల మహత్తర ప్రేమ గాథ కథలో ముఖ్యమైన విషయం

హిందీలో "లైలా మజ్ను"ను, నజీర్ దర్శకత్వము క్రింద తయారైన చిత్రాన్ని అనుసరించి దీనిని తీశారు. హిందీ చిత్రంలో ముఖ్యంగా చెప్పుకో దగ్గ విషయం, పాత్రలు, సెట్టింగులు, సంగీతము. వారు ఎంతో నేర్పుతో చక్కగా చిత్రాన్ని తీశారు చిత్రంయొక్క ఘనత, పాత్రల నటనా చాతుర్యత, దర్శకుని గొప్ప "లైలా మజ్ను"ల జీవిత సమాప్తిలో హిందీ చిత్రంలో అత్యద్భుతంగా వుంది.

భరణీవారి 'లైలా మజ్ను'ను విమర్శనా దృష్టితో చూస్తే తన పాత్రను అర్థంచేసుకొని ఇంత వరకు నటించిన చిత్రాల్లో కంటే మజ్నుగా నటించిన నాగేశ్వర రావు చక్కగా నటించాడు భానుమతి నటనలో చెప్పుకో తగ్గ ప్రత్యేకతలేదు సి యస్ ఆర్. షాజాదాగా బాగానటించ కలిగాడు చిన్న లైలాగా నటించిన బేబీ కృష్ణవేణి ఎంతో నేర్పుతో చురుకుగా నటించింది. ప్రేమ ఘట్టాలలో ఆమె అంత చిన్నతనములో ఆ విధంగా నటించ కలిగిందంటే, చెప్పుకోదగ్గ విషయం

ముఖ్యంగా చిత్రంలో మనకు కనుపించే లోపాలు చిన్నతనంలో లైలా ఖైస్‌లమధ్య ప్రౌఢ ప్రేమ చూపించటం. అమాయకులగు బాల బాలికల హృదయాలో కామినీ కాముకుల ప్రేమ ఎట్లుండ గలదు? వారిరువురను ప్రేమికుల వలె నటింపజేయుట చాల అసహజము—

"లైలా మజ్ను"లు స్వప్నంలో ఆనందించిన సీనులో సెట్టింగు గొప్పగావుంది కాని దుస్తులతీరు, సంగీతము కేవలము పాశ్చాత్య అనుకరణగా తయారై చిత్రంలో స్వాభావికతను, కథకు తగిన నైసర్గితను, అతిక్రమించుటచే, పేలవమై పోయినది. చివరకి లైలా మజ్నూలు ఎడారిలో కలసికొని మరణించిన సీను ఎంతో అద్భుతంగా తీయ వలసింది చప్పగా తయారైంది నాగేశ్వరరావుకు నేపథ్య సంగీతంలో ఘంటసాల చక్కగా పాడాడు ఆ కంఠంలో గంభీరత ఉంది అయితే చిత్రంలో పాటలకంటే చెప్పుకో దగ్గవిలేవు.

ఫోటోగ్రాఫ్, సెట్టింగులు, సౌండు విషయములలో దర్శకుడు శ్రమపడ్డట్టే కనపడుతుంది అయితే యిట్టి గాథలను వెండితెర్పై చిత్రింప జూచుట ఒక విధమైన సాహస మేమో! అందునూ, యిదివరలో ఇంకొక భాషలో ఒకమారు తీయబడి, అది చాల పేరుకీర్తులు సంపాదించిన మీదట, దానినే యింకొక భాషలో తీసి పేరు బడయుట చాలా కష్ట సాధ్యమైనపని.

సతీహితసమితి శారదా గ్రంథాలయ నూతన గృహ ప్రవేశ మహోత్సవము, తాడేపల్లిగూడెం

17వ వార్షికోత్సవము, శ్రీ గాంధీజీ జయంత్యుత్సవము

2—10—49వ తేదీన మధ్యాహ్నము 3 గంll కు శారదా గ్రంథాలయ నూతన గృహప్రవేశ మహోత్సవము, శ్రీ గాంధీజీ జయంత్యుత్సవము, శ్రీమతి వేమగంటి పాపాయమ్మగారి అధ్యక్షతక్రింద జయప్రదముగా జరిగినది.

పురవీధులలో అధ్యక్షురాలి వూరేగింపు నూతన గృహ ప్రవేశములు ముగిసిన తదుపరి పతాక వందనోత్సవము జరిగెను.

బాలికల ప్రార్థనానంతరము జాతీయ గీతములు పాడబడెను. తరువాత అధ్యక్షురాలిని పుష్ప మాలాలంకృతులను జేసి స్వాగత పత్ర మొసంగిరి. సమితి అధ్యక్షురాలు శ్రీమతి పట్టం రూపావతమ్మగారిచే స్వాగతోపన్యాస ఇవ్వబడెను. కార్యదర్శిని శ్రీమతి దామోజీపురపు లక్ష్మీనరసమ్మగారు సంవత్సర నివేదిక, సంఘ నియమావళి, దానపట్టా, సందేశములను చదివెను. సమితి శ్రేయోభిలాషులు, సంఘ సేవాపరాయణులు అగు శ్రీ డాక్టరు తేతలి సత్యనారాయణమూర్తిగారు, సమితికే కాక గ్రామమునకు చేసిన అమూల్య సేవను కీర్తించుచు అభినందించిరి. పోడూరి మృత్యుంజయరావుగారు ఆంధ్ర దినపత్రికను, వెలగల ధనిరెడ్డిగారు కృష్ణా పత్రికను, పట్టం రూపావతమ్మగారు గృహలక్ష్మి, అచలబుషి వేమన, దివ్యజ్ఞాన దీపికలను ఉచితముగా నొసంగుచున్నందులకు అభినందించడమైనది.

తరువాత శ్రీమతి తేతలి సావిత్రమ్మగారు జమాఖర్చులను చదివిరి. స్వాతంత్ర్య ప్రదాతయైన పూజ్య బాపూజీయొక్క గుణగణములను కీర్తించుచు అధ్యక్షురాలు, కార్యదర్శిని ఉపన్యసించిరి. అధ్యక్షురాలు స్త్రీ సమాజములయొక్క ఆవస్యకత, గ్రంథాలయముల ఉపయోగము, ఆహార సమస్య మొదలగు వివిధ విషయములను గూర్చి గంభీరోపన్యాస మొసంగిరి.

తరువాత అల్పాహారవిందు జరిగెను. సభకు హాజరైన దేవులపల్లి సత్యవతమ్మగారుపన్యసించిరి. గృహప్రవేశోత్సవమునకు ఆహ్వానింపబడిన రామసుబ్బమ్మగారు వీలులేక రానందున, శ్రీ బాపూజీ జయంతుత్సవమునకు ఆహ్వానితులయిన సోదరి వేమగంటి పాపాయమ్మగారే పై కార్యక్రమములను జయప్రదముగా జరిపిరి. పురస్త్రీలు చాలామంది సభలో పాల్గొనిరి.

అధ్యక్షురాలి యంత్యోపన్యాసముతోను, కార్యదర్శిని వందన సమర్పణతోను, బాలికల "జనగణమన" గానముతోను సభ ముగిసెను.

దా. లక్ష్మీనరసమ్మ.


★

మన సామెతలు

1. బాధకు ఒకకాలము, భాగ్యానికి ఒక కాలము.
2. మితము తప్పితే అమృతమయినను విషమే.
3. బావమరిది బ్రతుకుకోరును, దాయాది చావుకోరును.
4. మూర్తి కొంచమయినా కీర్తి విస్తారము.
5. లేవలేని అత్తకు ఓపలేని కోడలు.
6. మోసేవానికి తెలుసును కావటి బరువు.
7. లోన వికారము బయట శృంగారము.
8. విందైనా మందైనా మూడు పూటలు.
9. వండవే పెండ్లికూతురా అంటే కుండ తీసుకొని నీళ్లకు వెళ్లుతాను అన్నదట.
10. వేడినీళ్లకు ఓర్వనమ్మ సహగమునము చేస్తానన్నదట.
11. వ్యాధికి మందు వున్నదిగాని, విధికి మందు వున్నదా ?

కూర్పు : శ్రీమతి మన్యం కామేశ్వరీదేవిగారు

గ్రంథ సమీక్ష



యోగసూత్ర సిద్ధాంతము

రచన ఆంధ్ర కేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు గారు ప్రకాశకులు: మేనేజరు 'శిల్పి' 10 నరసింగపురం వీధి. మౌంటురోడ్డు, మద్రాసు. వెల రూ. 2—4—0 పుటలు 234; మొదటి కూర్పు (1948); శిల్పి గ్రంథ మాలికలో ద్వితీయ కుసుమము.

"గ్రంథస్థ విషయము మహత్తరము; శైలి సులలితము. ప్రవేశికలో శిల్పి సంపాదకులు శ్రీ గణపతి శాస్త్రిగారు, సాధారణముగ జనులు యోగశాస్త్రమంటే శరీరారోగ్యమునకు సంబంధించిన ఆసనాభ్యాసములు, ప్రాణాయామములునని పొరబడుచున్నారనియు, కాని "షడ్దర్శనాలలో ముఖ్యమైన యీ యోగసూత్రము ఒక ప్రముఖతాత్త్విక గ్రంథమని ప్రాచ్య పాశ్చాత్యతాత్త్విక విజ్ఞానులంతా గౌరవిస్తున్నా" రన్నారు.

యోగ సూత్రములలో యిమిడియున్న గొప్ప మానసిక శక్తుల తరచి యుద్ధరించి, తన్మూలముగ దుఃఖరహిత వున్నత స్థితినందుకొనుటయే యోగోద్దేశము. శ్రీ ప్రకాశం పంతులు గారు యిదివరకే భగవద్గీతాది గ్రంథాలకు వ్యాఖ్యలు రచించారు. ఈ యోగసూత్ర సిద్ధాంతంలో రచయిత పతంజలి యోగదర్శనములోని విషయముల జెప్పి, బౌద్ధ జైనాది ప్రాచ్య, పాశ్చాత్య సిద్ధాంతములలో నున్న తాత్త్విక విషయాలు విపులీకరించి, యొండొంటి తారతమ్యముల విశదము జేసియున్నారు.

గ్రంథము నందలి ముఖ్య విషయములు ఆరు. అవి— యోగము, మనస్సు వ్యాపారములు, యోగ సూత్రములు, వల్లభాచార్య మతిసిద్ధాంతము, బౌద్ధ సిద్ధాంతము, ఉపనిషత్తుల లోని సిద్ధాంతములు. వీనిని సంఖ్యా నామముల తోనారు ప్రకరణములుగ జెప్పిన బాగుండెడిది. ఒక్కొక్క విషయము హైందవ, పాశ్చాత్య, వేదాంత, మానసిక శాస్త్రజ్ఞుల రచనల సామ్య, భేదముల దెల్పుచు చక్కగ రచితమైనది. యోగములలో భక్తియోగము శ్రేష్ఠమైనది. ఈ సందర్భమున అశ్వినీ కుమారుని భక్తియోగము స్మృతికివచ్చుచున్నది. గ్రంథాంతమున రచయిత బౌద్ధము ను హిందూ మతములో భాగముగ గ్రహించవలెననియు; "యోగ సూత్ర సిద్ధాంతములు మిగిలిన సిద్ధాంతములతో పోల్చుచు సంగ్రహముగ వివరించినాము. ఈ వివరణమును బట్టి యిది యెట్టి యుత్కృష్టగ్రంథమో పాఠకులు తెలిసికొని వుందురు. జన సామాన్యము యోగసూత్ర రహస్యములు తెలిసికొనుటకు యోగ సూత్రము పఠించి చరితార్థులగుదురు గాక" యని హెచ్చరించారు.

గ్రంథముఖపత్రముపై శ్రీ పంతులుగారి వ్యంగ్య చిత్రము గలదు. రెండు పుష్పపత్ర చిత్రములతో శోభితమైన ఖద్దరు వస్త్రములతో చేయబడినది. ముద్రణము రమ్యముగనున్నది. రచయితలు, ప్రకాశకులు యిట్టి యుజ్జ్వల గ్రంథరాజములను ఆంధ్రలోకానికి అర్పిస్తారని ఆశించుచున్నాము.

—డాక్టరు వారణాశి యశోదాదేవి యం. ఏ. డి. లిట్.

* * *

అహల్యా గౌతమము (పద్యకావ్యము)

కావ్యకర్త: బులుసు వెంకటేశ్వర్లు బి. ఎ. ప్రతులకు: కాకినాడ వెల రూ. 2—0—0 పేజీలు 126.

అహల్యా గౌతమము ఇది పద్యకావ్యము ఇందు వుత్తమ పతివ్రతలలో ఒక్కతెయై, ద్రౌపది, సీత, తార, మండోదరి, వీరితో గూడి పంచకన్యలలో ప్రథమ గణ్యయైన అహల్యా సాధ్వికిని బ్రహ్మర్షి శేఖరుడగు గౌతమమహర్షికిని నగ్ని సాక్షిగనైన వివాహాది వృత్తాంతము, వారి యాదర్శ సంసారిక జీవనము, వారు లోకమున కొనర్చిన మహోపకృతులు వర్ణింపబడినవి. ఒకప్పుడు ప్రజలు క్షామంలో ఎచ్చట తిండి లేక బాధపడుచూ చివరకు అహల్యా గౌతముల వద్దకు వచ్చి వేడుకొనిన పిమ్మట అహల్య తన పాతివ్రత్యమహిమచే వారి నందరను ఆదరించి వారికి అన్నపానాద్యులొసంగెను.

కవి మాటలలో—

సీ॥ కమనీయదళి కాక(మపత్త్రింబుల
బూతజలంబుల చేతజల్లి
యాపిమ్మట బవిత్రమైన యాజ్యంబును
నమలినత్వార్థమై యభిఘరించి
షడ్రసోపేత భోజ్యంబు లొక్కొక్కచే
శరవేగమునను విస్తళ్ల బెట్టి
సమధురాహారాది శాల్యాన్నములు బెట్టె
సమధికంబైన పచ్ఛళ్లనుంచి

గీ॥ పిండివంటలు మెండుగా, బెట్టెమరల
నభిఘరించి నివేదనమాచరింపు
డని యెలుంగెత్తి పేర్కొనెనా యహల్య
యొక్కతెయు గోటి యువతులయొద్ది వడసి.

అని అహాల్యా సాధ్వియొక్క శక్తి సామర్థ్యాలను వర్ణించాడు. అచ్చు బాగుగనే వున్నది. కాగితములు కూడ బాగున్నవి. శైలి సులభముగ, మృదువుగనున్నది గనుక పిన్నలు పెద్దలు చదువుట కుపకరించును. —రా. లక్ష్మి.

విప్లవ శ్రీ. (ఖండకావ్యము)

రచన :—కవిరావు, బాలకవి, ఇంకొల్లు వెంకటేశ్వర రావు. ప్రతులు :—ప్రజా సాహిత్య పరిషత్తు తెనాలి. ముద్రణాలయము :—నందాల ప్రెస్ తెనాలి. పేజీలు 51. మొదటి పద్యసంపుటి.

విప్లవ శ్రీ ఖండకావ్యము. దీనిని రచించిన వారు పది సంవత్సరముల బాలురు. ఇంత చిన్న వయస్సున యింత పాండితి యెటులబ్బెనో ఆశ్చర్యము. శైలి, ఎటులున్నను అతను రచించుట గొప్పమాట. అచ్చు తప్పులెక్కుడుగ నున్నవి. ఈ పద్యములు వేరువేరు సమయాల్లో వ్రాసినట్లు అగుపించుచున్నది. అందువలన భావములోనే గాక భావాల్లో కూడ ఒకదానికొకటి పొందలేదు. వ్రాసినదంతా స్వంతము కాక పోయిన యింత అల్పవయస్కులు కవులయారన్న మన ఆంధ్రమాత యెంత అదృష్టవంతురాలో మనమే గర్వపడాలి!

అదీగాక యింత అల్పవయస్సులో ఈ బాలకవి వేదాంతునివలె నున్నాడు. "కర్మభూమి, ఏల మతము, మేలుకో, హరి జనులు" అన్న శీర్షికలలో కవిరావు సాంఘిక ఆశయాలు వెలువడినవి. కర్మభూమి, ఏల, ప్రత్యేక స్థానాన్ని అలంకరించినవి. మార్క్సు అనే శీర్షిక కవిరావు రాజకీయ ఆశయాల్ని బయలుపరుస్తున్నది. ఆంధ్రుడను శీర్షిక యీ కావ్యంలోకల్లా వుత్తమ రచన. పుస్తకంలోని సారాన్నే గాక, రచయితలోని నిగ్గును కూడా తెల్పి వడకట్టి చూపుతుంది. పుస్తకానికి ఈ శీర్షికయే వెల తెచ్చినది. ఇటువంటి బాలకవులు భారతదేశములో వృద్ధికావాలని మా ఆశయం. —రా. లక్ష్మి.

ప్రార్థన

కవయిత్రి : స్థానాపతి రుక్మిణమ్మ. ప్రతులకు స్థానాపతి రుక్మిణమ్మ విశాఖపట్టణం.

జీవితంలో మానవుడు తన కష్టసుఖాలను దైవానికి విజ్ఞప్తిచేసుకోవాలంటే ముఖ్యమైన సాధనం ప్రార్థన. వారిరువురికి మధ్య సంబంధబాంధవ్యాలను కలిగించేదే ప్రార్థన. ప్రార్థనవలన మనస్సుకు శాంతి, తృప్తి, ఆనందము కలుగుతవి. ప్రతి జీవి తను దైవాన్ని స్మరించి ప్రార్థన చేసి తన బాధలను మరువ కలుగుతాడు. ప్రార్థన వలన అత్యుత్తమమైన శక్తిని పొందగలడు.

ప్రార్థన విషయమై అనేకవిధాలను అనుసరించవచ్చును. మన హింధూ ధర్మశాస్త్ర ప్రకారం మన సాంప్రదాయమునకు అనుకూలంగా శ్రీమతి స్థానాపతి రుక్మిణమ్మగారు ప్రార్థన అనే చిన్న పుస్తకాన్ని ప్రచురించారు.

ప్రథమంలో 'దేవుడు ఒక్కడే' అనే సిద్ధాంతముతో ప్రారంభించారు. ప్రార్థనలో ఉపనిషత్తులలోని సంస్కృతశ్లోకాలకు అర్థంతో ప్రచురింపబడింది. ఈ ప్రార్థనలో ముఖ్యముగా ప్రతివారు గమనించవలసినవి, ఎన్నో చక్కని వుద్దేశములు కలవు. మానవుడు తన్ను తానుముందు గుర్తించుకొని తనజీవితములో తనకు ప్రాధాన్యత యిచ్చిన దైవాన్ని వుద్దేశించి తన జీవితంలో తన ధర్మములను నెరవేర్చు కొనుటకై

దైవాన్ని తనకు శక్తిని, బుద్ధిని, ప్రసాదించమని ప్రార్థించుట.

పరమేశ్వర ప్రార్థన ప్రతివారు సులువైనమార్గమున చేసికొనుటకు ఈ 'ప్రార్థన' పుస్తకము ఎంతో అనుకూలముగా వున్నది. ప్రతి శ్లోకములోను, దైవాన్ని వుద్దేశించి మానవుడు, తన బలహీనతను తొలగించి, సమర్థత నిచ్చి తన్ను చక్కని మార్గములో పెట్టుమని ప్రార్థించుటయే. శ్రీ స్థానాపతి రుక్మిణమ్మగారు శ్రమపడి భాష్య గ్రంథాల తోడ్పాటుతో ప్రార్థన పుస్తకాన్ని పూర్తిచేశామని వారు ప్రవేశికలో వ్రాశారు. వచనంలో ఎంతో చక్కగా వ్రాసినందుకు వారు అభినందనీయులు. —జి. ప్రభ.

ఆంధ్ర జ్యోతి

దీపావళి ప్రత్యేక సంచిక. వెల యెనిమిదణాలు. పేజీలు 120.

ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక మా కార్యాలయానికి చేరింది. ముఖచిత్రం దీపావళి పండుగ, పిన్నలు పెద్దలు, పురుషులు, స్త్రీలు టపాకాయలు కాల్చుట, ముత్తైదువలు కోవెలకు వెళ్లుచున్నట్లు, టపాకాయలు కొనేవారు కొనే సందడిలో, అమ్మేవారు అమ్మే సందడిలో, పంచరంగుల చిత్రాలతో వెలువడింది. ఈ సంచిక చక్కని కథలతోను, ఎక్కువ నాటికలతోను ఒకటి రెండు రాజకీయ వ్యాసములతోను, వెనుక లోపల సినీమా ప్రకటనలతోను, మహాబలిపుర దేవాలయ, కంచి కైలాసనాథ దేవాలయ శిల్ప చిత్తరువుతోను, భావపరిచయ పోటీలు, స్త్రీలను పురుషులను వెక్కిరించు బొమ్మలతోను వెలువడింది.

ఇందు పురుషులేగాక స్త్రీలుకూడ రచించిరి. ముఖ్యముగ శ్రీమతి మాలతీచందూర్ వ్రాసిన "లగ్న బలిమి", మునిమాణిక్యం నరసింహారావుగారి "జానకి విలాసము" బైరాగి వ్రాసిన "పలాయన గీతం" సోమంచి యజ్ఞన్నగారి, రాజకీయ వుపన్యాస నాటిక "యమునా తీరే ఎవరికి వారే" పన్యాల రంగనాథరావుగారి నాటికి "పరిష్కారం" పాలంకి వెంకట రామచంద్ర మూర్తిగారి "అసూయ" మొదలగునవి బాగున్నవి. రాజకీయ, సాంఘిక రచనలు, స్త్రీల సమస్యల మీద రచనలు తక్కువ. ఇది ఒక లోటనక తప్పదు. —రా. లక్ష్మి.

కలై మగళ్ (దీపావళి ప్రత్యేక సంచిక)

సంపాదకులు శ్రీ ఎన్. రామరత్నం, ఎం. ఏ., బి. ఎల్. 55/56 ముండకన్నియమ్మన్ కోవిల్ వీధి మైలాపూరు మదరాసు. ప్రచురణాలయము : మదరాసు లాజర్నల్ ప్రెస్.

మాకు "కలై మగల్" అక్టోబరు దీపావళి సంచిక చేరినది. ఈ దీపావళి సంచిక ఆకర్షణీయమైన త్రివర్ణ చిత్రములతోను, సుప్రసిద్ధ తమిళ ఆస్థానకవులు, గౌరవనీయులగు మంత్రులు, యిద్దరు ముగ్గురు స్త్రీ రచయితలు ఇంకా తదితర రచయితల, వ్యాసములు, రచనలతోను వెలువడినది. ఇతరు యింపైన కథలు, అనువాదము, సాహిత్యము, సీరియల్ నవల, జీవితకథలు మున్నగునవి కలవు.

ఇందు సర్. సి. పి. రామస్వామి అయ్యర్ గారి "తాయి-మానవర్" అను వ్యాసము, డాక్టర్ రాజన్ గారి "వాయై యడి వాయై" అను వ్యాసము, ఆస్థాన కవి వి రామలింగ పిళ్లైగారి "కట్రుడుకై మన్నళవు", దీపాల వరస (చిత్రములు) మున్నగునవి మెచ్చుకోదగినవి. ఇందులో స్త్రీ రచయితలు వ్రాసిన కథలేగాని "స్త్రీల" సమస్యలను గూర్చినవి, స్త్రీ విజ్ఞానమునకు సంబంధించినవినైన వ్యాసములు లేవు.

"కలై మగళ్" స్త్రీలయొక్క సమస్యలను గురించి చక్కని వ్యాసములు రచయితలచే వ్రాయించి స్త్రీలకు ప్రాముఖ్యత ఇచ్చినచో బాగుండును. —వై. పద్మ.

★



Edited and published by G Durgabai, M.A., B.L., at the Andhra Mahila Sabha, Mylapore, Madras,

లక్ష్మమ్మ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్

టైపు, షార్ట్‌హాండు తరగతులు, ప్రతిదినము

10 గం॥ నుండి **6** గం॥ వరకు

జరుగుచున్నవి.

నవంబరునుండి తిరిగి, ఏప్రిల్ పరీక్షలకు శిక్షణ ప్రారంభమగును.

చేరగోరువారు వెంటనే దరఖాస్తు పెట్టుకొనవలెను.

మాస రుసుము :- టైపు ... 3-0-0 షార్ట్‌హాండ్ ... 3-0-0

కరెస్పాండెంట్,
లక్ష్మమ్మ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్,
ఆంధ్రమహిళాసభ.

స్త్రీ సేవా మందిరము.

[బాలోద్యానవనము]

మైలాపూరు - మదరాసు.

ఇందు స్త్రీలకు, దుస్తులపై రంగుఅద్దకపు పనిలో తరిఫీదు యియ్యబడును. శిక్షణ రుసుము లేదు.

చీరెలు, పావడగుడ్డలు, జాకెట్లకు చింట్లు మున్నగునవి, అనేకమాదిర్లలో తయారగుచున్నవి. అద్దకపు ధరలు సరసమైనవి.

ఒకసారి - మధ్యాహ్నము 3 గం॥ - 5 గం॥ లోగా వచ్చి చూడండి -మీ ఆర్డరులిచట ఇచ్చి, బీదవారికై ఏర్పడ్డ యీసంస్థను పోషించండి.

నిర్వాహకులు.

Wrapper printed at Ananda Press, Madras.